Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 60 • సంచిక: 236 • గురువారం 31 ఆగస్టు 2017 • విజయవాడ ❋ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ దశమి (పూర్తి) ; నక్షత్రం: మూల తె. 4.53 వరకు, అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: రా. 9.45 నుండి 11.30 వరకు; వర్జ్యం: ఉ. 11.07 నుండి 12.54 వరకు, తదుపరి తె. 3.06 నుండి 4.53 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.59 నుండి 10.50 వరకు, తదుపరి మ. 3.05 నుండి 3.57 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

బీసీలకు కొత్త పథకం

చంద్రన్న పెళ్లి కానుక



• ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు • ఏటా 40 వేల వివాహాలకు ఆర్థిక సహాయం • చేతివృత్తుల వారికి 'ఆదరణ' • బీసీలతోపాటు కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు • వరాలు ప్రకటించిన సీఎం చంద్రబాబు 8

నరేగా నిధులతో అమరావతి గ్రామాల అభివృద్ధి - 2లో



పోలవరానికి కేంద్రం రూ.980 కోట్ల విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.980 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుకయ్యే మొత్తం వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఎప్పటి కప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నివేదికలు పంపిస్తే అందుకనుగుణంగా నిధుల ను విడుదల చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవలే ముఖ్య మంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు పోలవరం ప్రాజెక్టుకు ఖర్చు పెడు తున్న నిధులను సత్వరం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరిన సంగతి విదితమే. రాష్ట్రానికి చెందిన కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి వై.సత్యనారాయణ చౌదరి మంత్రి అరుణ్‌జైట్లీతో సంప్ర దింపులు జరిపి నిధుల విడుదలకు ఒత్తిడి తెచ్చారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు రాష్ట్రప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేసిందని ఆయన మంత్రితో జరిగిన చర్చల సందర్భంగా చెప్పారు. కేంద్ర జలవనరుల సంఘానికి అందిన నివేదిక ఆధారంగా ➪ 8వ పేజీలో...

కొత్త పీఆర్సీపై

కసరత్తు

నవ్యాంధ్రలో మొట్టమొదటిది • చైర్మన్ నియామకంపై చర్చ

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పి.ఆర్.సి ని నియమించే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో గత అయిదు దశాబ్దాల కాలంలో ఇంతవరకు పది పీఆర్సీలను నియమించగా, 11 వ వేతన సవరణ సంఘాన్ని వచ్చే డిసెంబర్‌లో నియమించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం వుంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో 10 వ పీఆర్సీని నియమించారు. అయితే రాష్ట్ర విభజన జరిగిన అనంతరం పీఆర్సీ నవ్యాంధ్ర రాష్ట్రంలో ఒకటవ నంబరుతో పీఆర్సీని ప్రారంభిం చాలనే యోచనలో ప్రభుత్వం వుంది. ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పేరుతో పిలవబడగా, విభజన అనంతరం సైతం అదే పేరుతో కొనసాగుతోందని, ఇలాంటి పరిస్థితులలో 11 వ నంబరు పేరుతో పీఆర్సీని నియమిస్తే ఎలా వుంటుందనే దిశగా ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలనే యోచనలో రాష్ట్ర ఆర్థిక శాఖ వుంది. అదే విధంగా నూతన రాష్ట్రంగా ఏపీ అవతరించాక కొత్త పీఆర్సీ చైర్మన్‌గా ఎవరిని నియమించాలనే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 10 వ పీఆర్సీ గడువు వచ్చే జులై నెలలో ముగియనుండగా, ఆరు నెలలు ముందుగానే చైర్మన్‌ను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. గత పీఆర్సీ చైర్మన్‌గా ఆర్.పి.అగర్వాల్ నియమితులయ్యారు.



పెండింగ్‌లోనే 10వ పీఆర్సీ బకాయిలు

కాగా రాష్ట్రంలో దాదాపు 12 లక్షల మంది ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు వున్నారు. పొరుగునే వున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా పీఆర్సీ బకాయిలను చెల్లిస్తోంది. వారితో కలిసి పనిచేసిన ఏపీ ఉద్యోగులకు ఇంతవరకు బకాయిలు విడుదల కాకపోవడం ఆందోళన కలిగిస్తోందనే అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. 2016 జులై 18వ తేదీ నుంచి 2017 మార్చి వరకు అయినా 9 నెలలు బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌ను ఉద్యోగులు చేస్తూ వస్తున్నా ఎన్నోసార్లు ఇందుకు సంబంధించి ఉద్యో గవర్గాలు ప్రభుత్వాన్ని కలిసి విన్నవించాయి. కొత్త పీఆర్సీ రానున్న తరుణంలో పాతవి బకాయి పడడంతో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు నేరుగా ➪ 8వ పేజీలో...



పీఎస్ఎల్‌వీ సీ-39 నేడే ప్రయోగం

• నింగిలోకి 'దిక్సూచి' ఉపగ్రహం • నేటి సాయంత్రం గం.6.59 లకు ముహూర్తం 8



హడావుడిగా దిగిపోయిన ప్రయాణికులు

విశాఖలో 'ఇండిగో'కి తప్పిన ముప్పు

• ప్రొఫెల్లర్‌ను ఢీకొన్న పక్షి • గుర్తించిన పైలెట్ • టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే ల్యాండింగ్ • ప్రయాణికులు సురక్షితం 8

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో

ఫాతిమా బాధితులకు సీట్లు




• స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు • సీట్లు పెంచి కేటాయిస్తాం • వారంలోగా వివరాలిస్తాం: కామినేని • 'సుప్రీం'లో విచారణ 21కి వాయిదా

అమరావతి, ఆంధ్రప్రభ : ఫాతిమా విద్యార్థుల విషయం మీద సుప్రీం కోర్టు స్పష్టత ఇచ్చిందని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు పెంచి వారికి కేటాయిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కడప ఫాతిమా కళాశాల విద్యార్థులు 15 సార్లు తనను కలిశారని తాను వారిని సీఎం వద్దక ు రెండుసార్లు, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వద్దకు ఒకసారి తీసుకెళ్లాననీ గుర్తుచేశారు. విద్యార్థులను ఏ విధంగా ➪ 8వ పేజీలో...

ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ

క్రీమీలేయర్



• ఓబీసీలకు మరింత ప్రయోజనం • రూ. 8 లక్షల పెంపునకు ఆమోదం • కేంద్ర మంత్రి వర్గ నిర్ణయం • కిందిస్థాయి ఉద్యోగుల పిల్లలకు ప్రయోజనం: జైట్లీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగ నియామకాలకు ఓబీసీ సంపన్న శ్రేణి పరిమితిని వర్తింపజేస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఈ మేర కు నిర్ణయం తీసుకుంది. మంత్రుల బృందం (జివోఎం) ఇచ్చిన సిఫారసులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసిందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కిందిస్థాయి ఉద్యోగాల్లో పనిచేస్తున్న పిల్లలకు కలుగుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వ రంగ సంస్థల కిందిస్థాయి ఉద్యోగుల పిల్లలకు అందుతాయని అరుణ్‌జైట్లీ తెలిపారు. రూ. 8 లక్షల ఆదాయపరిమితి ప్రభుత్వ రంగస్థలకు కూడా వర్తిస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విద్యా, ఉద్యోగ నియామకాల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషను అమలవుతున్నాయి. అయితే ఇన్నాళ్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితమైన క్రీమీలేయర్‌ను విస్తరిస్తూ ప్రభుత్వ రంగసంస్థలను దీని పరిధిలోకి తీసుకువచ్చారు. ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల్లో క్రీమీలేయర్‌ను అనుసరించి ఉద్యోగ నియామకాలు చేపడతారు. ఇందుకు అవసరమైన నిబంధనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ఆయా ప్రభుత్వరంగ సంస్థల్లో కిందిస్థాయిలో పనిచేస్తున్న ఓబీసీ ప్రభుత్వోద్యోగుల పిల్లలు ఈ ప్రయోజనాలు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. గ్రూప్ -ఎ, బి పోస్టులు, ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో ఉన్న ఉద్యోగులను ఈ పరిధి నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 24 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు కేంద్రమంత్రి వర్గం పరిష్కారాన్ని చూపింది. దీని ఫలితంగా ఆయా సంస్థల్లో లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రుల బృందం ఇచ్చిన సిఫారసుల మేరకు క్యాబినెట్ ఈ నిర?యం తీసుకుంది. సంపన్న శ్రేణి పరిమితిని 6 నుంచి 8 లక్షలకు పెంచడం ద్వారా రిజర్వేషన్ల ప్రయోజనాలను మరింతమంది ఓబీసీలు విస్తృతంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. పెరుగుతున్న ధరల సూచిని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ➪ 8వ పేజీలో...



ఆశలు రేకెత్తిస్తున్న ఎగువ ప్రాజెక్టులు



• నీటి కోసం ఏపీ ఎదురుచూపులు • ఆల్మట్టి, తుంగభద్రలకు చేరుతున్న వరద

అమరావతి, ఆంధ్రప్రభ : ఎగువన ఉన్న అల్మట్టి, తుంగభద్ర ప్రాజెక్టులకు వస్తున్న వరద నేపథ్యంలో కింది ప్రాజెక్టులకు కూడా నీరు వస్తుందనే ఆశలను రేకెత్తిస్తోంది. పశ్చిమ కనుమల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్మట్టిలోకి రోజుకు 20వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. తుంగభద్ర డ్యామ్‌కు కూడా 17 వేల క్యూసెక్కులకు పైగానే వరద వస్తోంది. దిగువన ఉన్న జూరాల,శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు ఆల్మట్టి, తుంగభద్ర నీటిని విడుదల చేస్తారని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. ఈ విషయమై ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇరిగేషన్ అధికారులు తాగునీటి అవసరాలు కోసం కేంద్ర జలసంఘానికి లేఖలు రాసిన సంగతి తెలిసిందే. కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్మట్టి, నారాయణపూర్ పాటు తుంగభద్ర డ్యామ్‌కు భారీగా వరద నీరు వస్తోంది. ఆల్మట్టికి ఈనెల 26న 6,871 క్యూసెక్కులు, 27న 17,886 క్యూసెక్కులు, 28న 20,792 క్యూసెక్కులు, 29న 20,803 క్యూసెక్కులు వరద నీరు వచ్చింది. ఈ వరద నీటిని ఆల్మట్టి నుంచి కిందికి వదులుతారని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. ఇదివరకే వచ్చిన వరదలతో ఆల్మట్టి నిండిన విషయం తెలిసిందే. ఇక తుంగభద్ర నదిపై ఉన్న తుంగభద్ర డ్యామ్‌లోకి 61.74 టీఎంసీల నీరు చేరింది. మంగళవారం ఒక్కరోజే 17వేల క్యూసెక్కుల నీరు వచ్చింది. వారం,పది రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగితే డ్యామ్ నిండి కింద ఉన్న ఆర్డీయస్‌కు, కేసీ కెనాల్‌కు కొద్దిగానైనా నీరు విడుదలచేసే అవకాశం ఉంటుంది. ఏపీ,తెలంగాణ రాష్ట్రాల మంచి నీటి అవసరాల కోసం 15 టీఎంసీలు నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి లేఖలు రాసినా స్పందించలేదు. విజయవాడలో జరిగిన కృష్ణా ➪ 8వ పేజీలో...

మంగళగిరి ఎయిమ్స్ నిర్మాణంపై ప్రధాని మోడీ సమీక్ష

వేగవంతం చేయాలని సూచన 2



బలపరీక్షకు గవర్నర్ 'నో'

• దినకరన్, ప్రతిపక్షాలకు షాక్ • పళని ప్రభుత్వానికి ఉపశమనం 5



99 శాతం రద్దయిన నోట్లు

ఆర్‌బీఐ గూటికి

• 1శాతం = రూ.16 వేల కోట్ల ఆదాయం • ముద్రణకు 7 వేల కోట్ల వ్యయం 6

'నరేగా' నిధులతో అమరావతి గ్రామాల అభివృద్ధి

●హైబ్రీడ్ యాన్యుటీ మోడల్‌లో చేయాలి ●సీఆర్డీఏ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతిలోని ప్రతిపాదిత పదమూడు జోన్లల్లో మూడు జోన్లను 'హైబ్రీడ్ యాన్యుటీ మోడల్(హెచ్ఏఎం)'లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) సమీక్షా సమావేశం నిర్ణయించింది. నాలుగు, ఐదు, తొమ్మిది జోన్లను మొత్తం రూ.6,900 కోట్లతో రహదారులు, వంతెనలు, తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ వంటి మౌళిక వసతులను హెచ్ఏఎం ద్వారా కలిపించాలని భావించింది. జోన్-4కు రూ.817 కోట్లు, జోన్-5కు రూ.2,383 కోట్లు, జోన్-6కు రూ.3,714కోట్లు వ్యయం కానున్నట్లు నిర్ణయించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సీఆర్‌డీఏ సమీక్ష సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పట్టణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో రాజధాని అమరావతి ప్రాంతంలోని 29 గ్రామాల అభివృద్ధి చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల్లో పరిశుభ్రత, రహదారుల నిర్మాణం వంటి వసతుల కల్పన కోసం నరేగా నిధులు వినియోగించాలని సూచించారు. న్యాయ, శాసన, కార్య నిర్వాహక వ్యవస్థల భవనాలు, ఇతర పౌర నివాస సముదాయాలను 1.47కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టినట్లు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని, ఇందుకు రూ.11,602 కోట్లు వ్యయం కాగలదని అంచనా వేసినట్లు వారు సీఎంకి వివరించారు. అమరావతిలోని శాఖమూరు పార్కు ప్రాంతానికి సంబంధించి అభివృద్ధి నమూనాలపైనా సమావేశంలో చర్చకు వచ్చింది. 280 ఎకరాలలో ఈ పార్కును ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఇరువైపులా, శాఖమూరు పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం సెప్టెంబర్‌రెండో వారంలో పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. అందమైన పూల మొక్కలు నాటడం ద్వారా పర్యాటకునలు కట్టిపడేయవచ్చని సీఎం చెప్పారు. అక్షరధామ్ నిర్మాణానికి నదీ ముఖంగా 30 ఎకరాలు కేటాయించాలని నిర్వాహకులు కోరినట్లు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. అమెరికాలో అక్షరధామ్ నిర్మాణం పూర్తి కాగానే అమరావతిలో నిర్మాణం చేపట్టనున్నారని చెప్పారు. దీనికి సాఉకూలత వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి దక్షిణ భారతంలోనే తలమానికంగా నిలిచేలా అద్భుత కట్టడాన్ని నిర్మించేలా చూడాలని అధికారులకు సూచించారు. రాజధాని ప్రాంతంలో 10వరకు హోటళ్లు త్వరలోనే నిర్మాణానికి నోచుకుంటాయని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ విద్యా సంస్థలు అమరావతిలో అడుగుపెట్టేందుకు వచ్చే నెలలో ఒప్పందాలు చేసుకోనున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మరో వైపు విజయవాడలోని రాజీవ్‌గాంధీ పార్కుతో సహా ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, ఇంద్రకీలాద్రి తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. కనకదుర్గమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడం, కేశఖండన శాల, క్యూలైన్ల ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ముగిసిన సీఆర్డీఏ కన్సల్టేషన్ వర్క్‌షాపులు

● అభిప్రాయాలు తెలిపిన వెంకటపాలెం, నీరుకొండ రైతులు

అమరావతి రాజధాని నగరంలో ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో చేపట్టనున్న రోడ్లు, వరద నియంత్రణ చర్యల ప్రాజెక్ట్ అమలు వల్ల ప్రభావితమయ్యే ప్రజల నుంచి అభిప్రాయ సేకరణలు, సూచనలు, సలహాలస్వీకరించటానికి సీఆర్‌డీఏ రెండు రోజులు కన్సల్టేషన్ వర్క్ షాపులు బుధవారంతో ముగిశాయి. బుధవారం వెంకటపాలెం, నీరు కొండల్లో నిర్వహించిన కన్సల్టేషన్ వర్క్‌షాప్‌లో రైతులు, వివిధ వర్గాల ప్రజలు, ప్రపంచ బ్యాంక్‌కు చెందిన నలుగురు ప్రతినిధులు, ఏపీసీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ చెన్నకేశవరావు, స్ట్రాటజీ డైరెక్టర్ జేఎస్ ఆర్‌కె శాస్త్రి, కాంపిటెంట్ ఆథారిటీలు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో రైతులు, వివిధ వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయడంతో పాటు వారి సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం మీద ప్రజలందరూ రాజధాని పనులకు సానుకూలత ప్రకటించడంతో పాటు అభివృద్ధి పనులు సత్వరమే జరగాలని ఆకాంక్షించారు. కొందరు రైతులు ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులకు ప్రత్యేక వినతులు చేయడం జరిగింది. రాజధానికి తాము స్వచ్ఛందంగా భూములు ఇచ్చామని, అభివృద్ధి శరవేగంగా జరగాలనే ఆకాంక్షతో ఉన్నామని, ప్రపంచ బ్యాంక్ నిధులు త్వరగా విడుదల చేయాలని కోరారు. చిన్న సమస్యల్ని పరిష్కరిస్తే భూ సమీకరణకు రాని భూముల్ని కూడా సమీకరణకు ఇచ్చేందుకు సిద్ధమని కొందరు ప్రకటించడంతోపాటు వారికి రాజధాని పట్ల ఆసక్తిని, ఆకాంక్షను తెలియజేశారు. వర్క్‌షాప్‌లో ప్రధానంగా పర్యావరణ, సాంఘిక నిర్వహణ ముసాయిదా, పునరావాస పాలసీ ముసాయిదా, పునరావాస కార్యాచరణ ప్రణాళిక -10 ప్రాధాన్య రోడ్లు, 10 ఉప రహదారులకు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా - పర్యావరణ నిర్వహణ ప్రణాళిక, వరద నియంత్రణ పనుల ప్రభావిత పునరావాస పాలసీల గురించి అధికారులు వివరించారు. సంబంధిత అంశాలపై తెలుగులో అన్ని వివరాలతో సమాచార పత్రాలను ప్రజలకు ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సిటిజన్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా సలహాలు తెలియజేయవచ్చని, మెరుగైన ముసాయిదాలు వచ్చే 20ఏళ్ల దాకా కార్యాచరణకు ఉపయోగపడతాయని స్పష్టంచేశారు.

సీఎంను కలిసిన బ్రిటిష్ హైకమిషనర్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో బ్రిటీష్ డిప్యూటి హై కమిషనర్ ఆండ్రు ఫ్లెమింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అనంతరం బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రు ఫ్లెమింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించారు.



సింధుకు సహకరిస్తాం

●మరిన్ని విజయాలు సాధించాలి: సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రముఖ బ్యాడ్‌మెంటన్ క్రీడాకారిణి పీవీ సింధు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో బుధవారం పీవీ సింధు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రపంచ మహిళల బ్యాడ్‌మింటన్ ఛాంపియన్ షిప్‌లో సింధు రజిత పతకం సాధించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సింధును అభినందించారు. ఇదే తరహాలో ప్రతిభ కనబర్చి మరిన్ని పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్,భారతదేశంలో పేరుప్రఖ్యాతులు నిలపాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ కలిగిన క్రీడాకారిణి అయిన సింధుకు డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలను సైతం సమర్ధవంతంగా నిర్వహించగలిగే సత్తా ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కితాబిచ్చారు. అమరావతి బ్యాడ్‌మెంటన్ అకాడమీ ఏర్పాటు ఎంత వరకూ వచ్చిందో కోచ్ గోపీచంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలోగా అకాడమీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.



పీవీ సింధును అభినందిస్తున్న చంద్రబాబు

మంగళగిరి ఎయిమ్స్ నిర్మాణంపై ప్రధాని సమీక్ష

● దేశ వ్యాప్తంగా మౌలిక వసతుల ప్రాజెక్టులను సమీక్షించిన మోడీ ● 21వ ప్రగతి సమావేశం నిర్వహించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏపీలో ఆలిండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ నిర్మాణంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమీక్ష జరిపారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రగతి సమావేశంలో ఆయన పలు మౌలిక వసతుల ప్రాజెక్టుల పనితీరును పరిశీలించారు. దేశవ్యాప్తంగా మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ స్వయంగా ప్రగతి పేరుతో పర్యవేక్షిస్తున్నారు. ప్రగతి 21వ సమావేశాన్ని నిర్వహించిన ప్రధాని పలు ప్రాజెక్టుల పనితీరును సమీక్షించారు. పేటెంట్స్, ట్రేడ్ మార్క్‌కు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సాంకేతికతను ఉపయోగించుకుని అవరోధాలను తొలగించాలని, ప్రపంచ ప్రమాణాలను అందుకోవాలని సూచించారు. దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న సుమారు 56వేల కోట్ల విలువైనమౌలిక వసతుల ప్రాజెక్టుల పనితీరును క్షుణ్ణంగా సమీక్షించారు. రైల్వే, రోడ్డు, విద్యుత్, చమురు పైప్‌లైన్‌లు తదితర ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కోరారు. ఢిల్లీ ముంబై పారిశ్రామిక కారిడార్, ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో ఎయిమ్స్ నిర్మాణంపై అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యూపీలో కొనసాగుతన్న ఎయిమ్స్ నిర్మాణ పనులను సమీక్షించారు. స్మార్ట్ సిటీ పథకం అమలు తీరును తెలుసుకున్నారు. స్మార్ట్‌సిటీ ఛాలెంజ్‌లో వివిధ నగరాలు పాల్గొనడాన్ని ప్రశంసించారు. నాణ్యతతో ఈ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని గిరి జనుల పునరావాసం అంశాలను పరిష్కరించాలని, వారి అటవీ హక్కులను కాపాడాలని ఆదేశించారు. అనుమానాలు, భయాలు తొలగిస్తూ జిఎస్‌టి బాగా అమల వుతోందని అన్నారు. జిఎస్టీలో మరింత రిజిస్ట్రేషన్‌లు పెంచేందుకు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఈమార్కెట్ ప్లేస్ (జిఈఎమ్) పోర్టల్ తో పారదర్శకతగా పెరిగిందని, ప్రజాధనం వృథా తగ్గిందని అన్నారు. ప్రభుత్వ అవసరాలకు ఈ మార్కెట్ ప్లేస్‌ను ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.



తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు

●హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులని హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరాం పేర్కొన్నారు. గిడుగు రామమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షన జరిగిన గిడుగు జయంతోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాష సామాన్య ప్రజల జీవితాల్లో ఎప్పటికీ బతికి ఉంటుందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు గిరిజనుల కోసం సవర భాషను కనిపెట్టారని చల్లా కోదండరాం పేర్కొన్నారు. సభాధ్యక్షులు బిక్కి కృష్ణమాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు భాషకోసం ఉద్యమం చేయడం వల్లనే నేడు కవులు రచయితలు అచ్చమైన తెలుగు భాషలో రచనలు చేయగలుగుతున్నారని తెలిపారు. గిడుగు జన్మదిన సందర్భంగా సమాజ హితం కోసం కృషిచేస్తున్న కవులు రచయితలు, సమాజ సేవకులకు పురస్కారాలు అందజేయడం సముచితంగా ఉందనిహైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. గిడుగు రామమూర్తి భాషోద్యమ ఫలితంగా దళిత బహుజనులు తమదైన భాషలో రచనలు చేయగలుగుతున్నారని ప్రముఖ విమర్శకులు జి.లక్ష్మీ నర్సయ్య తెలిపారు. రెండు రాష్ట్రాల కవులు రచయితలు గిడుగు అడుగుజాడల్లో నడవాలని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం పిలుపునిచ్చారు. యువ రచయితలను కవులను పురస్కారాలతో ప్రోత్సహిస్తున్న బిక్కి కృష్ణకాంతి కృష్ణల కృషి అభినందనీయమని నేటి నిజం ఎడిటర్ బైసా దేవదాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నవలాకారులు, ప్రభాకర్ జైనికి నవ్య నవలాచక్రవర్తి బిరుదుతో పాటు, జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. జి.లక్ష్మీనర్సయ్యకు గిడుగు సాహితీ పురస్కారం, ప్రముఖ సామాజిక సేవకుడు గంగిరెడ్డికి గిడుగు సామాజిక సేవా పురస్కారం, పి.శ్రీరాములుకు విద్యారంగ సేవా పురస్కారం, జి యోలక్ష్మణ్, పసునూరి రవీంద్ర, యం.బి.డి శ్యామల, సి.హెచ్ ఉషారాణి, తదితరులకు సాహితీ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ డా.పత్తిపాక మోహన్,కవులు డా.ప్రసాదమూర్తి, మువ్వా శ్రీనివాసరావ్, వ్యక్తిత్వవికాస నిపుణుడు డా.మోహన్ రావ్, మాధవరెడ్డి,ట్రస్ట్ ఛైర్మన్ కాంతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిక్కి కృష్ణ రాసిన ప్రేమాంజలి కవిత్వం ఆడియో క్యాసెట్ ను జస్టిస్ చల్లా కోదండరాం ఆవిష్కరించారు. గిడుగు సీతామహాలక్ష్మి కి అంకితమివ్వగా తొలి క్యాసెట్ ను ఆమె స్వీకరించారు.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

● పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం ● పవర్‌కట్ లేని రాష్ట్రం ● తక్కువ వ్యవధిలో ల్యాండ్ క్లియరింగ్ ● కోయంబత్తూర్ ఎంటర్‌ప్రెన్యూర్ల అవార్డు కార్యక్రమంలో మంత్రి లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం తమిళనాడులో ఎంటర్ ప్రెన్యూర్ ఆర్గనైజేషన్ ఆఫ్ కోయంబత్తూర్ ఏర్పాటు చేసిన ఎంటర్ ప్రెనూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ విభాగాల్లో అవార్డులు సాధించిన ఎంటర్ ప్రెన్యూర్లకు అవార్డులు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రమని, ఏపీలో పెట్టబడులు పెట్టేందుకు అనుకూలంగా వున్న పరిస్థితులను వివరించి రాష్ట్రానికి రావాలంటూ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో ప్రపంచంలో స్థాయి సంస్థలైన కియో మోటార్ ఫాక్స్, విట్, ఎస్సారెమ్, అమృతమై, మెడ్‌సిటి తదితర సంస్థలు వచ్చాయన్నారు. ఏపీలో పవర్ కట్ లేదని, 24 గంటలూ పవర్ ఇస్తున్నామని, సంస్థలకు కావాల్సిన అన్ని అనుమతులు తక్కువ వ్యవధిలో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం విభజన అనంతరం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ల్యాండ్ క్లియరింగ్ 200 రోజులు పట్టేదని, తాను ఐటీ శాఖ చేపట్టినతర్వాత 50 రోజుల్లో ఇచ్చేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఏపీలో 16వేల కోట్ల లోటుబడ్జెట్‌తో ఉందని, రాష్ట్రం విభజన తర్వాత ప్రభుత్వం రైతుల వద్దకు వెళ్లి మీభూమిని రాజధానికి ఇస్తే దాన్ని అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పగా ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా 35 వేల ఎకరాలను ప్రభుత్వానికి ఇవ్వటం జరగిందని, గతంలో భూసేకరణ విషయంలో సింగూరులో ఏమి జరిగిందో మనకు తెలిసిందేన్నారు. అధిక శాతం ఉన్న యువత భారతదేశానికి గొప్ప వరమని, కాని భారతదేశంలో మార్కెటింగ్ అంత సులభంకాదని, ఏరాష్ట్ర ప్రభుత్వం అంత త్వరగా భూములు ఇవ్వదన్నారు. వ్యాపారాలను మహిళలు ఎంతో సమర్ధవంతగా నిర్వహించగులుతారని, అందుకే ఎక్కవ మంది మహిళలు వ్యాపార రంగంలోకి రావాలన్నారు. బ్రాహ్మణి హెరిటేజ్ ని ఎంతో సమర్ధవంతంగా నిర్వహిస్తు అభివృద్ధి పథంలోకి నడిపిస్తుందని కొనియాడారు. అనంతరం కోయంబత్తూరులోని తెలుగు అసోసియేషన్ సభ్యులను మంత్రి లోకేష్ కలిశారు.



కాకినాడలోనూ తెదేపాదే విజయం

●మంత్రి ప్రత్తిపాటి జోస్యం



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వం పనితీరుకు ప్రజలు పట్టం కడుతున్నారని, ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడ అధికారపార్టీ తన విజయకేతనాన్ని ఎగుర వేస్తుందని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం-బిజెపి కూటమికి 38 నుండి 40 సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లోనూ ప్రతిపక్షపార్టీ వైఎస్‌కాంగ్రెస్‌కు ఊహించని పరాభవం జరగనుందన్నారు. దీంతో ఇప్పటి నుంచి కాకినాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కుంటిసాకులు వెతుక్కునే పనిలో ఆపార్టీ నిమగ్నమై ఉందని ఆయన అన్నారు. రెండు దశాబ్దాల తరువాత తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో టీడీపీ విజయాన్ని సాధించబోతోందన్నారు. ఇప్పటికే కర్నూలు జిల్లా నంద్యాల ఓటర్లు ఉప ఎన్నికల్లో టిడిపిని గెలిపించి, వైకాపా నేతల నోటికి తాళం వేశారన్నారు. శుక్రవారం జరిగే కాకినాడ ఓట్ల లెక్కింపులో వైకాపాకి కేవలం సింగిల్ డిజిట్‌కు మాత్రమే ఓట్లరు పరిమితం చేయనున్నారని పుల్లారావు వ్యాఖ్యానించారు. అందుకే ఇప్పటి నుంచి అధికారపార్టీ ఓటర్లకు డబ్బు పంపిణీ చేసిందని, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరించారని ఆపార్టీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం, అధికార పార్టీనేతలపై బురద జల్లడమే పనిగా వైకాపా నేతలు మాట్లాడుతున్నారని, వైకాపాను నమ్ముకొని నంద్యాలలో బెట్టింగులు చేసిన వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తిందని మంత్రి వ్యాఖ్యానించారు. నంద్యాల ఫలితంతో పార్టీలో ఉండాల వద్దా అన్న అనుమానంలో వైకాపా తర్జన భర్జన పడుతున్నారని, కాకినాడ ఓటర్ల తీర్పు తరువాత జగన్‌తో ప్రస్తుతం ఉన్నవారు కూడా పార్టీలో ఇమడలేరని పుల్లారావు వ్యాఖ్యానించారు.

మూడేళ్ల పసిబిడ్డ 'ఆంధ్రప్రదేశ్'

●రాష్ట్రం పెట్టుబడులకు నిలయం ●త్వరలో 'అమరావతి' డిక్లరేషన్ ●బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌తో స్పీకర్ కోడెల శివప్రసాద్ భేటీ



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు మూడేళ్ల పసిబిడ్డ అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ బుధవారం ఉదయం శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ ఛాంబర్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకున్రు. శాసనసభ లోపలి భాగాన్ని స్పీకర్ కోడెల, ఆండ్రూ ఫ్లెమింగ్‌లు సందర్శించారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్‌లో భాగంగా రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర పనులలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. తన సత్తెనపల్లి శాసనసభ నియోజకవర్గంలో 120 రోజుల్లో 20 వేల టాయిలెట్స్ నిర్మించినట్లు స్పీకర్ ఆండ్రూకు తెలిపారు. మహిళల ఆత్మగౌరవం, అందరి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత టాయిలెట్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. స్వచ్ఛాంధ్ర గురించి తక్కువ సమయంలో ఎక్కువగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించినట్లు స్పీకర్ తెలిపారు. అలాగే స్మశానవాటికలను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. తన నియోజకవర్గంలో 400 స్మశానవాటికలను ఆధునీకరించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యావరణ, నీటిపారుదల, పరిశ్రమలు, విద్య, వైద్యం, విద్యుత్‌రంగాలకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి వీలుగా అన్ని అవకాశాలు కల్పిస్తున్నారని కోడెల తెలిపారు. ఇప్పటికే ఇన్వెస్టర్స్ ప్యారడైజ్‌గా రాష్ట్రాన్ని అభివర్ధిస్తున్నారన్నారు. ఈ సందర్భంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపి తొలిస్థానంలో ఉన్న విషయాన్ని ఆండ్రూ ప్రస్తావించారు. నదులు అనుసంధానంలో భాగంగా కృష్ణా-గోదావరి నదులను అనుసంధానించినట్లు, 24 గంటల నిరంతరం విద్యుత్ అందిస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. 190 రోజుల్లో శాసనసభ భవన సముదాయాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇండియా-యూకే భాగస్వామ్యంతో అమరావతిలో ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. నూతన రాజధాని అమరావతిలో పరిపాలన, న్యాయ నగరాల డిజైనింగ్ బ్రిటన్‌కు చెందిన నార్మన్ ఫాస్టర్ సంస్థ అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురవుతున్న మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిచడానికి, వారు స్వయం ప్రతిపత్తి సాధించడానికి స్వయం సేవక బృందాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా పవిత్రసంగమంలో నిర్వహించిన జాతీయ మహిళా పార్లమెంట్ సదస్సుకు సంబంధించిన డిక్లరేషన్‌ను ఆండ్రూకు స్పీకర్ కోడెల వివరించారు. దేశంలో మొట్టమొదటి సారిగా ఇటువంటి సదస్సు నిర్వహించినట్లు స్పీకర్ తెలిపారు. మూడు రోజులు జరిగిన ఆసదస్సుకు దేశ విదేశాల్లోని వివిధ రంగాలకు చెందిన 25 వేల మంది మహిళలు హాజరైనట్లు చెప్పారు. సదస్సులో ప్రసంగించిన మహిలు, విద్యార్థినుల ప్రసంగాలు, అనుభవాలు, ఆలోచనలు, సిఫార్సులు ఆధారంగా 'అమరావతి డిక్లరేషన్'ని రూపొందిస్తున్నట్లు స్పీకర్ వివరించారు. ఈసందర్భంగా స్పీకర్ డాక్టర్ కోడెల జాతీయ మహిళా సదస్సులో ప్రసంగాల పుస్తకాన్ని, గౌతమబుద్ధుని చిత్రపటాన్ని ఆండ్రూకు అందజేశారు. అనంతరం ఆండ్రూ శాసనసభను సందర్శించారు. లోపల స్పీకర్‌తో కలిసి ఆండ్రూ ఫోటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ ప్రత్యేక కార్యదర్శి పి.పి.కే.రామాచార్యులు, పూర్వ కార్యదర్శి కె.సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం స్పీకర్ డాక్టర్‌కోడెల మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌తో జరిగిన చర్చల్లో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. సామాజిక ఆర్థిక, సేవా రంగాల్లో కలిసి పనిచేయడానికి ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు స్పీకర్ వెల్లడించారు. గత మూడేళ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ఆయనకు వివరించినట్లు స్పీకర్ కోడెల చెప్పారు.

విపక్షాలకు బెదరం

● ఫ్యాక్షన్ రాజకీయాలకతీతంగా అభివృద్ధే లక్ష్యం ● 'ఆంధ్రప్రభ'తో నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : తమ నియోజకవర్గంలో అభివృద్ధికి విపక్షం అడ్డంకులు సృష్టిస్తే బెదిరేది లేదని నంద్యాల ఉప ఎన్నికలో టిడిపి తరపున శాసనసభ్యునిగా విజయం సాధించిన భూమా బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు. బుధవారం సచివాలయానికి వచ్చిన సందర్భంగా ఆయన ఆంధ్రప్రభ ప్రతినిధితోమాట్లాడుతూ హోరాహోరీగా సాగిన ఎన్నికలలో విజయం తనను వరించడం ఆనందంగా వుందని తెలిపారు. తన బాబాయి అయిన భూమా నాగిరెడ్డి ఆశయాల సాధనే తన ప్రథమ కర్తవ్యమని, తనవిజయంతో భూమా కుటుంబంపై ఎంత అభిమానం వుందో తేటతెల్లమైందన్నారు. విజయం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రోత్సాహం మరవలేమని, బాబాయి, పిన్ని చనిపోయినా తమ కుటుంబాన్ని ముఖ్యమంత్రి వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. నంద్యాలలో ఇళ్ళ కొరత చాలా వుందన్నారు. గృహనిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చినందువల్లనే మహిళలు అధికశాతం ఓటింగ్‌లోపాల్గొన్నారన్నారు. వారి సమస్యలకుసముచితమైన ప్రాధాన్యత ఇవ్వాల్సి వుందన్నారు. బాబాయి వున్నప్పుడే పచ్చదనం, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇచ్చారని,తాను అదే విధానాన్ని కొనసాగిస్తానన్నారు. రోడ్ల వెడల్పు ప్రక్రియ కొనసాగుతుందని, చామ కాల్వ, కుందూ నంది పనులతో ప్రజలలో తమ ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందన్నారు. అమృత్ పథకం కింద వెలుగోడు రిజర్వాయర్‌నుంచి నంద్యాలకు మంచి నీరు తెప్పించేందుకు రూ.176 కోట్లతో పనులుకొనసాగుతున్నాయని, ఈ పథకం ఒక వరం అని ఎమ్మెల్యే అన్నారు. నంద్యాల పరిధిలో ప్రధానంగా పందుల సమస్యల ప్రబలంగా వుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నామని, అయిదు ఎకరాల స్థలాన్ని కేటాయించే యోచన వుందన్నారు. అలాగే ఆవులు, కుక్కల సమస్య వుందని బ్రహ్మ నందరెడ్డి తెలియజేశారు. తాజా విజయంతో ప్రతి నియోజకవర్గానికి నంద్యాల స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి చెప్పినట్టుగా నంద్యాల ఆదర్శ నియోజకవర్గంగా మారుతుందనటంలోఎలాంటి సందేహం లేదని తెలిపారు. అభివృద్ధికే జనం పట్టం కట్టారన్నారు. వైఎస్సార్‌సిపి అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీకి పెద్ద మైనస్ అని గత 13 ఏళ్లలో శిల్పా నిర్లక్ష్యం చేశారన్నారు.

మీడియాపై భూమా అనుచరుల వీరంగం

మంత్రి భూమా అఖిలప్రియ, ఇటీవల గెలుపొందిన నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి డొంకరోడ్డులోని ఒక కార్యక్రమానికి వచ్చినప్పుడు మీడియా ప్రతినిధులు కవరేజ్ చేసేందుకు మంత్రి, ఎమ్మెల్యే వద్దకు వెళ్లారు. అయితే వారి అనుచరులు మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడటంతో ఒక్కసారిగా నివ్వెర పోయారు. స్థానికంగా ఉన్న టీడీపీ శ్రేణులు ప్రేక్షకపాత్ర వహించినట్లు బాధిత మీడియా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మంత్రి సర్ది చెప్పినా వినకపోయేసరికి నిరసనకు దిగారు. అయినా పోలీసులు స్పందించకపోవడంతో అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్బన్ ఎస్పీ విజయరావు దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం చేయాలని కోరనున్నట్లు బాధితులు తెలిపారు.

అందుబాటులో ఉంటా

ఎన్నికల అనంతరం కూడా తాను నంద్యాలలో నిత్యం ప్రజలతో మమే కమవుతానని తెలిపారు. ఎల్లవేళలా వారికి అందు బాటులో వుంటూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తానన్నారు. ఇంకా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయాల్సి వుందన్నారు. విద్యుత్ స్తంబాలకు సంబంధించిన పనులు పరిష్కరించాల్సి వుందని, చాలెంజ్‌గా తీసుకున్న ఎన్నికలు టిడిపి ప్రభుత్వ మూడు సంవత్సరాల పాలనకు ఖచ్చితంగా రెఫరెండమే నని అన్నారు. ఎన్నికలలో విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించార ని భూమా బ్రహ్మానందరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆళ్ళగడ్డ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.వి.రామిరెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో టిడిపి విజయం సాధించడం పట్ల ఆనందాన్ని వ్యక్తంచేశారు. స్వర్గీయ భూమా నాగిరెడ్డి నంద్యాలలో ఇచ్చిన హామీలన్నీ అమలవు తాయని, ఆ దిశగా భూమా బ్రహ్మానందరెడ్డి కృతకృత్యులు అవుతారని స్పష్టం చేశారు.ఈ విజయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాత్ర ఎనలేనిదని కొనియాడారు.



3 రోజుల్లో దేశవ్యాప్తంగా వర్షాలు

• తెలుగు రాష్ట్రాలకు వాయుగుండం ముప్పు

• గోదావరి తీరానికి వరద • అప్రమత్తం చేసిన కేంద్రం

విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో: రానున్న మూడు రోజులపాటు దేశ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని, కాబట్టి అన్ని రాష్ట్రాలు అప్రమత్తం కావాలని కేంద్రం ముందస్తు హెచ్చరికలు చేసింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాలకు వానగండం పొంచివుంది. ఇప్పటికే బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి కొనసాగుతుండడం, దీనితోపాటు అల్పపీడనం వాయుగుండంగా మారుతుండడంతోపాటు ఇది తీవ్ర రూపం దాల్చే అవకాశాలు వుండడంతో అనేక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో వున్న ఉపరితల ఆవర్తనంతో కలిసి ఈ వాయుగుండం గుజరాత్ దిశగా ముందుకు సాగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనం క్రమేపీ వాయుగుండంగా మారుతోందని వాతావరణ శాఖ అధికారులు వివరించారు. దీని ప్రభావం వల్ల ఉత్తర కోస్తా జిల్లాలపై రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు చెబుతున్నారు. విశాఖ జిల్లా మీదుగా ద్రోణి పయనించడంతో ఇక్కడ కూడా గత మూడు రోజులుగా భారీ వానలు కురుస్తున్నాయి. దీనితోపాటు రాయలసీమ మీదుగా కూడా మరో ద్రోణి కొనసాగుతోంది. దీంతో సెప్టెంబరు 2 వరకూ కోస్తా జిల్లాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా వానలు పడే అవకాశముంది. గుజరాత్, మహారాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారు. రానున్న 72 గంటల్లో దేశంలోని ప్రధాన నదీపరివాహక ప్రాంతాలన్నింటికీ వరద ముప్పు పొంచివుందని కేంద్ర జలవనరుల శాఖ తెలిపింది. ఈ మేరకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని గోదావరి తీరంలోని జిల్లాలకు వరద ముప్పు ఎదురుకానున్నట్టు స్పష్టం చేసింది. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాల కారణంగా మహారాష్ట్రలోని నాసిక్, అహ్మద్‌నగర్, ఔరంగాబాద్, నాందేడ్ జిల్లాల్లో గోదావరి పొంగి ప్రవహించే అవకాశం వున్నట్టు వెల్లడించింది. దక్షిణ ఛత్తీస్‌ఘడ్‌లో కురిసే వర్షాలతో జగదల్‌పూర్, దంతెవాడల్లో ఇంద్రావతి నదికి ఓ మోస్తరుగా వరద వచ్చే అవకాశం వున్నట్టు తెలిపింది. తెలంగాణాలో నిజామాబాద్, జయశంకర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాలకు వరద ముప్పు రావచ్చని కేంద్రం హెచ్చరించింది. ముంబయి నగరం ఇప్పటికే వానలతో పూర్తిగా మునిగిపోయింది. అక్కడ అవసరమైన సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి.

పర్యాటక పోల'వరం' గా తీర్చిదిద్దుతాం!

• పర్యాటక కార్యదర్శి ఎం. కే. మీనా

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలపై ఆలోచన చేస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం విషయంలో ప్రత్యేక దృష్టిసారించినందున మరే సాగునీటి ప్రాజెక్టుకు లేని విధంగా ఇక్కడ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. బుధవారం సచివాలయంలో పోలవరం, గండికోట ప్రాంతాలను మెరుగైన పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దే క్రమంలో వివిధ సంస్థలు సమర్పించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లను ఆయన పరిశీలించారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆయా సంస్థలు అందించిన ప్రాజెక్టు నివేదికలను కూలంకషంగా పరిశీలించి కార్యదర్శి వీటికి సంబంధించి సముచితమైన బిడ్లను ఖరారు చేయాలని ఆదేశించారు. మూడు సంస్థలు తమ ప్రదర్శలను చూపినట్లు ఆయన పేర్కొన్నారు. బిడిపి, సైట్ కాన్సెప్ట్, క్యాపిటల్ సంస్థలు వీటిలో ఉన్నట్లు మీనా తెలిపారు. వారు చేయనున్న అభివృద్ధి, అందుకయ్యే వ్యయం ప్రాతిపదికన నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

అసరమైన పక్షంలో మరిన్ని సంస్థలను కూడా ఆహ్వానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా పర్యాటక పోలవరం సాధన మాత్రమేనని ముఖేష్ మీనా వివరించారు. ఇప్పటికే రెండు విడతలుగా ప్రజెంటేషన్ల నిర్వహణ జరిగిందని, ఇందులో ఆయా సంస్థలు పాల్గొని తమ ఆలోచనలు వెల్లడించాయని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ టీడీసీ ఇడి బాలసుబ్రహ్మణ్య రెడ్డి, ఇడిజి డైరెక్టర్ పాండురంగారావు, బిఐటీసీ ఇడి ఉమా మహేశ్వర రావు, అనంతపురం ఆర్డీ గోపాల్, రాజ మండ్రి ఆర్డీ భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు..

గుంటూరు జిల్లా కోటప్పకొండ అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు మీనా తెలిపారు. బుధవారం ఇదే విషయమై స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావుతో మీనా, శుక్లా సమావేశమయ్యారు. కోటప్పకొండ అభివృద్ధి పరంగా స్పీకర్ కీలకంగా ఉన్నారని, పలు అంశాలపై ఆయనతో చర్చించడం జరిగిందని తెలిపారు. ఆయన ఆకాంక్షల మేరకు కోటప్పకొండ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ఇప్పటికే జరుగుతున్న పనులను తొందరలోనే పరిశీలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

46 మంది తహశీల్దార్‌లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మండలాలు, ఇతర విభాగాలలో పనిచేస్తున్న 46మంది తహశీల్దార్‌లకు డిప్యూటి కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే మరో 12 మందికి పదోన్నతి లభించాల్సి ఉన్నా వారిపై శాఖాపరమైన విచారణలు, వివిధ కేసులు ఉండడంతో ప్రమోషన్లు ప్రభుత్వం నిలిపివేసింది.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఏపి రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఉద్యోగుల పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ విద్యార్థుల ఆందోళనకు ఎంపీ రామ్మోహన్ నాయుడు మద్దతు

• జీవో 64ను రద్దు చేయాలని డిమాండ్



అమరావతి, ఆంధ్రప్రభ : వ్యవసాయ శాఖలో వివాదాస్పద జీవో 64ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గత 27 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బుధవారం వ్యవసాయశాఖ ఉద్యోగులు మద్దతు పలికారు. శ్రీకాకుళం జిల్లా నైరాలో వ్యవసాయశాఖ ఏవోలు ధర్నాలో పాల్గొని విద్యార్థులకు సంఘీభావం పలికారు. శ్రీకాకుళం ఎంపీ కింజవరపు రామ్మోహననాయుడు నైరా వ్యవసాయ కళాశాలను సందర్శించి విద్యార్థులు చేస్తోన్న ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఆందోళన చేస్తున్న వారి న్యాయపరమైన పోరాటానికి తమ మద్దతు ఉంటుందని వారి న్యాయ పోరాటానికి వెన్నంటి ఉంటానని పేర్కొన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. జీవో 64పై ప్రభుత్వానికి సమాచార లోపం ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలల విద్యార్థులు చేస్తోన్న ఉద్యమానికి పలువురు మద్దతు తెలిపారు. బాపట్లలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు సీపీఎం నాయకురాలు రమాదేవి వెళ్లి సంఘీభావం తెలిపారు. కాగా గురువారం నైరాలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వ్యవసాయ శాఖ ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆందోళనకారులు వెల్లడించారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు వ్యవసాయశాఖ ఉద్యోగులు కూడా ఆందోళనకారులకు రాష్ట్రవ్యాప్తంగా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. గురువారం రాష్ట్రంలోని పలుచోట్ల ఆందోళనకారులు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు.

మైనార్టీల అభివృద్ధికి 'మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్'

• ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం అమలు

• రాష్ట్ర స్థాయి మైనార్టీ సంక్షేమ కమిటీ సమావేశంలో సీఎస్ దినేష్‌కుమార్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమాభివృద్ధికి వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 'మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్' కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ వెల్లడించారు. ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమంలో భాగంగా మైనార్టీల సంక్షేమానికి ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం బుధవారం వెలగపూడి సచివాలయంలో సిఎస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం 12వ పంచవర్ష ప్రణాళికల కాలంలో మైనార్టీల ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో 2008లో మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్‌డిపి)ని ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో ఈ పథకాన్ని మరింత వేగంగా అమలు చేయాలని సిఎస్ సంబంధితశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కనీస అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనను మరింత మెరుగుపర్చేందుకు వారిని ఆర్థికంగా సామాజికంగా అన్ని విధాలా పైకి తీసుకువచ్చేందుకు ఈకార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని రాష్ట్రకమిటీలోని సభ్యులకు సిఎస్ దినేష్‌కుమార్ వెల్లడించారు. మైనార్టీల ప్రజలకు మెరుగైన విద్యను అందించడంతోపాటు నైపుణ్యతను పెంపొందించడం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పరిస్థితులను మెరుగుపర్చడం, పక్కాఇళ్ల నిర్మాణం, రహదారులు, తాగునీరు వసతి కల్పించడంతో పాటు వారికి ఆదాయ వనరులు సమకూర్చే కార్యక్రమాలను చేపట్టడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని దినేష్‌కుమార్ అన్నారు. అలాగే మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వాలు ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు, ప్రాజెక్టుల్లో అంతరాలను (గ్యాప్స్) పూరించడం ద్వారా మెరుగైన రీతిలో ఆయా పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుగా అదనపు వనరులు సమకూర్చుకోవడానికి ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు కింద ఈ ఎంఎస్‌డీపీ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో మైనార్టీలు అధికంగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో 25 శాతానికి పైగా మైనార్టీ జనాభా నివసిస్తున్న 11 ప్రాంతాలను ఈ ప్రాజెక్టు కింద గుర్తించి పలు కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆయా జిల్లాల్లో ఒక్కొక్కటి రూ. 10 లక్షలతో 50 కోట్ల వ్యయంతో 500 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. అలాగే ఒక్కొక్కటి రూ. 12 లక్షల అంచనా గల వ్యయంతో 12 కోట్లతో 100 పడకల ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటు చేసేందుక కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో 23 కోట్ల రూపాయలతో బాలుర రెసిడెన్సియల్ పాఠశాల కాంప్లెక్స్, కోటి రూపాయలతో సభవ్ మడప్ నిర్మాణానికి ప్రతిపాదనలు రాగా వాటిని చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే గుంటూరు జిల్లాలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరాన్ని బట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాల వారీగా పనులప్రగతి, రావల్సిన ప్రతిపాదనలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సిఎస్ దినేష్ కుమార్ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతుల కోసం రూ .4,848 కోట్లు

• మంత్రి గంటా శ్రీనివాసరావు

అమరావతి, ఆంధ్రప్రభ : కోట్లు ఖర్చు పెడుతున్నా కనీస మౌలిక సదుపాయాలైన ఫ్యాన్లు, తాగునీరు, లైటింగ్, యూనిఫాం, టాయిలెట్లకు నీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఇంకా కొన్ని కేజీబీవీలు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో లేనట్లు వార్తలు వస్తున్నాయని, వీటిని వెంటనే సరిచేసుకోవాలని మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కనీస మౌలిక సదుపాయాలకు నిధులు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందిస్తున్నా ఇంకా లోపాలు ఉంటున్నాయని, వెంటనే ఎక్కడా అలాంటి సమస్య రానియవ్వద్దని సర్వశిక్షా అభియాన్ పిఓలకు మంత్రి గంటా శ్రీనివాసరావు సూచించారు. తనిఖీలు చేసి మౌలిక సదుపాయాల కొరత ఉంటే పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బుధవారం ఆయన సచివాలయంలోని తన ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఎస్ఏ పిఓలతో సమీక్షించారు. విద్యా సంస్థలు ప్రారంభమై రెండు నెలలు పూర్తి అవుతున్నా ఇంకా లోటుపాట్లు ఉంటున్నాయని వీటిని సరిచేసుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతుల కోసం యాన్యుటీ ప్రతిపాదికన రూ.4,848 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. ప్రహరీ గోడలు, భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు వెచ్చిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేస్తేనే ఫలితాలు ఉంటాయని, ఆ దిశగా అధికారులు పనిచేయాలని మంత్రి గంటా సూచించారు. మధ్యాహ్న భోజనం కొన్ని చోట్ల నాణ్యత లేకుండా ఉందని, తన తనిఖీల్లోనూ ఇది వెల్లడైందన్నారు. తనిఖీలు చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశ్చిమ గోదావరి, ఒంగోలుతోపాటు పలు జిల్లాల పిఓలు తమ కేజీబీవీ విద్యార్థులు వివిధ జాతీయ స్థాయి పోటీల్లో నెగ్గారని మంత్రికి తెలిపారు. ప్రతిభ చూపిన వారికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని, నవంబరు 14న ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సమీక్షలో నిర్ణయించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ట్యాబ్‌లు అందివ్వాలని మంత్రి గంటా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బాలిక విద్యను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 25 కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో ఇంటర్ విద్యను ప్రారంభిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు పొందవచ్చన్నారు. కేజీబీవీల్లో నాణ్యమైన భోజనం పెట్టాలని, మెనూ తప్పనిసరిగా అనుసరించాలన్నారు. పిల్లలు చదువుతోపాటు ఫిజికల్ లిటరసీపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి కేజీబీవీకి ఐదు కంప్యూటర్లు అందజేస్తున్నామని, వీటి ద్వారా కంప్యూటర్ విద్యను విద్యార్థునులకు అందించాలన్నారు. ఆర్వో ప్లాంట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ స్థాయిలో మూడవ స్థానం ఏపిఎస్ఎస్‌ఏకి రావడం పట్ల మంత్రి గంటా పిఓలకు అభినందనలు తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లా కూడా జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో వారిని అభినందించారు. 10లోపు స్కూళ్లు పాడైన భవంతుల్లో నడుస్తున్నాయని గుంటూరు పిఓ తెలపగా వెంటనే వాటిని ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ భవనాల్లో విద్యనందించాలని మంత్రి గంటా స్పష్టం చేశారు. అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, ఎలాంటి చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు విజన్‌కు అనుగుణంగా పనిచేయాలంటే మరింత కష్టపడాలని, రాష్ట్ర విద్యారంగాన్ని నాలెడ్జ్ స్టేట్-ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాల్సిన బాధ్యత మనందరిపైనే ఉందని మంత్రి గంటా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ఎస్ఎస్ఏ ఎస్పీడీ జి. శ్రీనివాసులతో పాటు ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇసుక

• రీచ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసిన మంత్రి సుజయ్ కృష్ణారంగారావు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సామాన్య ప్రజానీకానికి అవసరాలకు సరిపడా ఇసుక అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని ఘనులు, భూగర్భవనరులశాఖామాత్యులు సుజయ్ కృష్ణా రంగారావు అన్నారు. మంగళవారం మంత్రి కృష్ణాజిల్లాలోని ఫెర్రీ, సూరాయపాలెం ఇసుక రీచ్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాన్య ప్రజానీకానికి ఇసుక అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో 7 వందల కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఉచితంగా ఇసుకను అందించాలని సంకల్పంతో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఉచిత ఇసుక నిర్ణయం తీసుకున్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో ఇసుక అమ్మకాలు ఎక్కువ మొత్తంలో అమ్ముతున్నట్లు వస్తున్న సమాచారం ప్రకారం వీటిని నియంత్రించే విధంగా జిల్లాస్థాయి కమిటీలు నియమించి వీటిని నియంత్రించడానికి కృషి చేస్తుందన్నారు. కేవలం ఇసుక రీచ్‌ల వద్ద లోడింగ్, ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీల కింద లారీ, పడవల యజమానులకు చెల్లించేందుకు ధరల నిర్ణయించి ఇసుక రవాణా జరిగే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఫెర్రీ ఇసుక రీచ్‌ల నుంచి విజయవాడకు లారీ ఇసుక లోడింగ్ రవాణా ఛార్జీల కింద రూ.2,500 నిర్ణయించడం జరిగిందన్నారు. వీటికంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం ఉండటంతో ముఖ్యమంత్రి ఆదేశాల అనుసరించి ఇసుక రీచ్‌ల వద్ద జరుగుతున్న పరిణామాలను స్వయం పర్యవేక్షించాలనే ఉద్దేశంతో ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలు ఉన్నతస్థాయి అధికారులతో పాటు జిల్లా మండల స్థాయి అధికారులు నిరంతరం కొనసాగిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్, జియోలజీశాఖ సెక్రటరీ డి. శ్రీధర్, మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణ్యం, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి

• కేంద్ర హోంశాఖకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎపిఎస్ఎఫ్‌సి)లో పనిచేస్తున్న డిప్యూటి జనరల్ మేనేజర్ జి.వెంకటేశ్వరరావు, మరో ఐదు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందినప్పటికీ ఎపిఎస్ఎఫ్‌సి తెలంగాణ డివిజన్‌లో వీరిని కేటాయించారని, వీరిని ఏకపక్షంగా ఎస్ఎఫ్‌షి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఏప్రిల్‌లో బాధ్యతల నుంచి రిలీవ్ చేశారని కేంద్రహోం మంత్రిత్వశాఖ కార్యదర్శి రాజీవ్ మెహిరిషికి వివరిస్తూ ఈ మేరకు లేఖ రాశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 19వ షెడ్యూల్‌కు భిన్నంగా, ఏకపక్షంగా ఆంధ్రప్రాంతానికి చెందిన ఉద్యోగులను విధుల నుంచి రిలీవ్ చేశారని ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. పునర్వ్యవస్థీకరణ చట్టం ఈ అధికారులు తెలంగాణ డివిజన్‌లో పని చేసేందుకు అవకాశం కల్పించాలని మేనేజింగ్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తే అందుకు ఆయన సమ్మతించారని తెలిపారు. ఈ వినతిని పరిశీలించి వారిని విధుల నుంచి రిలీవ్ చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సూచించినప్పటికీ ఆయన దాన్ని ఆమోదించలేదని ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. ఎపిఎస్ఎఫ్‌సిలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రాంతాల వారీగా విభజించి వివక్ష చూపవద్దని, తుది విభజన జరిగేంత వరకు ఏ ప్రాంతం వారైనా ఎస్ఎఫ్‌సిలో పనిచేసేలా ఆదేశించాలని దినేష్ కుమార్ కోరారు.

నవంబర్ 4వ తేదీ నాటికి 25 కోట్ల మొక్కలు నాటాలి

• వనం-మనం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళాలి

• ఒంగోలులో 25వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ : మంత్రి శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ : హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వనం - మనం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళాలని, ఎట్టి పరిస్థితుల్లోను నవంబర్ 4వ తేది నాటికి 25కోట్ల మొక్కలను నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో మంత్రి శిద్దా రాఘవరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనం - మనం కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రజలకు అవగాహన కలిగేలా చూడాలని అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధికారులు వృద్ధాసీనతగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శిద్దా రాఘవరావు హెచ్చరించారు. ఇప్పటివరకూ రాష్ట్ర వ్యాప్తంగా 9కోట్ల మొక్కలను నాటినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులతో మంత్రి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని, స్టోన్ క్రస్షింగ్ యూనిట్ల నుంచి వెలువడే కాలుష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

ఇలాంటి యూనిట్లపై చర్యలు తీసుకోవాలని మంత్రి శిద్దా రాఘవరావు అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) ఆధ్వర్యంలో 25వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ - 2017, ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర శాస్త్ర సాం కేతిక మండలి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహ కారంతో భవిష్యత్తులో సబ్ రీజనల్ సైన్స్ సెంటర్‌ను రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తామన్నారు. 9డి థియేటర్, త్రిడి ప్లాంటోరియం, పేటెంట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, ఓషన్, అట్మోస్పియర్ ఫెవిలియన్‌లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ఎర్రచందనం వేలానికి అంతర్జాతీయ బిడ్‌లను ఆహ్వానించి వేలం నిర్వహించామన్నారు. ఈ వేలంలో 467.059 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం నిల్వలను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి 88.40 కోట్ల ఆదాయం సమకూరిందని మంత్రి శిద్దా రాఘవరావు వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని దివాన్ చెరువు కర్నూల్‌లోని గార్గేయపురంలో నగర వనాలను ప్రారంభించినట్లు తెలిపారు. దివ్యారామం, నల్లపాడు, కడప నగర వనాలు సెప్టెంబర్ నాటికల్లా పూర్తి అవుతాయని అన్నారు. అదే విధంగా కూడేరు, కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్, పేర్లవాని పాలెం, నగర వనాలు పూర్తి కావచ్చాయని, విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో స్థల సేకరణ చేయాల్సి ఉందని మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. వనం - మనం లో భాగంగా ప్రతి శనివారం ప్రకృతి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వనాలు, అడవుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతరాము, పిసిసిఎఫ్ సారంగి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ కమ్ సెక్రటరీ ప్రసాదలతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో పదోన్నతులు

• రాష్ట్రవ్యాప్తంగా 11 మంది ఏడీఏలకు డీడీవోలుగా ప్రమోషన్లు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల వ్యవసాయ శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. గతవారం ఏఈవోలకు ఏవోలుగా పదోన్నతులు లభించగా, బుధవారం రాష్ట్రంలోని 11 మంది ఏడీఏలకు డీడీలుగా ప్రమోషన్లు కల్పిస్తూ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్లు పొందిన వారిలో పీడీవీ రత్నకుమార్, ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు, జి.రత్నప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, పి.రామాంజనేయులు, కె.శ్రీదేవి, సి.రేణుక, జి.తిరుపతయ్య, వి.రామునాయక్, ఎం.జగ్గారావు, ఎ.రవిశంకర్ ఉన్నారు.

ఎన్నికలకు సంబంధించిన రికార్డులివ్వండి

• ఏపీ ఒలింపిక్ సంఘానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత ఎన్నికలకు సంబంధించిన రికార్డులను కోర్టుకు సమర్పించాలని పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్ నాయకత్వం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. 2015 ఏప్రిల్ 4న జరిగిన ఎన్నికల్లో ఎంత మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారు ఏ రిజిస్టర్ సొసైటీకి చెందిన వారు, తదితర వివరాలు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) అధ్యక్షుడు రామ చంద్రన్ కుమారుడు జయదేవ్ జయదేవ్ కంపెనీలో డైరెక్టర్‌గా పని చేస్తున్న కారణంగా ఏపీ ఒలింపిక్ సంఘాన్ని అసలైన సంఘంగా గుర్తింపు ఇచ్చారని పిటిషనర్ ఆరోపించారు. అదే నిజమైతే ఐఓఏ అధ్యక్షుడి అధికార పరిధిని తీసేసి తాము పరిశీలిస్తామని హైకోర్టు పేర్కొంది. ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌ను సొసైటీ రిజిస్ట్రేషన్ చట్ట ప్రకారం 2016 లో రిజిస్ట్రేషన్ చేస్తే 2015 ఏప్రిల్ 4న సంఘానికి ఎలా ఎన్నికలు నిర్వహించారని ప్రశ్నించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగ నాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ పార్లమెంటు సభ్యులు గల్లా జయదేవ్ నాయకత్వంలోని ఏపీ ఒలింపిక్ సంఘాన్ని అసలైన సంఘంగా గుర్తిస్తూ 2016 మార్చి 7న ఐఓఏ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అనంతపురం పార్లమెంట్ సభ్యుడు జె.సి. దివాకర్ రెడ్డి తనయుడు ఏపీ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జె.సి.పవన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

నవ్యాంధ్రలో మెగా ఫుడ్ పార్క్‌ల ఏర్పాటుకు ఆధ్యాత్మిక గురువుల ఆసక్తి

• త్వరలో సీఎంతో భేటీ కానున్న శ్రీశ్రీ రవిశంకర్

• రాష్ట్ర వ్యాప్తంగా 8 మెగాపార్క్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు • ఉత్తరాంధ్రలో 5, రాయలసీమలో 3

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్రలో మెగాఫుడ్‌పార్క్‌ల ఏర్పాటుకు ఆధ్యాత్మిక గురువులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ బాబా శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో రెండు మెగా ఫుడ్‌పార్క్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. ఇప్పటికే రామ్‌దేవ్‌బాబాకు చెందిన పతాంజలి కంపెనీ రాష్ట్రంలో రిటైల్ అవుట్‌లెట్ ఏర్పాటు చేసి మార్కెటింగ్‌లో దూసుకుపోతుంది. పతాంజలి కంపెనీ ప్రతినిధులు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పలుమార్లు భేటి అయ్యి మెగా ఫుడ్‌పార్క్ అంశంపై చర్చలు జరిపారు. మెగాఫుడ్‌పార్క్‌ల ఏర్పాటుకు అవసరమైన భూములకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలో 200 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 150 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పుడు ఇదే బాటలో ఆర్ట్ ఆఫ్ లివింగ్‌వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ కూడా నడిచేందు కు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీశ్రీ ఆయుర్వేద టెస్ట్ (ఎస్ఎస్ఎటి) ఆధ్వర్యంలో ఆహార, ఆయుర్వేద ఉత్పత్తులు, దుస్తుల తయారీ, లైఫ్ స్టైల్ వంటి కార్యక్రమాలన్ని ఒకే చోట నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటుకు 150 నుంచి 200 ఎకరాల భూములు అవసరం అవుతాయని ఎస్ఎస్ఎటి రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేసే అంశంపై ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురువు రవి శంకర్ త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం కానున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఈ భేటి అనంతరం మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటుపై స్పష్టత రానుంది. గత ఏడాది కృష్ణా పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో శ్రీశ్రీ రవిశంకర్ భేటి అయ్యి మెగా ఫుడ్‌పార్క్, వేదిక్‌అకాడమీ , ఆర్ట్ ఆఫ్ లివింగ్ అకాడమీలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తిని కనబరిచారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సానుకూలత వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో వేదిక్ అకాడమీ, ఆయుర్వేద సెంట్రల్‌ల ఏర్పాటుకు అవసరమైన భూములను ఎస్ఎస్ఎటికు కేటాయించేందుకు ఆమోద ముద్ర వేశారు. శ్రీశైలం దేవస్థానానికి చెందిన 20 ఎకరాల భూమిని 33ఏళ్ళ పాటు లీజ్‌కు ఇచ్చేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. శ్రీశ్రీ ఆయుర్వేద ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగాఫుడ్‌పార్క్, పతాంజలి సంస్థకు చెందిన రెండు ఫుడ్‌పార్క్‌లు ఏర్పాటైతే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా అవసరమైన రాయితీలు, భూకేటాయింపులు ఇచ్చి ప్రోత్సహించాలనే ఆలోచనలో ఉంది.

రాష్ట్రంలో 8 మెగాఫుడ్‌పార్క్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహం..

రాష్ట్రంలో ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో 8 మెగా ఫుడ్‌పార్క్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో ఈ మెగాఫుడ్‌పార్క్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఉత్తరాంధ్రలో 5, రాయలసీమలో 3 మెగాఫుడ్‌పార్క్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ భావిస్తుంది. మెగా ఫుడ్‌పార్క్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు అవసరమైన రాయితీలు ఇవ్వడమే కాకుండా సత్వర అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మెగా ఫుడ్‌పార్క్‌ల ఏర్పాటుతో కొంత వరకు నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పతాంజలి, శ్రీశ్రీ ఆయుర్వేదిక్ ట్రస్ట్‌లకు మెగా ఫుడ్‌పార్క్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని భావిస్తుంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 31 ఆగస్టు 2017

మళ్ళీ లోక్‌పాల్ కోసం..!

అత్యున్నత స్థాయిలో పటిష్ఠమైన చర్యలు తీసుకోనిదే అవినీతి నిర్మూలన గురించి ఎన్ని ప్రసంగాలు చేసినా, మరెన్ని హామీలు ఇచ్చినా అవన్నీ నీటిమీద రాతలే అవుతాయని నలభై రెండేళ్ళ క్రితం సంపూర్ణ విప్లవ శంఖారావాన్ని పూరిస్తూ లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేసిన మాటల్లో ఎంత సత్యం ఉందో ఆధునిక రాజకీయ యవనికపై చూస్తున్నాం. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న సంఘటనలన్నీ అవినీతి ప్రేరకమైనవే. ఆనాటి కేంద్ర మంత్రి లలిత్ నారాయణ్ మిశ్రా దుర్మరణానికి కారణమైన సమస్తిపూర్ బాంబు కేసు, నగర్‌వాలా బ్యాంకు దోపిడీ కేసు పెద్దల ప్రమేయం లేదా, ప్రోద్బలం ఉన్న అవినీతి కుంభకోణాలే. ఆ కుంభకోణాల్లో స్వాహా అయిన సొమ్ము వందల కోట్లు మాత్రమే. ఆ తర్వాత వెలుగు చూసిన కుంభకోణాల్లో వేలు,లక్షల కోట్ల రూపాయిలు నిలువు దోపిడీకి గురి అయ్యాయి. వీటిలో కొన్నింటిపై విచారణలు జరిగాయి.మరికొన్ని ఏళ్ళూ, పూళ్ళూ గడిచినా ఇంకా జరుగుతూనే ఉన్నాయి.ఈ కేసుల విచారణ ఎప్పటికి పూర్తి అవుతుందో,దోషుల నిర్ధారణ ఎప్పటికి జరుగుతుందో ఎవరూ అంచనా వేయలేని విచిత్ర పరిస్థితి నెలకొని ఉంది.ఉన్నత స్థాయిలో వ్యక్తుల ప్రమేయం ఉన్న కుంభకోణాల విచారణ కోసమే లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని చాలా కాలంగా సామాజిక హితైషులు కోరుతున్నారు. లోక్‌పాల్ వ్యవస్థలో ప్రధానమంత్రి స్థాయి నాయకులపై కూడా విచారణ జరిపే అధికారాలను చేర్చాలని గాంధేయవాది అన్నాహజారే ఐదారు సంవత్సరాలుగా ఆందోళన సాగిస్తున్నారు.లోక్‌పాల్,లోకాయుక్త సక్రమంగా పని చేస్తేనే అవినీతి నిర్మూలన జరుగుతుందన్న దృఢ నమ్మకంతో ఆయన ఏ పార్టీకి చెందని సంస్థ తరఫున ఈ ఆందోళన సాగిస్తున్నారు.అయితే,ఆనాటి యూపీఏ ప్రభుత్వం కానీ, ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం కానీ ఆయన సలహాలనూ,హెచ్చరికలనూ ఖాతరు చేయడం లేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ రెండవ విడత ప్రభుత్వ హయాంలో కుంభకోణాలెన్నో వెలుగు చూడటానికి సమాచార హక్కు చట్టమే కారణమనీ,ఇది తమ ప్రభుత్వం తెచ్చిన చట్టమని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్య అక్షరాలా నిజమే. అవినీతి నిర్మూలన విషయంలో తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అంటూ ఆయన ప్రస్తుత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చిందంటూ ప్రధాని మోడీపై విసుర్లు విసిరారు. ప్రస్తుత ప్రధానిపై మాజీ ప్రధానిపై రాజకీయ దుగ్ధతో చేసిన ఆరోపణగా కాకుండా,వాస్తవ దృష్టితో చూస్తే ఇందులో అసత్యం లేదని ఎవరికైనా అనిపిస్తుంది. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మచ్చుకు ఒక్క అవినీతి ఘటన కూడా చోటు చేసుకోలేదని కమలనాథులు సమయం వచ్చినప్పుడల్లా ప్రకటనలు గుప్పిస్తుంటారు. అవినీతి బయటపడే దారులన్నీ మూసివేసి,విచారణలను చాపచుట్టేసి,లేదా స్టేల పేరిట కేసులను అటకెక్కించేసి తామంతా నీతిమంతులమని ప్రచారం చేసుకోవడం ఆధునిక రాజకీయ నాయకుల శైలి. అవినీతివ్యవస్థీకృతమైందనీ,దానిని కూకటి వేళ్ళతో పెళ్ళగించే వరకూ నిద్రపోనని ప్రధానమంత్రి మోడీ ఇటీవల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశంలో శపథం చేశారు.గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే అవినీతి తగ్గిన మాట నిజమే కానీ, పూర్తిగా నిర్మూలన కాలేదు.నగదు లావాదేవీలను నియంత్రించడం వల్ల నల్లధనం చలామణిని అరికట్టినట్టు ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తోంది. నల్లధనం రూపుమాసిపోతే ఉప ఎన్నికల్లో వందల కోట్ల రూపాయిలు నీళ్ళప్రాయంగా అభ్యర్థులు ఎలా ఖర్చు చేయగలిగారన్న ప్రశ్నకు ఎవరివద్దా సమాధానం లేదు. ప్రతిపక్షం కన్నా ఐదారు రెట్లు ఎక్కువ డబ్బు ఇచ్చి ఓట్లను కొనుగోలు చేస్తున్న పార్టీల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అవినీతి,నల్లధనం కనుమరుగు కావాలంటే, ఎన్నికల సంస్కరణలు తుచ.తప్పకుండా అమలు జేయాలి. పార్టీలకు విరాళాల మొత్తాలపై గట్టి నిఘా వేయాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇటీవల నిర్వహించిన సదస్సులో అన్ని పార్టీల నాయకులు గంభీరోపన్యాసాలిచ్చారు. ఆ అసోసియేషన్ విడుదల చేసినజాబితాలో గరిష్ఠంగా విరాళాలు అందుకున్న పార్టీ బీజేపీ. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అత్యధికంగా విరాళాలు రావడం దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం. ఎన్నికల్లో అభ్యర్థులకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలన్న వోహ్రా కమిటీ సిఫార్సులను అటకెక్కించడంలో ఆనాడు కాంగ్రెస్ అనుసరించిన మార్గాన్నే ఇప్పుడు బీజేపీ అనుసరిస్తోంది. ప్రభుత్వంలో ఏం జరుగుతోందో తెలిసే అవకాశం ప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా అప్పట్లో లభించేది.ఇప్పుడు సహ చట్టం కింద సమాచారం కోసం దాఖలయ్యే దరఖాస్తులన్నీ బుట్టదాఖలు కావడమో, తగిన సమాచారం లేదనో జవాబు వస్తోంది. అలాగే, అవినీతి కేసుల విచారణ నత్తనడక కన్నా నెమ్మదిగా సాగుతున్నప్పుడు,అసలు విచారణే జరగకుండా సాంకేతిక కారణాలను అడ్డుపెట్టుకుని స్టేలు తెచ్చుకోగలుగుతున్నప్పుడు అవినీతిని రూపుమాపామని ఎవరైనా ఎలా చెప్పగలుగుతారు? లోకాయుక్త,లోక్‌పాల్ వంటి వ్యవస్థలు చట్టప్రకారం సజావుగా,సక్రమంగా పని చేసినప్పుడే ఆరోపణలు నిగ్గుతేలుతాయి. లోక్‌పాల్ కోసం యూపీఏ ప్రభుత్వం కొంత ప్రయత్నమైనా చేసింది.ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి అయినాదాని ఊసు లేదు.అందుకే లోక్‌పాల్ కోసం మరోసారి ఉద్యమిస్తానని అన్నాహజారే హెచ్చరించారు.రాజకీయాలకు అతీతంగా జరిగినప్పుడే లోక్‌పాల్ ఉద్యమం జనాదరణకు నోచుకుంటుంది.

మంచి మాట

శిక్ష క్రూరత్వాన్ని మాయం చేసే కళ.
అది విచక్షణా జ్ఞానాన్ని
నేర్పుతుంది.

● ప్లేటో

శత్రువు గుండెల్లో వేగుచుక్క

అజిత్ దోవల్ పేరు ఇప్పుడు మార్మోగిపోతోంది. శత్రువు గుండెల్లో నిద్రపోయే వేగుచుక్క. గూఢచార సంస్థలో చాలా కాలం పని చేసిన ఆయన శత్రువులను గడగడలాడించిన అరివీర భయంకరుడు.అవసరాన్నిబట్టి ఆహార్యాన్ని మారుస్తూ శత్రు శిబిరాల్లోకి చొచ్చుకుని వెళ్ళి తన పని ముగించుకుని సురక్షితంగా బయటకు రాగల నేర్పరి. భారత,చైనాల మధ్య మరో యుద్ధం తప్పదన్న ఊహాగానాలకు ఊతం ఇచ్చే విధంగా సిక్కిం సరిహద్దులలో ఏర్పడిన ఉద్రిక్తత తొలగిపోయేట్టు చేయడం లో, సేనల ఉపసంహరణకు ఇరుదేశాలూ అంగీకారానికి రావడంలో దోవల్ కృషి ఎంతో ఉంది.

జనసాంద్రతలో ఆసియాలో రెండు పెద్ద దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణాన్ని ఒక్కసారిగా చల్లార్చిన చతురుడు. ఎంతటి క్లిష్టసమస్యనైనా చిటికెలో పరిష్కరించగల చాణక్యుడు.ఆయన ప్రస్తుతం జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.ఆ పదవికి ఆయనను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏరికోరి ఎంపిక చేశారు. పూర్వపు ప్రధానమంత్రులు కూడా ఇలాంటి దోవల్‌లను ఏరికోరి ఎంపిక చేసుకున్నవారే. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి తన హయాంలో బ్రిజేష్ మిశ్రాను ఈ పదవికి ఎంపిక చేసినప్పుడు చాలా మంది నివ్వెరపోయారు.ఆయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య యోధుడు ద్వారకా ప్రసాద్ (డిపి) మిశ్రా కుమారుడు. మధ్యప్రదేశ్ రాజకీయాల్లో చక్రం తిప్పారు. అటువంటి రాజకీయ చాణక్యుని కుమారుడైన బ్రిజేష్ మిశ్రా కాంగ్రెస్ హయాంలోనే కాకుండా,వాజ్‌పేయి హయాం లో జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుగా వ్యవహరించడం, వాజ్‌పేయికి అత్యంత సన్నిహితుడు కావడం అప్పట్లో చాలా మందికి మింగుడు పడలేదు.వాజ్‌పేయి అనుసరించిన విదేశాంగ విధానం రూపశిల్పి బ్రిజేష్ మిశ్రా. ముఖ్యంగా, పొరుగు దేశాలతో సంబంధాల విషయంలో వాజ్‌పేయి అనుసరించిన విధానం వల్ల దేశానికి మంచి జరిగిందని విశ్వసించేవారు ఈనాటికీ ఎంతో మంది ఉన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కె.నారాయణన్, శివశంకర్ మీనన్‌లు జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారులుగా వ్యవహరించారు. జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు పదవి అత్యంత కీలకమైనది. విదేశాంగ వ్యవహారాల్లోనే కాక,రక్షణ సంబంధమైన వ్యవహారాల్లో కూడా అన్ని సమస్యలను ఆకళింపు చేసుకున్న వ్యక్తికే ఆ పదవిని అప్పగిస్తారు. పాకిస్తాన్, చైనాలతోనే కాకుండా, అటు అమెరికాతోనూ, ఇటు రష్యాతోనూ, అరబ్ దేశాలతోనూ భారత్ సంబంధాలు వృద్ధి కావడానికి జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుల (ఎన్‌ఎస్‌ఏ) పాత్ర ఎంతో ప్రముఖమైనది. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించగల మేధావులనే ఈ పదవికి ఎంపిక చేస్తూ ఉంటారు.నారాయణన్, శివశంకర్ మీనన్‌లు భద్రతా వ్యవహారాల నిపుణులు.శివశంకర్ మీనన్ వివిధ దేశాల్లో దౌత్యాధికారిగా ఉన్నత పదవులను అలంకరించారు. చైనాతో సంబంధాల పునరుద్ధరణ విషయంలో ఆయన ఎంతో కృషి చేశారు. అదే మాదిరిగా ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఏగా ఉన్న అజిత్ దోవల్ దౌత్య రంగంలోనే కాకుండా, భద్రతా వ్యవహారాల్లో ఎంతో ప్రావీణ్యాన్ని సంపాదించారు.అందుకే ఆయనను అత్యంత కీలకమైన ఆ పదవికి ప్రధాని నరేంద్రమోడీ ఎంపిక చేశారు.

ఎన్‌ఎస్‌ఏల పాత్ర: ప్రతి దేశానికీ ఎన్‌ఎస్‌ఏలు ఉంటారు. దౌత్యపరంగా సత్సంబంధాలను నెరపగల సమర్థుల నే అటువంటి పదవులకు ఎంపిక చేస్తుంటారు.అయితే,మన పొరుగు దేశమైన పాకిస్తాన్ ఇందుకు విరుద్ధం.పాక్ జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుగా చాలా కాలం వ్యవహరించిన సర్తాజ్ అజీజ్ మన దేశంపై అకారణంగా ద్వేషాన్ని పెంచుకుని ఇరు దేశాల మధ్య అగ్గి రాజేయడానికి ఎంతో ప్రయత్నం చేశారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కి మన దేశంపై శత్రు భావాన్ని నూరిపోసింది అత డే. వయసు,అనుభవాల రీత్యా చాలా పెద్దవాడైనా అతడివి అన్నీ చిన్న బుద్ధు లు. అతడి వల్ల నవాజ్ షరీఫ్ ముఖం చెల్లని పరిస్థితిని ఎన్నోసార్లు ఎదుర్కొన్నారు.అతడిని తొలగించలేక ఆ పదవి నుంచి తప్పించి, విదేశాంగ వ్యవహారాల్లో సలహాదారుగా నియమించారు. అజీజ్‌ని గడగడలాడించిన చరిత్ర అజిత్ దోవల్‌కి ఉంది. అజిత్ దోవల్‌తో సమావేశమైతే తన బండారంబయటపడుతుందన్న వెరపుతో ఢిల్లీలో జరగాల్సిన సమావేశానికి అజీజ్ డుమ్మా కొట్టాడు. దోవల్‌కి పాక్ ఆంతరంగిక వ్యవహారాల గురించే కాకుండా,చైనా గురించి అన్ని విషయాలూ తెలుసు. అందుకే, డోక్లామ్ ఉద్రిక్తతను పరిష్కరించేందుకు ఆయనను ప్రధాని మోడీ నియోగించారు.

దోవల్ డాక్టరీన్ (సిద్ధాంతం): ఉగ్రవాదాన్ని ఏయే దేశాలు పెంచి పోషిస్తున్నాయో సాధికారికంగా చెప్పగల నేర్పూ,నైపుణ్యం దోవల్ సొంతం.ఉగ్రవాద సంస్థలకు ఏయే దేశాల నుంచి నిధులు అందుతున్నాయో, ఎవరెవరు సాయపడుతున్నారో అన్ని విషయాలూ ఆయనకు కరతలామలకం. పాకిస్తాన్‌ని ఉగ్రవాద దేశంగా ప్రకటించాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి తెరవెనుక ఆయన చేసిన కృషిని తక్కువగా అంచనా వేయలేం. పాక్ కేంద్రంగా పని చేస్తున్న జైష్ ఎ మహ్మద్,లష్కర్ ఎ తోయిబా వంటి సంస్థలకు నిధులు ఎక్కడి నుంచి అందుతున్నాయో,ఏయే బ్యాంకుల్లో వాటికి ఖాతాలు ఉన్నాయో రుజువులతో నివేదికలు అందించిన దోవల్‌ని చూస్తే పాక్,చైనా నాయకులు బెదురుతూ ఉంటారు. తమ గుట్టుమట్లను ఎక్కడ సేకరిస్తాడోనన్న భయం వారిలో ఉంది.ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి ఆయన ప్రతిపాదించిన కార్యక్రమం దోవల్ డాక్టరీన్ (సిద్ధాంతం)గా ప్రాచుర్యాన్ని పొందింది.వేగులంటే రాజకీయ నాయకులే కాకుండా,ఉన్నత స్థానాల్లో ఉన్న వారు బెదురుతూ ఉంటారు.వేగుల్లో రేచుక్క లాంటి వారంటే ఇంకా ఎక్కువ భయపడతారు.దోవల్ రెండవ తరహాకు చెందిన వారు.

ఎవరీ దోవల్?: ఉత్తరాఖండ్‌లోని పౌడీ గఢ్వాల్‌లో జన్మించిన అజిత్ దోవల్ కేరళ క్యాడర్‌కి చెంది న 1968వ సంవత్సరం బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఇంటిలిజెన్స్‌శాఖలో ఆపరేషన్స్ విభాగంలో ఆయన చాలా కాలం పని చేశారు. 2004-05 మధ్య ఇంటిలిజెన్స్ విభాగం డైరక్టర్‌గా కూడా పని చేశారు. శాంతి కోసం కృషి చేసిన అత్యంతఉన్నతమైన సాహసికుని అవార్డు కీర్తిచక్రను ఆయన అందుకున్నారు. ఆ అవార్డును అందుకున్న మొదటి పోలీసు అధికారి ఆయనే.



సాంఘిక కార్యకలాపాల్లో: కేంద్ర ప్రభుత్వ గూఢచార విభాగం ఐబి నుంచి రిటైర్ కాగానే ఆయన వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (విఐఎఫ్) పేరిట మేధావుల బృందాన్ని ఏర్పాటు చేశారు.దేశం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మేధావుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి అందజేసే కార్యక్రమాన్ని ఆ సంస్థ నిర్వహించేది. పంజాబ్, ఈశాన్య రాష్ట్రా లు, పాకిస్తాన్, జమ్ము, కాశ్మీర్‌లలో ఉగ్రవాదం మూలాల గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు.జేమ్స్‌బాండ్‌ని ఎందుకన్నారు? ఆయనను జేమ్స్ బాండ్ అని పిలుస్తుంటారు. ఆయన కరడుకట్టిన ఉగ్రవాదుల మధ్య చాలా నేర్పుగా, ఒడుపుగా తన విధులను నిర్వహించారు. వారితో కలిసిమెలిసి ఉంటూనే వారి ఉక్కుకౌగిలిలో పడకుండా చాలా నేర్పుగా చాలా సార్లు బయటపడ్డారు. అలాంటి సాహసాలు చేయడంలో ఆయన దిట్ట. ఎన్నోసార్లు ఆయన ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకున్నారు. పాక్ ఉగ్రవాదుల క్రీనీడలో ఆయన ఏడేళ్ళు గడపగలిగారంటే ఎంతటి నేర్పు గలవారో వేరే చెప్పనవసరం లేదు. నరాలు తెగే ఉత్కంఠ రేకెత్తించే జేమ్స్ బాండ్ సినిమాల్లో గూఢచారులు ఏ విధంగా శత్రు శిబిరాల్లో ప్రవేశించి అక్కడి రహస్యాలు తెలుసుకుంటారో అలాంటి విధులను చాలా చాకచక్యంగా దోవల్ నిర్వహించి మంచి పేరు సంపాదించుకున్నారు.

డేర్ డెవిల్: శత్రు రహస్యాలను తెలుసుకోవడానికి దూసుకుని పోయే తత్వం కలిగిన ఆయనను డేర్ డెవిల్ అని అంటూంటారు.శత్రువుల బారిన పడకుండా ఆయన మారువేషాల్లో కూడా తిరిగిన ఉదంతాలు కోకొల్లలు.ఒకసారి పాకిస్తానీ ముస్లిం వేషంలో తప్పించుకున్నారు. మసీదులకు తరచూ వెళ్తూ స్థానికులు ఎంతో మందిని మిత్రులుగా చేసుకున్నారు. ఆయన కుట్టిన చెవులు చూసి హిందువు అని ఎవరో అనుమానించగా,వెంటనే ఆయన శస్త్ర చికిత్స చేయించుకున్నారు.

స్వర్ణాలయంలో ప్రవేశం: 1988లో ఆపరేషన్ బ్లాక్ థండర్ జరగడానికి ముందు ఆయన అమృత్‌సర్ స్వర్ణాలయంలోకి ప్రవేశించారు.ఆ ఆలయంలో దాక్కున్న ఉగ్రవాదులతో తాను పాక్ రహస్య గూఢచార సంస్థ ఐఎస్ఐ కి చెందిన వాడినని మీకుసాయం చేద్దామని వచ్చానని చెప్పి నమ్మించారు. ఉగ్రవాదుల నుంచి సమాచారాన్ని సేకరించి భద్రతాదళాలకు అందించారు. రహస్య గూఢచర్యంలో ఆయన ఎంతో పేరు సంపాదించారు.

దోవల్ డాక్టరీన్ అంటే...: 2014,2015లలోఆయన రక్షణ,విదేశాంగ విధానలపై తన అభిప్రాయాలను కూలంకషంగా వివరించారు. ఆయన అభిప్రాయాలే దోవల్ సిద్ధాంతంగా ప్రాచుర్యాన్ని పొందాయి. భారత్‌ని శత్రుదేశంగా పరిగణిస్తున్న దేశాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.శత్రువును అదును చూసి దెబ్బకొట్టాలన్నది ఆయన సిద్ధాంతాల్లో ముఖ్యమైనది. గత సంవత్సరం సెప్టెంబర్ 29వ తేదీన ఆక్రమిత పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై జరిగిన మెరుపుదాడులు ఆయన ఆలోచనే. అలాగే, మయన్మార్‌లో ఉగ్రవాదులపై పొంచి ఉండి చేసిన దాడి కూడా ఆయన ఆలోచనే.

పాక్‌ని హడలెత్తించిన దోవల్: ముంబాయిలో తొమ్మిదేళ్ళ క్రితం నవంబర్ 26న జరిపిన దాడుల వంటివి పునరావృతం అయితే, బలూచిస్థాన్‌పై ఆశ వదులుకోవల్సి ఉంటుందని పాక్‌ని హెచ్చరించిన ధీరుడు ఆయన. వ్యక్తి విలువల కన్నా,దేశం విలువలు గొప్పవని ఆయన బలంగా నమ్ముతారు.

చైనాకు ఎందుకు ద్వేషం: సిక్కిం సరిహద్దుల్లో డోక్లామ్ వద్ద తన సేనలను మోహరించిన చైనా తిరిగి వెనక్కితగ్గేట్టు చేయడంలో దోవల్ అనుసరించిన వ్యూహం అమోఘం. దోవల్ సిద్ధాంతం గురించి చైనీస్ ప్రభుత్వానికి, అక్కడి గూఢచార సంస్థలకూ తెలుసు. గత నెలలో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశానికి దోవల్ వెళ్ళడానికి ముందే బీజింగ్ నుంచి వెలువడే గ్లోబల్ టైమ్స్‌తో సహా పలు అధికార పత్రికల్లో దోవల్ వస్తున్నాడు జాగ్రత్త అని హెచ్చరిస్తూ వ్యాసాలు ప్రచురితమయ్యాయి. డోక్లామ్ ఉద్రిక్తతకు దోవల్ కారణమని కూడా నింద వేశాయి. దోవల్ చైనీస్ నాయకులతో బేరసారాల చేద్దామనుకుంటే నిరాశ తప్పదంటూ కూడా వ్యాసాలు వెలువడ్డాయి. అయితే, ఆయన నిరాశపడే పరిస్థితి రాలేదు. సరిహద్దుల్లో ఉద్రిక్తతను తగ్గించడంలో ఆయన కృషి ఫలించింది. గ్లోబల్ టైమ్స్ వంటి పత్రికల అంచనాలు తలకిందులయ్యాయి. డోక్లామ్ నుంచి సేనల ఉపసంహరించుకునేందుకు చైనా కూడా అంగీకరించింది. డోక్లామ్ ఉద్రిక్తత మబ్బులా విడిపోవడంతో దోవల్ ప్రతిభ మరోసారి యావత్ ప్రపంచానికి తెలిసింది.దోవల్ డాక్టరీన్‌తో డోక్లామ్ ఉద్రిక్తత తొలగిపోయింది.

- ఎపి స్వామి

ముసురుతోనే మునిగిపోయే..

ప్రపంచంలోనే అత్యుత్తమ ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానంభారత్‌సొత్తు ఇదిప్రపంచవ్యాప్తంగా వినిపించే మాట వాతావరణ మార్పుల అంచనాలో భారతదేశంచాలాముందుందనిపలుదేశాలు విశ్వసిస్తున్నాయి ఆ సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన వాతావరణ అంచనాలు ఏమయ్యాయి? ముంబైపై కమ్ముకున్న భీకరమైన రణోన్మత్త మేఘ వాటికను ఈ ఉపగ్రహాలు ఎందుకు కనుగొనలేకపోయాయి.? అందులో ఎందుకు విఫలమయ్యాయి? శివుని జటాజూటం నుంచి ప్రళయభీకరంగా పొంగి పొర్లిన గంగలా ఆర్థిక నగరం ఏ మూలనూ విడిచిపెట్టకుండా కసితీరా ముంచేయబోతోందని ఎందుకు అంచనా వేయలేకపోయాయి? స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై ప్రధాని నరేంద్ర మోడీ జరిగేదేదో జరుగుతుంది అనే వైఖరి విడనాడాలంటూ ఇచ్చిన సందేశం.. అధికారుల చెవులపడలేదనడానికి ఇది ప్రత్యక్షసాక్ష్యం.

ఉపగ్రహాలు అంగారక గ్రహంపై వాతావరణాన్ని కచ్చితంగా అంచనా వేయగలవు..కానీ ముంబైకి సంబంధించి మాత్రం వేయలేవు. ఎంత దురదృష్టకరమైన అంశమిది. హాంగ్‌కాంగ్‌ను ఇటీవల హ్యాటో అనే టైఫూన్ తాకింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకున్న ఆ ప్రభుత్వం ఒక్క పౌరుడు కూడా వీధుల్లో రాకుండా చూసింది. ఎటువంటి ప్రాణనష్టమూ కలగకుండా చర్యలు చేపట్టింది. చరిత్రలోనే హ్యాటో అత్యంత తీవ్రమైన తుపాను. హాంగ్‌కాంగ్ వద్ద తీరం తాకింది. ఇలాంటిదే మన దేశంలో సంభవించి ఉంటే... ఇంతేనా...

హాంగ్‌కాంగ్ దాకా ఎందుకు.. నవ్యాంధ్ర ప్రదేశ్ కూడా సాంకేతిక వ్యవస్థను అత్యంత సమర్థంగా వినియోగించుకుంటోంది. ఆఖరుకు పిడుగుపాటు ఎక్కడ తాకుతుందో కూడా అరగంట ముందే అంచనా వేయగలుగుతోంది. ఇందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించింది. సమాచారం తెలిసిన మరుక్షణం సంబంధిత ప్రాంతాల్లోని అధికారులను అప్రమత్తం చేసి, ప్రాణాలు పోకుండా కాపాడగలుగుతోంది. అంటే ఈ విషయంలో ఏపీ నుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. ప్రజలు బాధ పడుతున్నారు. పట్టణాలు స్థంభించి పోతున్నాయి. రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా కుదేలవుతోంది. అంచనా వేయగలిగిన సామర్థ్యముండీ అంచనా వేయలేక పోతే ఉపయోగమేమిటి?

మంగళవారం కురిసిన భారీ వర్షాలూ...వాటికి తోడైన పెను గాలులు ముంబైని స్థంభింపచేశాయి. చెట్లను కూకటివేళ్ళతో పెకిలించివేశాయి. కాలనీలో మోకాటి నీటిలో మునిగిపోయాయి. కిందటేడాదీ జరిగిందిదే. మూడు గంటల వ్యవధిలో 65 మిమీ వర్షపాతం నమోదైందంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు.

ముంబై 26 జూలై 2005.. ఆ మహానగరానికి ఓ పీడకల. అరేబియన్ మహాసముద్రంలో ఏర్పడిన తుపాను ఒక్కసారిగా ముంచెత్తడంతో అతలాకుతలమైంది. వెయ్యిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 944 మిమీ వర్షపాతం నమోదైంది(అత్యధిక వర్షపాతాల్లో ఇది 8వది). తరువాతి రోజు అంటే 27న ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల మధ్య 644 మిమీ వర్షం కురిసింది. గోరేగావ్, కొలాబా, మెరైన్ డ్రైవ్, బాంద్రా..ఇలా ఒకటేమిటి అన్ని ప్రాంతాలూ వర్షపు నీటిలో మునిగిపోయాయి. వర్షపు నీటితో పాటు ప్రజలూ రోడ్లపై ప్రవాహంలాగే కనిపించారు. ఎటు వెళ్ళాలో తెలీదు.. ఎక్కడ నిలబడాలో తెలీదు. కార్లలోకి నీళ్ళు ప్రవేశించి, బయటకు రాలేక పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. దేశానికే ఆ వర్షాలు ఓ పీడకలగా పరిణమించాయి.

అదే నగరం.. 29.. ఆగస్టు 2017.. ఇంచుమించుగా అదే పరిస్థితి ఎదుర్కొంది. అంతే అసౌకర్యం. నీట మునిగిన ప్రాంతాలు..బయటకు వెళ్ళిన వారు ఇంటికి చేరలేక తంటాలు. పెనుగాలులతో కూడిన వర్షాలతో ముంబై ఒక్కసారి ఉలిక్కిపడింది. గజగజలాడింది. ఉరుములేని పిడుగులా.. హెచ్చరికలు లేని వానతో విలవిలలాడింది. మరో రెండు రోజులు కురవచ్చనే హెచ్చరికను వాతావరణ శాఖ ఆ తదుపరి విడుదల చేసింది. ఊపిరి పీల్చుకునే అంశమేదైనా ఉందీ అంటే అది ప్రాణనష్టం లేకపోవడం. అంతే. మిగిలిన దృశ్యాలన్నీ సేమ్ టు సేమ్. ముంబయిలో ఎప్పుడు వర్షం కురుస్తుందో ఎవరికీ తెలియదు. బయటకు వెళ్ళేవారు గొడుగు తప్పనిసరిగా తీసుకెడతారు. కొద్దిసేపు కురిసి ఆగిపోతుంది. ఇది ముంబై ప్రత్యేకత.

సాంకేతికంగా ముందే హెచ్చరించి ఉంటే ప్రజలు కష్టాలబారిన పడకుండా నివారించి ఉండవచ్చు. సాయంత్రం 4.30 గంటల కల్లా సముద్ర పోటు పెరుగుతుంది. బీభత్సమైన వర్షాలు కురిసి సమయంలో ఇది డ్రైనేజి వ్యవస్థను స్థంభింపజేస్తుంది. అంటే ఆ నీరు కూడా వరద నీటిలో కలిసిపోతుందన్నమాట. గంటల కొద్దీ వివిధ ప్రాంతాలు నీటిలోనే నానిపోతూ ఉన్నాయి. విమానాలాగిపోయాయి.. ట్రైన్ సర్వీసులు, బస్సులు రద్దయ్యాయి. జనజీవనం స్తంభించింది. మొత్తం మీద ముంబై బేలగా మారిపోయింది. ఇదంతా ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్లనే. ఇప్పటికైనా ఓ రాష్ట్రా నికి ఆవల ఉన్న నవ్యాంధ్రను చూసి, మహారాష్ట్ర నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది.




- *ముంబై ఏడు ద్వీపాల సమూహం*
- *21 మిలియన్లకు పైగా జనాభా*
- *భారత ఆర్థిక రాజధాని*
- *బిలియనీర్లు, మిలియనీర్లు ఎక్కువగా ఉండే నగరం*
- *హిందీ సినిమాకు ఆయువుపట్టు*
- *చినుకు చిటుక్కుమంటే బేలగా మారిపోతుంది*
- *సర్వం స్థంభించిపోతాయి.*

అమెరికాలో ప్రైవేటు వాతావరణ సంస్థలు

నిన్న కాక మొన్న టెక్సాస్‌ను కుదిపేసిన టైఫూన్‌ను ఊహించడంలో కూడా అమెరికన్ వాతావరణ విభాగాలు విఫలమయ్యాయి. భవనాలు పేకమేడల్లా కుప్పకూలుతుంటే కళ్ళప్పగించి చూశాయి. అక్కడ ప్రభుత్వ వాతావరణ విభాగాలే కాక, ప్రైవేటు ఏజెన్సీలు కూడా వాతావరణ వివరాలను అందిస్తుంటాయి. నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్, నేషనల్ ఓషనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ సివియర్ స్టార్మ్స్ లేబరేటరీ, నేషనల్ క్లైమాటిక్ డాటా సెంటర్, నేషనల్ వెదర్ సర్వీస్, నేషనల్ సెంటర్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రెడిక్షన్, నేషనల్ హర్రికేన్ సెంటర్, స్టార్మ్ ప్రెడిక్షన్ సెంటర్, నేవల్ మేరిటైమ్ ఫోర్‌కాస్ట్ సెంటర్‌లు ప్రభుత్వ సంస్థలు ఇవి కాక ఇంకా పదుల సంఖ్యలో ప్రైవేటు ఏజెన్సీలపై అమెరికా వాతావరణ వివరాలకోసం ఆధారపడుతుంది. భారత్‌కు ఇండియన్ మెటిరియలాజికల్ డిపార్ట్‌మెంట్ ఒక్కటే ఆధారం.

-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి

ఆదిత్య హృదయం



నారదుడి అజీర్తి

ఉదయాన్నే లేచాడు నారదుడు. ఏదో ఓ ప్లేస్‌లో.. కడుపంతా పట్టేసినట్టయింది. ఒకటే త్రేన్పులు, గ్యాస్. వాళ్ల లోకంలో ప్రసిద్ధి చెందిన వైద్యుడి దగ్గరికి బైల్దేరాడు ఆశ్చర్యంగా. వైద్యుడు ముక్కుమూసుకుని తపస్సు చేసుకుంటున్నాడు. నారాయణ.. నారాయణ.. అనగానే కళ్లు తెరిచి, నారద మునీంద్రులకు స్వాగతం. ఏమిటిలా పొద్దున్నే వచ్చారు.. గత కొన్ని రోజులుగా కడుపు కదలటం లేదు వైద్యుడూ... కలహభోజనం కాస్త ఎక్కువైందేమో నారదా అన్నాడు. అబ్బే... ఈ మధ్య మనకి పెద్ద పనేముంది? కృత, త్రేతా, ద్వాపర యుగాల్లో మనకి మూడుపూటలా ముద్ద దిగేది. కలియుగం వచ్చాక దేవతలకి కలికాలం దాపురించింది. పనే ఉండటం లేదు. ఎప్పుడో ఏడాదికోసారి పండగొస్తే ఆ పర్టిక్యులర్ దేవుడో, దేవతో పూజలందుకుని గమ్మునుంటున్నారు. పూర్వం అసురులు, దేవతలు అని రెండు వర్గాలు కాబట్టి మనకి ఫిట్టింగ్ పెట్టి పుల్‌మీల్స్ ఎంజాయ్ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు మనుషులు, దేవతలే. అసుర జాతిలేదు కదా... మనుషులంతా ఏదో ఒక దేవతకో, దేవుడికో భక్తులాయె. ఫిట్టింగ్ పెట్టే అవకాశం ఏది? కలియుగంలో సుష్టుగా కలహ భోజనం చేసి రెండు వేల పదిహేడు సంవత్సరాలైంది. వైద్య... మానవ లెక్కల ప్రకారం మరి నాడిచూస్తే అజీర్తి సూచనలు గోచరిస్తున్నాయి.

తమరేమో భోజనమే లేదంటున్నారు ఇదెక్కడి చిక్కు స్వామి నాకు.. అని వైద్యుడు విసుక్కున్నాడు భక్తిగానే. నువ్వెలాగైనా నా రోగానికి కారణం కనిపెట్టి చెప్పాలి అన్నాడు నారదుడు కోపంగా. నావల్ల కాదు స్వామీ.. త్రిమూర్తులలో ఎవరైనా దివ్యదృష్టితో చెప్పాలి తప్ప నా లాంటి సామాన్యవైద్యులకి అంతుపట్టని అజీర్తి ఇది అన్నాడు. సరే అని నారదుడు ముక్కంటి మూడోకన్ను తెరిచి చూపించమందామనుకుని కైలాసానికి వెళ్ళాడు. శివరాత్రికి ఇంకా చాలా టైముంది కదా అని శివుడు హాయిగా బజ్జున్నాడు. నారదుడు వెయిట్ చేసి, చేసి వెళ్లిపోయాడు. విష్ణుమూర్తి అరికాలిలో ఉన్న కన్నులో అజీర్తి ఎలా కలిగిందో చూద్దామని వెళ్లాడు నారదుడు. లక్ష్మీదేవి దీపావళి దాకా ఎవరూ డిస్టర్బ్ చేయద్దని అలారం పెట్టి పడుకుంది. విష్ణుమూర్తి పాదాల చెంత.. దాంతో నారదుడు ఆ తల్లి నిదుర పాడు చెయ్యలేక బ్రహ్మదేవుడి దివ్య దృష్టినుపయోగించి తెలుసుకుందాం అని వెళ్లాడు. బ్రహ్మ వరుసగా చైనా వాళ్లని, తర్వాత భారతీయుల్ని, ఆ తర్వాత రష్యా వాళ్లని, యూరోపియన్లని ఇలా జనాభా లెక్కల ప్రకారం తలో తలకాయతో, తలకాయకి రెండు చేతుల చొప్పున ఎడా పెడా తయారు చేసేస్తున్నాడు బిజీగా. నారదుడు గారంగా, నాన్నా.. అన్నాడు.. నేను బిజీ అన్నాడు బ్రహ్మ.. నాకు కడుపులో అనీజీ.. అన్నాడు. నారదుడు - నేను బిజీ.. డాక్టరుకి చూపించుకో అన్నాడు. నువ్వొక్క అరక్షణం నాకు అజీర్తి ఎందుకొచ్చిందో డయాగ్నసైస్ చేసి చెప్తే. అప్పుడు మందిస్తానన్నాడు నవ వైద్యాచార్యుడు అన్నాడు నారదుడు. మూడు తలకాయల, ఆరు చేతుల పని ఆపకుండా, అంటే చైనా, భారత్, రష్యాల పని ఆపకుండా యూరప్ దేశ సృష్టిని ఆపి, ఒక తలకాయ, రెండు చేతులని ఉపయోగించి, కళ్లు మూసుకుని కుడి చేయి, భృకుటి దగ్గిర పెట్టి నెమ్మదిగా కళ్లు తెరిచాడు. ఈ మధ్య ఎక్కడికెళ్లావ్.. మొన్న వినాయక చవితికదా, మన బొజ్జ వినాయకుడితో సరదాగా భూలోకం చిన్న రౌండేసి వచ్చాను. అక్కడ ఏం చేశావ్? అన్నాడు బ్రహ్మ. ఏముంది వినాయకుడు నవరాత్రులూ నవకాయ పిండివంటలతో సుష్టుగా విందులారగిస్తుంటే, నేను అక్కడే ఉండి చూస్తే మళ్లీ నవ్వినా, దగ్గినా చంద్రుడిలా నన్ను ముక్కలు చేస్తాడని భయపడి అలా నా కలహ భోజనాన్ని వెతుక్కుంటూ వెళ్లాను. అన్నట్లు జనకా, ఈ మధ్య ఉభయ తెలుగు రాష్ట్రా ల్లో మామూలు భోజన హోటల్స్ లాగా కలహ భోజన హోటల్సు కూడా తయారయ్యాయి సుమా! వాటిని ఆంగ్లంలో ఇంటర్నెట్ సెంటర్లు అంటారట. అందులో కూర్చుని, మీటనొక్కితే ఫేస్ బుక్, ట్విట్టర్ మొదలైన సామాజిక అనుసంధాన సైట్లలో ప్రతి ఒక్క పౌరుడూ, అంటే నెటిజన్ అపర నారదుడే. రామ్‌గోపాల్ వర్మ అనే తెలుగు దర్శకుని నుండి, పవన్ ఫ్యాన్స్, మహేష్ ఫ్యాన్స్, బాలయ్య ఫ్యాన్స్, మెగా ఫ్యాన్స్, రచయితలు, రచయిత్రులు, సాఫ్ట్ వేర్ నిపుణులు, గృహిణులు, విద్యార్థినీ విద్యార్థులు, గాయనీ గాయకులు, నటీనటులు, జ్యోతిష్యులు, పండితులు, పామరులు, భగ్నప్రేమికులు, మహేష్ కత్తి వంటి సమీక్షకులు, అన్ని కులాలవాళ్లు, మతాలవాళ్లు, జాతులవాళ్లు అందరూ ఒకరితో ఒకరు కలహించుకోవడం, లేదా ప్రతి ఇద్దరి మధ్యా మూడోవాడు నారదుడై ఫిట్టింగు పెట్టడం - ఆహా - చూడడానికి నా మనసు సంతోషంతో పొంగిపోయి, కడుపు నిండిపోయిందనుకో, ముఖ్యంగా ట్రాల్ పేజీలని ప్రత్యేకంగా కలహ కాగితాల హవా నడుస్తోంది అంతర్జాలంలో. అన్నాడు ఎగ్జయిటింగ్‌గా. అదీ సంగతి. ఇంటర్నెట్ లేని కాలంలో నీకు యుగానికొక్క సారో, రెండు సార్లో కలహ భోజనం లభించేది. కడుపు మితంగా నిండేది. ఇప్పుడు పదిహేను యుగాలకి సరిపడా భోజనం చేశాక తొమ్మిది రోజుల్లో అజీర్తి రాకచస్తుందా అన్నాడు బ్రహ్మ చిద్విలాసంగా. హతోస్మి - అదా సంగతి అంటూ వైద్యుడి దగ్గిరకి పరుగెత్తాడు నారదుడు అజీర్తి మందు కోసం.



(మళ్లీ వారం మరో విశేషంతో...)

మీ
వి.ఎస్.ఆదిత్య

ఉగ్రవాదానికి అతీతంగా అభివృద్ధి చెందిన దేశాన్ని

కలాం కోరుకునేవారు

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఏపీజే అబ్దుల్ కలాం వినూత్నమైన అభివృద్ధి విధానాల మార్గంలో ప్రయాణించిన అసమాన వ్యక్తి అని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు కొనియాడారు. ఢిల్లీలో ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన 2వ అబ్దుల్ కలాం స్మారకోపన్యాసంలో ఆయన ప్రసంగించారు. అత్యంత సామాన్యమైన కుటుంబం నుంచి వచ్చిన డా. కలాం చిన్నతనంలో కుటుంబ పోషణకు సహాయపడేందుకు ఇంటింటికీ దినపత్రికలను పంచేవారని వెంకయ్య నాయుడు అన్నారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితులలో అత్యున్నతమైన విద్యనభ్యసించారని, ఒక అత్యున్నతమైన మిస్సైల్ శాస్త్రవేత్తగా ఎదిగారని ఉప రాష్ట్రపతి గుర్తు చేసారు. తదుపరి భారత రాష్ట్రపతిగా పనిచేసారని అన్నారు. ఒక సామాన్యమైన వ్యక్తిని దేశానికి రాష్ట్రపతిని చెయ్యడం మన దేశంలోని అత్యుత్తమమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. కలాం ఎంతటి ఉన్నతమైన పదవిని అధిష్టించినా, అత్యంత సామాన్యమైన జీవనాన్ని గడిపారని, ఉన్నతమైన అధికారి అయినా లేదా అత్యంత సామాన్యమైన ఉద్యోగి అయినా ఒకే రకమైన ప్రేమాభిమానాలను చూపేవారని అన్నారు. డా. కలాం భారత్‌ను 2020 నాటికి ఒక మార్పుచెందిన దేశంగా, పూర్తిగా అభివృద్ధి చెం ది ఇతర అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలని అనేవారు. దీనినే ఆయన విజన్ 2020 అని పిలిచేవారని ఉపరాష్ట్రపతి చెప్పారు. 90 వ దశకంలో ఆయన టెక్నాలజీ ఇన్ఫర్మేషన్, ఫోర్‌క్యాస్టింగ్ అండ్ అసెస్మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా ఉన్నపుడు టెక్నాలజీ విజన్ ఫర్ ఇండియా అప్ టు 2020 అనేకీలకమైన పత్రం రూపకల్పనలో ఆయన ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. డా. కలాం విజన్ 2020 దేశంలోని పట్టణ్ణగ్రామీణ ప్రాంతాల మధ్య దూరాన్ని బాగా తగ్గించేందుకు ఉద్దేశించినది భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. విద్యుత్తు, నాణ్యమైన తాగునీరును సమానంగా మరియు సరి పడునంతగా పంచాలని, అలాగే వ్యవసాయం, పరిశ్రమలు మరియు సేవల రంగం సమానంగా విస్తరింప చెయ్యాలని కలాం పేర్కొన్నట్టు వెంకయ్య వెల్లడించారు.

భారత సైన్యం మరింత బలోపేతం

- ఖాళీగా ఉన్న 57 వేల పోస్టుల భర్తీ
- ఆయుధాల ఆధునికీకరణకు రక్షణ శాఖ చర్యలు

న్యూ ఢిల్లీ: భారత సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం సరిహద్దు దేశాలతో భారత్ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సైన్యాన్ని ఆధునికీకరించాలని సర్కారు భావించింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పేరుతో బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. ఈ ప్రకటనలో సైన్యం బలోపేతానికి చేయాల్సిన చర్యలను ప్రధానంగా చర్చించింది. మాజీ సైన్యాధికారి లెఫ్టినెంట్ షెకాత్కార్ ఆధ్వర్యంలో కమిటీ చేసిన సూచనలను అమల్లోకి తెచ్చేందుకు యత్నిస్తుంది. రక్షణ శాఖ కీలక అధికారులతో ఇటీవల చర్చలు జరిపిన జైట్లీ ఈ మేరకు ప్రకటనలో తెలిపారు. తొలివిడతలో భాగంగా భారత సైన్యంలో ఖాళీగా ఉన్నటువంటి 57 వేల ఆఫీసర్ స్థాయి నుంచి కింది స్థాయి వరకు పోస్టులను భర్తీ చేయనుంది. ఈ పోస్టులన్నీ విడతల వారీగా రక్షణ శాఖ భర్తీ చేస్తుందన్నారు. యుద్ధ సన్నద్ధతను మరింత వేగవంతం చేసేందుకు ఈ పోస్టుల భర్తీ తప్పనిసరి అంటూ కేంద్ర మంత్రివర్గం అభిప్రాయపడిన విషయాన్ని రక్షణ శాఖ పేర్కొంది. వైమానిక దళంలోనూ నూతన సిబ్బందిని నియమించనున్నారు. ఎయిర్‌ఫోర్స్‌కు మద్దతుగా ఎయిర్ సపోర్టు సిగ్నల్ రెజిమెంట్, ఎయిర్ ఫార్మేషన్ సిగ్నల్ రెజిమెంట్, మిశ్రమ సంకేత రెజిమెంట్ల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. వాటితోపాటు క్రాప్ ఆపరేటింగ్, ఇంజినీరింగ్ సిగ్నల్ రెజిమెంట్ల విలీనం వంటి అంశాలపై కూడా సానుకూలంగా చర్చించినట్లు ప్రకటనలో వెల్లడించారు. భారత సైన్యం మరమ్మతుల విభాగాలను కూడా బలోపేతం చేసేందుకు బేస్ వర్క్‌షాప్‌లు, అడ్వాన్స్ బేస్ వర్క్‌షాపులు, స్టాటిక్ వర్క్‌షాప్‌లను అభివృద్ధి చేస్తామని తెలిపింది. ఆయుధ గిడ్డంగుల నుంచి వాహన డిపోల వరకు సిబ్బంది నియామకాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఉద్రిక్తతలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో సైనిక సంస్థల వద్ద తపాలా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. ఎన్‌సీసీ వ్యవస్థను పటిష్ట పరిచాలని అభిప్రాయపడింది. కాగా, లెఫ్టినెంట్ షేకాత్కార్ కమిటీ 2016 డిసెంబర్‌లో తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వానికి షేకాత్కార్ కమిటీ 99 సూచనలు చేసింది. అయితే, కేంద్ర రక్షణ శాఖ అందులోని 65 సూచనలకు మాత్రమే ఆమోద ముద్ర వేశారు. మిగతా సూచనల సాధ్యాసాధ్యాలను పరిశీలించి అమలు చేస్తామన్నారు. 2019 డిసెంబర్ 31 నాటికి ఇవి అమలు జరుగుతాయని అరుణ్ జైట్లీ ఆ ప్రకటనలో తెలిపారు.







వరద (వాణిజ్య) రాజధాని

- భారీ వర్షంతో ముంబై కకావికలం ● నగరం జలదిగ్బంధనం
- వీధుల్లోనే నిలిచిన నీరు ● ముమ్మరంగా సహాయక చర్యలు ● రంగంలోకి నేవీ
- కమ్యూనిటీ కిచెన్లతో ఆహార పంపిణీ ● పరిస్థితి చేదాటిపోలేదన్న బీఎంసీ ● 2005 చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న ప్రజలు

ముంబై: భారీ వర్షాలతో ముంబై నగరం అతలాకుతమైంది. రోడ్లన్నీ జలమయమై...వీధులు చెరువులను తలపిస్తుండటంతో నగరమంతా జలదిగ్బంధనమైంది.. భారీ వర్షాల కారణంగా వాణిజ్య కేంద్రాలకు అప్రటిత సెలవు ప్రకటించడంతో వాణిజ్య రాజధాని కాస్త వరద రాజధానిగా మారిపోయింది.





ఐదుగురు మృతి, వందలాదిమంది నిరాశ్రయులు

ముంబైలో ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షం కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. వందలాది మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైనట్లు గ్రేటర్ ముంబై విపత్తు నిర్వహణ సెల్ ప్రకటించింది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ముంబైలోని జనకళ్యాణ్ నగర్‌లో గోడకూలి రెండేళ్ల చిన్నారికళ్యాణి ప్రాణాలు కోల్పోయింది. ఈఘటనలో పాప తల్లిదండ్రులు గోపాల్,ఛాయ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విక్రోలీ సూర్యానగర్ లోఓ ఇళ్లు కూలడంతో ఇద్దరు మృతిచెందారు. రాజావాడీ ఆస్పత్రిలో చేరిన 18 నెలల నికిల్ సత్యేంద్ర, 40 ఏళ్ల సురేష్ మౌర్య చికిత్స పొందుతూ కన్నుమూశారు. గడ్కోపర్‌లోని అంబేద్కర్ నగర్ లో ఇళ్లు కూలి రామేశ్వర్ తివారి(45) మృతి చెందగా అతని భార్య మంజూ వారిద్దరి పిల్లలు కృష్ణ రోనక్ గాయపడ్డారు. వర్షాల్లో చిక్కుకుని చాలామంది తప్పిపోయినట్లు మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. చాలామంది తమ కుటుంబ సభ్యులు కనిపించడం లేదని సోషల్ మీడియాలో వారి ఫోటోలు కూడా పోస్ట్ చేశారు. రానున్న 48 గంటల్లో మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారతవాతావరణ శాఖ తెలిపింది. మహారాష్ట్రలోని పలు ప్రాంతాలతో పాటు గోవా, గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖతెలిపింది.

కమ్యూనిటీ కిచెన్లు, ఆహార పంపిణీ కేంద్రాలు ప్రారంభించిన నేవీ

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో నిరాశ్రయులైన ముంబై ప్రజలకు నావీకాదళం చేయూత నిస్తోంది. ఎక్కువగా వర్షాలు కురిగిన ప్రాంతాల్లో కమ్యూనిటీ కిచెన్లు, ఆహార పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రజలను ఆకలిబాధనుంచి విముక్తి చేసేందుకు నేవీ సిబ్బంది ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. చర్జిగేట్, బైకుల్లా, పారెల్, సీఎస్టీ ,వోర్లీ, టార్డెవో, ముంబైసెంట్రల్, దాదర్, మన్కుర్డ్, చెంబుర్, మలాడ్, ఘట్కోపర్ ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం అందిస్తున్నట్లు నేవీ అధికారులు పేర్కొన్నారు. వరదనీటిలో చిక్కుకున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు హెలికాప్టర్లు వినియోగి స్తున్నట్లు వివరించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేం దుకు రెస్క్యూ టీం పనిచేస్తోందని వెల్లడించారు.

ప్రాణాలను కాపాడుకునేందుకు గేదెలపై వెళ్లారు: నేవీ అధికారి

ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలు గత చేదు జ్ఞాపకాలను గుర్తుకుతెస్తున్నాయి. 2005 జులై 26న ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం మిగిల్చిన విషాదాన్ని ఓ నేవీ అధికారి గుర్తు చేసుకున్నారు. 2005లో కురిసిన భారీ వర్షాలతో దాదాపు 500 మంది ప్రాణాలు కోల్పోగా...వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఒక్కరోజే 94 సెంటీమీటర్ల వర్షం కురవడంతో ముంబై నగరం నదిని తలపించిందని గుర్తు చేశారు. తాను విధులు నిర్వహించే ప్రాంతం నుంచి ఇంటికి వెళ్లేందుకు మూడు రోజులు పట్టిందని చెప్పారు. చెరువులను తలపించేరోడ్లపై నడుస్తూ వెళ్తుంటే..మనసును కలచివేసే ఎన్నో దృశ్యాలు ఇప్పటికే తనకళ్లముందే కదలాడుతున్నారన్నారు. తాను వెళ్తున్న దారిలో నీటిపైతేలుతున్న మృతదేహాలు ఓవైపు...ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గేదెలపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వారొకవైపు కనిపించారని తెలిపారు. ఒక్కరోజు వర్షంతోనే ముంబై నగరం అతలాకుతలమైమైందని వెల్లడించారు. 2005 జులై 26న ఉదయం నవీ ముంబయి నుంచి అధికారిక పనుల కోసం థానే వెళ్లి మధ్యాహ్నం వరకు పని ముగించుకుని ఇంటికి వెళ్దామని సిద్ధమవగా కురిసిన భారీ వర్షం...రెండున్నర గంటల ప్రయాణాన్ని రెండున్నర రోజులు చేసిందని చెప్పారు. ఇంటికి ఫోన్ చేద్దామన్న ఫోన్ పనిచేయకపోవడంతో రాత్రుల్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపైనే తలదాచుకోవాల్సి వచ్చిందని తెలిపారు.

ముంబై నగర వాసులకు అన్నదాతలుగా గుర్తొచ్చే డబ్బావాలా భారీ వర్షం కారణంగా తన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. మంగళవారం ఉద్యోగులకు అందించిన లంచ్ బాక్స్‌లు తిరిగి సేకరించకపోవడంతో బుధవారం తమ సర్వీసులను కొనసాగించలేకపోయామని డబ్బావాలా ప్రతినిధులు తెలిపారు.

బీఎంసీకి శివసేన కితాబు

భారీ వర్షం ముంబై నగరం మునిగిపోయిన సమయం శివసేన చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బృహన్ ముంబై మున్సిపల్ కార్పోరేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించింది. పరిస్థితి చేయిదాటిపోకుండా బీఎంసీ చేపడుతున్న చర్యలు బాగున్నాయనిపేర్కొంది. ప్రకృత్తి విపత్తులు సంభవించినప్పుడు బీఎంసీ చాకచక్యంగా వ్యవహరిస్తోందని కితాబిచ్చింది. ఇంత భారీ వర్షం కురిసినప్పటికీ ఎలాంటి దురదుష్టకరమైన సంఘటనలు చోటుచేకోకుండా బీఎంసీ చర్యలు చేపట్టిందని సేన అధికార పత్రిక సామ్నాలో వ్యాఖ్యానించింది.

పరిస్థితి అదుపులోనే ఉంది: బీఎంసీ

మంగళవారం కురిసిన భారీ వర్షంతో ముంబై నగరంలోని పలు ప్రాంతాలు జలమయమైనప్పటికీ పరిస్థితి అదుపులోనే ఉందని బ్రిహన్ ముంబై మున్సిపల్ కార్పోరేషన్ తెలిపింది. భారీ వర్షంతో వేలాదిమంది రైల్వే స్టేషన్లు, ఆఫీసుల్లోనే నిలిచిపోయినప్పటికీ వారందరూ సురక్షితంగా ఇళ్లుకు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని పేర్కొంది. 30 సెంటీమీటర్ల వర్షం కురిసినప్పటికీ...మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఎలాంటి విషాద ఘటనలు చోటుచేసుకోలేదని బీఎంసీ కమిషనర్ అజోయ్ మెహతా తెలిపారు. మున్సిపల్ కార్పోరేషన్‌కు చెందిన 30వేల మంది ఉద్యోగులు వీధుల్లో నిలిచిన నీటిని తొలగించి.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

రైలులోనే 12 గంటలు గడిపిన గర్భిణి

గర్భిణి స్త్రీలు ఎక్కువ సేపు ప్రయాణాలు చేయరాదని వైద్యులు సూచిస్తుంటారు. చాలామంది వైద్యుల సూచనల ప్రకారం లాంగ్ జర్నీలకు దూరంగా ఉంటారు. కానీ ముంబైకి చెందిన ఓ జర్నలిస్ట్ ఏడు నెలల గర్భిణి గా ఉన్నప్పుడు 12 గంటలపాటు రైలులోనే గడిపారట. 2005 జులై 26న కురిగిన భారీ వర్షం ఆమెను 12 గంటలు రైల్లోనే ఉంచేలా చేసింది. తన గమ్యస్థానానికి గంటలోపే చేకుంటానని ముంబైలోని సబర్బన్ రైలు ఎక్కిన ఆమెకు ట్రైన్‌లోనే సగంరోజు గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందట. 12 ఏళ్ల క్రితం...12 గంటలపాటు రైళ్లలో గడిపిన పరిస్థితిని ఊర్మిల ట్విట్టర్ ద్వారా గుర్తుచేసుకుంది. అదృష్టవశాత్తు తనకు దివ్యాంగుల బెర్తు దొరకడంతో ఎక్కువ ఇబ్బందిపడకుండా రెస్ట్ తీసుకోగలిగానని పేర్కొంది.

12 రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు:ఐఎండీ

రానున్న 72 గంటల్లో దేశంలోని 12 రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర,గుజరాత్, గోవా,కర్నాటక, రాజస్థాన్,చత్తీస్ గఢ్, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, డామన్ డయ్యూ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.ఇప్పటికే అస్సాం, బీహార్ రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తుండగా..తాజాగా ముంబైలో కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. సోమవారం నుంచి మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్,గుజరాత్ రాష్ట్రాల్లో భారీవర్షాలు కురుస్తుండగా...రానున్న రెండు,మూడు రోజుల్లో మరిన్నివర్షాలు కురివొచ్చని ఐఎండీ తెలిపింది.

పెద్దల సభకు
సీఎం యోగి

న్యూఢిల్లీ , ఆంధ్రప్రభ : ఐదుసార్లు లోక్‌సభ ఎంపీగా విజయం సాధించిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్ పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. గత మార్చిలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన యోగి ఆదిత్యనాథ్ ఆరునెలల్లో రాష్ట్ర చట్టసభల నుంచి ఎన్నిక కావాల్సి ఉంది. గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానానికి ఆయన ఇప్పటికే రాజీనామా చేశారు.

ఈ నేపథ్యంలో బీజేపీ ఆయనకు శాసనమండలి నుంచి బరిలోకి దింపింది. యోగి ఆదిత్యనాథ్‌తో పాటు డిప్యూటీ సీఎంలు కేశవ్‌ప్రసాద్ మౌర్య, దినేశ్ శర్మ మరో ఇద్దరు మంత్రులను శాసనమండలికి పంపాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ యూపీ శాసన మండలి బీజేపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. యోగి ఆదిత్యనాథ్, కేశవ్‌ప్రసాద్ మౌర్య, దినేశ్ వర్మ, స్వతంత్రదేవ్ సింగ్, మొహసిన్ రాజా శాసన మండలి బరిలోకి దిగనున్నారు. అసెంబ్లీలో భారీ మెజార్టీ ఉండడంతో వీరి గెలుపు లాంచనమే కానుంది. గతంలో యూపీ సీఎంలుగా పనిచేసిన అఖిలేష్ యాదవ్, మాయవతి సైతం శాసనమండలి సభ్యులుగా పనిచేశారు. శాసనమండలిలోనూ బీజేపీ బలం పెంచుకునేందుకు యోగి ఆదిత్యనాథ్ సహా కీలక మంత్రులందరూ పెద్దల సభలోకి రావాలని నిర్ణయం తీసుకున్నారు.

పంజాబ్.. హర్యానాల్లో తగ్గిన అల్లర్లు

- గుర్మీత్ అరెస్ట్ తర్వాత శాంతియుత వాతావరణం ● దుకాణాలు, విద్యా సంస్థల నిర్వహణ ● బాబా వారసుడిపై మొదలైన చర్చ ● కుమారుడు చరణ్‌ప్రీత్ అంటూ ఊహాగానాలు ● బయటపడిన డేరా చీఫ్ భూ అక్రమాలు
- అల్లర్లకు సరైన టైమ్‌లో స్పందించా... రాజీనామాకు ఖట్టర్ నో!

చండీగఢ్-న్యూ ఢిల్లీ: అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌదా అధినేత బాబా రామ్‌రహీమ్ గుర్మీత్ జైలు పాలవడంతో చెలరేగిన అల్లర్లు తగ్గుముఖం పట్టాయి. రెండు రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాల్లో బుధవారం శాంతియుత వాతావరణం నెలకొంది. ఈ విషయాన్ని స్థానిక పోలీసు అధికారులు వెల్లడించారు. దుకాణాలు, విద్యా సంస్థలు కార్యకలాపాలను ప్రారంభించాయి. రవాణా వాహనాలు రాకపోకలు కూడా మొదలయ్యాయి. సున్నితమైన ప్రాంతాల్లోబందోబస్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు. బాబా అరెస్టు సమయంలో అల్లర్లు చెలరేగకుండా అంబాలా, కురుక్షేత్ర, ఖతల్, జింద్, హిస్సార్, ఫతేహ్‌బాద్, సిర్సా తదితర ప్రాంతాల్లో నిలిపి వేసిన అంతర్జాల సేవలను కూడా ప్రారంభించినట్లు ప్రకటించారు. గుర్మీత్‌కు సీబీఐ న్యాయస్థానం ఖరారు చేసిన తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోలేదన్నారు. సిర్సా నగరానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చేందుకు రవాణా సౌకర్యాలను పూర్తిగా నిలిపివేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కృష్ణలాల్ పన్వార్ వెల్లడించారు. హర్యానాలోని సిర్సాలో గల డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కర్ఫ్యూ అమలులో ఉందని తెలిపారు. పారా మిలటరీ బలగాలు, స్థానిక పోలీసుల సాయంతో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు సిర్సా డిప్యూటీ కమిషనర్ ప్రబజ్యోత్ సింగ్ పేర్కొన్నారు. కాగా, స్థానిక అధికార యంత్రాంగం సుమారు 650 మంది 18 సంవత్సరాల యువతులను వారి సొంత ప్రాంతాల్లోసాగనంపినట్లు వెల్లడించారు.

ఆశ్రమ వారసుడిపై జోరుగా ఊహాగానాలు

డేరా సచ్చా సౌదా గుర్మీత్ బాబా రేప్ కేసులో దోషిగా తేలడంతో బాబా వారసుడెవ్వరన్న చర్చ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. డేరా అధిపతి ఎవరన్నదానిపై ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. గుర్మీత్ తనయుడు జస్మీత్, ఆయన దత్త కుమార్తె అయిన హనీప్రీత్, డేరా ఛైర్‌పర్సన్‌గా ఉన్నటువంటి విపాసనా ఇన్సాన్‌ల పేర్లు ప్రధానంగా తెరపైకి వస్తున్నాయి. దీంతో, ఈ అంశం సిర్సాతో పాటు గుర్మీత్ వ్యాపార ప్రభావిత ప్రాంతాల్లో కూడా ఆసక్తి రేకెత్తిస్తున్నది. ఆశ్రమ వారసుడిగా గుర్మీత్ కుటుంబ సభ్యులే కావాలన్న ప్రత్యేక నిబంధన ఏమి లేదని మరికొందరు చెబుతున్నారు. ఆయన రక్త సంబంధీకులు కానీ వారు కూడా డేరా సంస్థలకు ప్రాతినిధ్యం వహించవచ్చని చెప్పుకొస్తున్నారు. ఇటీవల జరిగిన డేరా బాబాల సదస్సు తీర్మానం కూడా ఇదే విషయాన్ని ఉద్బోధిస్తుందని వెల్లడించారు.

గుర్మీత్‌కు కీలక అనుచరురాలుగా ఉన్నటువంటి హనీప్రీత్ సింగ్ అధిపతి అయ్యే అవకాశం ఉందని ఆశ్రమానికి చెందిన మరికొన్నివర్గాలు వెల్లడిస్తున్నాయి. నటిగా, ఎడిటర్‌గా ఆమె సామాజిక మాధ్యమంలో వెల్లడించిన హనీప్రీత్ బాబాకు దత్త పుత్రికగా పేరొందిన విషయం తెలిసిందే. ఇక డేరా సంస్థలకు ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న విపాసనా ఇన్సాన్ పేరు కూడా తీవ్రంగా చర్చనీయాంశమవుతుంది.



ప్రతిపక్షాల ఆరోపణలతో రాజీనామా చేయను: మనోహర్‌లాల్ ఖట్టర్

సిర్సాలో చెలరేగిన అల్లర్లకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలపై హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఘాటుగా స్పందించారు. సరైన సమయంలో తమ ప్రభుత్వం స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసు కువచ్చిందని సమర్థించుకున్నారు. న్యాయస్థానం ఆదేశాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని వివరించారు.

ప్రధాని ఊసెత్తలేదు: హర్యానా హైకోర్టు వెల్లడి

చండీగఢ్: సచ్చా డేరా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను దోషిగా తేల్చిన తీర్పులో ప్రధానమంత్రి మోడీ గురించి ఏమీ ఉటంకించలేదని పంజాబ్, హర్యానా హైకోర్టు వివరణ ఇచ్చింది. ఆ వ్యాఖ్యలు విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలే తప్ప తీర్పులో అది భాగం కాదని పేర్కొంది. మీడియా దాన్ని తప్పుగా అన్వయించిందని వెల్లడించింది. జాతీయ సమగ్రత, శాంతిభద్రతలు అన్నింటికీ అతీతమైనవని ఆరోజు హైకోర్టు జడ్జీలు వ్యాఖ్యానించారు. మనదంతా ఒకే జాతి. ఒకే పార్టీకి చెందిన జాతి కాదు. జాతి ఒక్కటేనని రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలి. ప్రధానమంత్రి అంటే దేశానికి ప్రధాని అని అర్థం. అంతేగాని బీజేపీకి ప్రధాని అని కాదు. అలాగే ముఖ్యమంత్రి ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి. అంతే తప్ప బీజేపీకి కాదు...అని జడ్జీలు పేర్కొన్నారు. ఇదంతా పరిశీలనాత్మక వ్యాఖ్యలు తప్ప తీర్పులో భాగం కాదన్నది హైకోర్టు అభిప్రాయం. అయితే ఆ నాటి విచారణలో పాల్గొన్న సీనియర్ లాయర్ అనుపమ్ గుప్తా మాత్రం..జడ్జీలు చాలా జాగ్రత్తగా ఆచితూచి ఈ వ్యాఖ్యలు చేశారని, ప్రధానమంత్రి అనే పదాన్ని ఒకసారి కన్నా ఎక్కువసార్లే ప్రస్తావించారని తెలిపారు. తమ వ్యాఖ్యల్ని తప్పుగా ప్రచురించొద్దని, ఉత్తర్వులో ఇచ్చిన అంశాన్నే రిపోర్టు చేయాలని..మిగతా తాము ఏమి మాట్లాడినా అదంతా తమ అబ్జర్వేషన్‌గానే భావించాలని జడ్జీలు తెలిపారు. భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్ సత్యపాల్ జైన్ ఆ విచారణలో కేంద్రం తరపున వాదించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ప్రధానమంత్రికి వ్యతిరేకంగా తామొక్క మాట కూడా మాట్లాడలేదని బెంచ్ తమకు తెలిపినట్టు చెప్పారు. తమ మాటల్ని వక్రీకరించారని కూడా బెంచ్ వెల్లడించిందన్నారు. అది విచారణ సందర్భంగా జరిగిన చర్చ.

బలపరీక్షకు గవర్నర్ 'నో'

- బలపరీక్షకు నో చెప్పిన విద్యాసాగర్ రావు ● దినకరన్, ప్రతిపక్షాలకు షాక్
- తమిళనాడు ప్రభుత్వానికి ఉపశమనం ● గవర్నర్ నిర్ణయంపై డీఎంకే అసహనం



చెన్నై: తమిళనాడు అధికారపార్టీ అన్నాడీఎంకేలో చెలరే గిన వర్గపోరు ప్రకంపణలు రేపుతూనే ఉంది. ముఖ్య మంత్రి పళనిసామిని సీఎం పీఠం నుంచి దించేందుకు అన్నాడీఎంకేలోని శశికళవర్గం, ప్రతిపక్షాలు ఏకమ వడంతో రాజకీయం మరింత రక్తికట్టింది. అయితే అమ్మ పార్టీలోని అసమ్మతి ఎమ్మెల్యేల ఆశలపై తమిళనాడు గవ ర్నర్ విద్యాసాగర్ రావు నీళ్లు జల్లారు. ప్రభుత్వంపై బలపరీక్షకు అనుమతించాలని ప్రతిపక్షాలు గవర్నర్‌కు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఆయన కీలక నిర్ణయం తీసుకు న్నారు.సీఎంతో విబేధించిన 20 మంది ఎమ్మెల్యేలు ఇంకా అన్నాడీఎంకేలోనే ఉన్నందున ప్రభు త్వంపై బల పరీక్షకు అనుమతించబోనని తెగేసి చెప్పేశారు. గవర్నర్ తాజా నిర్ణయంతో ఇటు దిన కరన్ వర్గం అటు ప్రతిపక్ష డీఎంకే,కాంగ్రెస్ వర్గాలకు ఝలక్ ఇచ్చినట్లైంది. ప్రభు త్వంపై యుద్ధం ప్రకటించినట్లుగా దినకరన్ రోజుకో ముఖ్యనేతను అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి పదవుల నుంచి తొలగించిన తర్వాత గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం పళనిసామికి కలిసొచ్చింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ పళని ప్రభుత్వానికి సహాయసహకారాలు అందిస్తున్న నేపథ్యంలో గవర్నర్ నిర్ణయంలోనూ కేంద్రం పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గవర్నర్ పక్షపాతం సరికాదు: స్టాలిన్

ప్రజలు పళని ప్రభుత్వంపై నమ్మకంకోల్పోయారని గవర్నర్‌ను కలిస్తే ఆయన ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని డీఎంకే నాయకుడు స్టాలిన్ ఆరోపించారు. అన్నాడీఎంకేలోని 20 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై బలపరీక్షకు డిమాండ్ చేస్తున్నప్పటికీ గవర్నర్ విద్యాసాగర్ రావు సరైన రీతిలో స్పందించకపోవడంపై అస హనం వ్యక్తం చేశారు. బంతిమీ కోర్టులో ఉన్నందున సీఎం మెజారిటీ నిరూపిం చుకోవాలని గవర్నర్‌ను కోరినా...ఆయన స్పందించకలేదని డీఎంకేనేతలు ఆరోపిం చారు. బంతి ఇంకా తనకోర్టుకు రాలేదని... అన్నాడీఎంకే పార్టీ నేతల్లో వచ్చిన విభేదాలు సమిసి పోయేలా ఉన్నాయని వ్యాఖ్యానించారని చెప్పారు. గవర్నర్ తీరుతో కేంద్రంలోని బీజేపీ వ్యూహం అర్థమైపోయిందని మండిపడ్డారు. గవ ర్నర్ కూడా ఏకపక్ష రాజకీయాలకు పాల్పడటం సరైంది కాదని స్టాలిన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లే గవర్న ర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. మరోవైపు తమిళ నాడులో ప్రభుత్వంపై బలపరీక్షకు అనుమ తించేలా గవర్నర్‌ను ఆదేశించాలని గురువారం రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌ను కలుస్తామని వామపక్షాలు,ముస్లింలీగ్ నేతలు తెలిపారు. అన్నాడీఎంకే పార్టీలో దినకరన్ దూకుడు నేపథ్యంలో తమిళనాడు మంత్రులు కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. తమ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను హోంమంత్రికి వివరిం చారు. తమిళనాడు రాజకీయాల్లో గవర్నర్ కలగజేసుకోరని హోంమంత్రి వారికి చెప్పినట్లు సమాచారం. అన్నాడీఎంకేలోని చీలిక వర్గం, ప్రతిపక్షాలు బలపరీక్షకు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సమస్యను అసెంబ్లీ స్పీకర్ పరిష్కరిస్తారని సలహా ఇచ్చారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో గవర్నర్ కలగజేసుకోరని తెలిపారు.

పళని దిగిరాకుంటే..సత్తాచూపిస్తాః దినకరన్

తమిళనాడు ముఖ్యమంత్రి వెనక్కితగ్గకుంటే తమ సత్తా చూపిస్తామని అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ దినకరన్ పళనిస్వామిని హెచ్చరిం చారు.అన్నాడీఎంకేలో తమ స్లీపర్ సెల్స్ ఉన్నారన్న దినకరన్ ...రోజురోజుకు పళనిపై అసమ్మతి పెరిగేలా చూస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పళనిని 21 మంది ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తూ తమతో చేయి కలిపారన్నారు. త్వరలోనే మరికొంత మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుని బలపరీక్షకు డిమాండ్ చేస్తారని పరోక్షంగా పళనిని హెచ్చరించారు.



పతంజలి నుంచి 'దివ్యజల్'

● దీపావళి నాటికి మార్కెట్‌కు ● పెప్సికో, కోకాకోలాకు గట్టిపోటీ

న్యూఢిల్లీ : యోగా గురు రాందేవ్‌బాబా పతంజలి ఆయుర్వేద దీపావళి నాటికి ప్యాకేజీ హిమాలయన్ డ్రింకింగ్ వాటర్ (మంచినీరు) మార్కెట్లో విడుదల చేయనుంది. కంపెనీకి చెందిన హరిద్వారా, లక్నో ప్లాంట్‌లలో బాట్లింగ్ మొదలుపెట్టబోతున్నామని రాందేవ్ అధికార ప్రతినిధి ఎస్‌కె తిజారావాల్ చెప్పారు. దివ్యజల్ దేశవ్యాప్తంగా వచ్చే 3 నుంచి 6 నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా రూ.1,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్యాకేజీ మంచినీటి మార్కెట్ రూ.7,040 కోట్లుగా ఉందని, వాటిలో బిస్లేరీ వాటా 24 శాతమని పేర్కొన్నారు. రాందేవ్ బాబాకు చెందిన దివ్యజల్ .. మార్కెట్లో పాతుకుపోయిన పెప్సీకో, కోకాకోలా, పార్లేకు చెందిన బిస్లేరీ, టాటాగ్లోబల్ బేవరేజస్‌కు గట్టి పోటీ ఇస్తుందనడంలో సందేహం లేదు. గత 2 సంవత్సరాల నుంచి పతంజలి ఆయుర్వేద ఆయుర్వేద పేరులో నిత్యావసర ఆహార పదార్థాల నుంచి బ్యూటీ కేర్, (సౌందర్యపోషణ) ఉత్పత్తుల వరకు మార్కెట్లో విడుదల చేసి పెద్ద పెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీలకు దడ పుట్టిస్తోంది. అలాగే రాందేవ్ బాబా రెస్టారెంట్ వ్యాపారంలో కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. మెక్‌డొనాల్డ్, కెంటకీ ఫ్రైడ్ చికెన్, సబ్‌వేలకు పోటీ ఇవ్వబోతున్నారు. అలాగే దుస్తుల రంగంలో కూడా వచ్చే ఏడాది ప్రవేశించబోతున్నారు. ప్రారంభంలో 250 పతంజలి స్టోర్‌లను ప్రారంభిస్తుంది. ఈ దుస్తులు బిగ్‌బజార్‌తో పాటు ప్రభుత్వరంగానికి చెందిన ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్‌లలో విక్రయిస్తుంది.





ఎయిర్‌ఇండియా కొనుగోలు

● రెండు సంస్థల ఆసక్తి : జైట్లీ

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం ఎయిర్‌ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఎయిర్‌ఇండియాలో వాటాలు కొనుగోలు చేయడానికి రెండు కంపెనీలు ఆసక్తిని కనబర్చాయని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చూచాయిగా చెప్పారు. జైట్లీ నేతృత్వంలో మంత్రుల బృందం భారీ నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్‌ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణకు ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలనే అంశంపై కసరత్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని జైట్లీ కూడా ధ్రువీకరించారు. కేంద్రకేబినెట్ గత జూన్‌లో ఎయిర్‌ఇండియాతో పాటు ఐదు అనుబంధ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించాలని సూత్రప్రాయంగా అంగీకరించింది. విమానయాన సర్వీసులు అందించే బర్డ్ గ్రూపు ఎయిర్‌ఇండియాకు చెందిన గ్రౌండ్ హ్యాడ్లింగ్ అనుబంధ సంస్థ ఏఐఏటీఎస్ఎల్ టేకోవర్ చేయడానికి ఆసక్తిని కనబరుస్తోందని పౌర విమానయాన కార్యదర్శి ఆర్ఎన్ చౌబే బుధవారం నాడు ఉదయం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఇండిగో కూడా ఎయిర్‌ఇండియా కొనుగోలు ఆసక్తిని కనబర్చిందని ఆయన అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎయిర్ ఇండియా భారీ నష్టాల్లో కూరుకుపోయింది. నీతిఆయోగ్ కూడా ఎయిర్ ఇండియాను పూర్తిగా ప్రైవటైజేషన్ చేయాలని సూచించింది. కాగా ఎయిర్ ఇండియా ఇప్పటికే రూ.52వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం 2012లో రూ.30వేల కోట్ల బెయిల్‌ఔట్ ప్యాకేజీతో రోజులు నెట్టుకొస్తోంది.

శ్రేయ లైఫ్ రష్యా వ్యాపారంపై

అరబిందో కన్ను

ముంబాయి: శ్రేయ లైఫ్ సైన్సెస్‌కు చెందిన రష్యా వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు అరబిందో ఫార్మా సంప్రదింపులు జరుపుతోంది. ఈ డీల్ విలువ 80 నుంచి 100 మిలియన్ డాలర్ల దాకా వుంటుందని భావిస్తున్నారు. ఈ సంప్రదింపుల గురించి తెలిసిన విశ్వసనీయ వర్గాలు పై వివరాలు తెలిపాయి. సంప్రదింపులు తుది దశకు చేరాయని, వ్యాల్యుయేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, శ్రేయ లైఫ్ సైన్సెస్ కొంత భాగాన్ని అట్టేపెట్టుకోవాలనుకుంటోందని,

AUROBINDO
Committed to healthier life!

గంపగుత్తగా విక్రయించాలనుకోవడం లేదని ఆ వర్గాలు వెల్లడించాయి. 2001లో ఏర్పడిన శ్రేయ లైఫ్ సైన్సెస్ ఔషధాలు తయారు చేసి, అంతర్జాతీయ మార్కెట్లో విక్రయిస్తోంది. 200లో రష్యాలో అడుగిడన ఈ సంస్థ ప్రస్తుతం 31 ఔషధాలదాకా అక్కడ విక్రయిస్తోంది. ఇందులో ప్రిస్క్రిప్షన్, ఓటిసి, జెనిరిక్ ఔషధాలున్నాయి. డిస్ట్రిబ్యూటర్ల ద్వారా 25 వేల రిటెయిల్ ఫార్మసీలకు, రష్యన్ ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థకూ కూడా శ్రేయా లైఫ్ సైన్సెస్ తన ఔషధాలను విక్రయిస్తోంది. ఇక రష్యాతోపాటు, అదే ప్రాంతంలోని మరికొన్ని దేశాలలోను, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా దేశాలలోనూ కూడా శ్రేయా లైఫ్ సైన్సెస్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ థెరాప్టిక్ విభాగాల కింద మొత్తం 200 ఔషధాలను సంస్థ ఉత్పత్తి చేస్తోంది. 2015-16 సంవత్సరానికి శ్రేయా లైఫ్ సైన్సెస్ అమ్మకాలు రూ.269 కోట్లకు చేరాయి. ఈ డీల్ గురించి అరబిందో పెదవి విప్పకపోగా, రష్యాలో మేము ఇప్పటిదాకా వినియోగించని, కొన్ని రిజిస్ట్రేషన్స్‌లో భాగస్వాముల కోసం ప్రయత్నిస్తున్నట్లు శ్రేయా లైఫ్ సైన్సెస్ అధికార ప్రతినిధి చెప్పారు. అయితే రుణం తగ్గించుకునే వ్యూహంలో భాగంగా అంతర్జాతీయంగా కొన్ని వ్యాపారాలను సంస్థ విక్రయించాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

కార్మిక సంస్కరణలతోనే వృద్ధికి ఊతం


న్యూఢిల్లీ: దేశంలో నలభైకి పైగా వున్న కార్మిక సంబంధ చట్టాలను 4గా కుదించడం ద్వారా సరళీకరించాలని, భారత్ లోని కార్మక సంబంధ చట్టాలు కొన్ని ప్రపంచంలోనే చాలా కఠినమైనవిగా వున్నాయని అరవింద్ పనగారియా చెప్పారు.

కేంద్ర కార్మిక చట్టలను సరళీకరించడం ద్వారా వ్యాపార నిర్వహణ సులభతరమవడమే కాకుండా, మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం సాధ్యమవుతుందని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా చెప్పారు. ప్రస్తుతం 40గా వున్న ఈ కార్మిక సంబంధ చట్టాలను నాలుగుగా కుదించడమే కాకుండా, కఠినంగా వున్న కొన్ని నిబంధనలను సరళీకరించడం ఆవశ్యకమని ఆయన అభిప్రాపడ్డారు. ఉద్యోగుల నియామకం, తొలగింపు విషయంలో ప్రపంచంలోనే కఠినమైన నిబంధనలు కొన్ని దేశంలో అమలవుతున్నాయని చెప్పారు. ఈ చట్టాలలో మార్పులను రాష్ట్రస్థాయిలో చేస్తే, ఆ రాష్ట్రా లలో మాత్రమే ప్రభావం వుంటుందని, కేంద్ర కార్మిక చట్టాలను సంస్కరించడం ద్వారా అయితే దేశమంతటికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్మిక చట్టాల సంస్కరణలలో వేగం పెరిగితే, అధికవృద్ధికి అవకాశం కలుగుతుందని, పెట్టుబడుల రాక పెరిగి, ఉపాధి అవకాశాలు అధికమవుతాయని పనగారియా వివరించారు.

కొనుగోళ్లతో కళకళ!

● 258 పాయింట్ల వృద్ధి ● నేటితో ఆగస్టు ఎఫ్అండ్ఓ ముగింపు

ముంబై : స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు తిరిగి కోలుకున్నాయి. ఉత్తర కొరియా జపాన్‌పై క్షిపణి దాడులతో తలెత్తిన ఉద్రిక్తతలు చల్లబడ్డాయి. దీంతో గ్లోబల్ మార్కెట్లు జోరందుకున్నాయి.



సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. బీఎస్ఈ 258.07 పాయింట్లు లాభపడి 31,646 వద్ద, ఎన్ఎస్ఈ 88.35 పాయింట్లు పుంజుకొని 9,884.40 వద్ద ముగిసింది. గురు వారంతో ఆగస్టు నెల ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ముగియనుండటంతో మదుపరులు షార్ట్‌కవరింగ్‌కు పాల్పడ్డారు. మదుపరులు ముఖ్యంగా లోహ, చమురు సహజ వాయువు, ఇంధనం, రియల్టీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, క్యాపిటల్‌గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు మదుపరులు పెద్దెత్తున కొనుగోలు చేశారు. పైన తెలిపిన షేర్లని మంగళవారం నష్టపోయాయి.

బీఎస్ఈలో లాభపడిన టాప్5 షేర్లు ఇలా ఉన్నాయి. అదనీ పోర్ట్స్ 1.94 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.83 శాతం, కోల్‌ఇండియా 1.39 శాతం, టాటాస్టీల్ 1.35 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా ఎంఅండ్ఎం 1.28 శాతం, పవర్‌గ్రిడ్ 0.35 శాతం, ఎన్‌టీపీసీ 0.3 శాతం, సిప్లా 0.19 శాతం, డాక్టర్ రెడ్డీస్ 0.16 శాతం వరకు నష్టపోయాయి.

స్టాక్ మార్కెట్లు పుంజుకోవడానికి మరో కారణం .. కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టి మొదటి నెలలోనే పన్ను రూపంలో ప్రభుత్వానికి రూ.92,283 కోట్ల రెవెన్యూను సంపాదించిపెట్టింది. ప్రభుత్వం లక్ష్యం కంటే ఇది చాలా చాలా ఎక్కువే. జీఎస్టి రిటర్న్స్ పూర్తియితే పన్ను వసూళ్లు మరింత పెరిగే అవకాశాలున్నాయి. స్టాక్ ఎక్స్చేంజీ గణాంకాల ప్రకారం విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు మంగళవారం నాడు రూ.1459.64 కోట్ల షేర్లు కొనుగోలు చేయగా.. దేశీయ సంస్థాగత మదుపరులు (బీఐఐ)లు రూ.1391 కోట్లు షేర్లు కొనుగోలు చేశారు.

రద్దయిన నోట్లలో 99%

ఆర్‌బీఐ గూటికి


● 1 శాతం=రూ.16వేల కోట్ల ఆదాయం ● ముద్రణకు 7వేల కోట్ల వ్యయం



ముంబై : రూ.500, రూ.1,000 కరెన్సీ నోట్ల చలామణి రద్దు తర్వాత.. రద్దు చేసిన 99 శాతం కరెన్సీ నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని రిజర్వుబ్యాంకు బుధవారం తెలియజేసింది. ఇప్పటి వరకు ప్రతిపక్షం పెద్ద నోట్ల రద్దు తర్వాత ఎంత మొత్తం కరెన్సీ తిరిగొచ్చిందని ప్రశ్నించడంతో రిజర్వుబ్యాంకు సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ గతేడాది నవంబర్ 8వ తేదీన నల్లధనం, అవినీతిని రూపుమాపడానికి రూ.500,రూ.1,000 నోట్లను రద్దు చేశారు. అయితే రిజర్వుబ్యాంకు 2016-17 వార్షిక నివేదికలో చలామణి నుంచి తప్పించిన పెద్దనోట్లలో రూ.15.28 కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయని తెలిపింది. కేవలం రూ.16,050 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది.

రద్దు చేసిన పెద్దనోట్లలో కేవలం 8.9 కోట్ల నోట్లు రూ.1,000 నోట్లు బ్యాంకుకు తిరిగి రాలేదని వివరించింది. రద్దు చేసిన నోట్లలో ఇది కేవలం 1.3 శాతమేనని సమర్థించుకుంది. అయితే రూ.500 నోట్లు ఎంత మొత్తం తిరిగి రాలేదో ప్రస్తావించలేదు.

నవంబర్ 8, 2016న మొత్తం 1,716.5 కోట్ల రూ.500 నోట్లు, 685.8 కోట్ల రూ.1,000 నోట్లు చలామణిలో ఉన్నాయి. ఇవన్నీ లెక్కిస్తే రూ.15.44 లక్షల కోట్లుగా తేలింది.



పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ గత సంవత్సరం రూ.500, రూ.2,000 నోట్లతో పాటు ఇతర డినామినేషన్ నోట్లను ముద్రించడానికి రూ.7,965 కోట్లు వ్యయం చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో వ్యయం చేసిన రూ.3,421 కోట్లతో పోల్చుకుంటే రెట్టింపు వ్యయం చేసింది.

ప్రభుత్వం నల్లధనం, అవినీతిని, నకిలి కరెన్సీకి అడ్డుకట్ట వేయడానికి పెద్దనోట్లను రద్దు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. నోట్ల రద్దును చాలా మంది స్వాగతించారు కూడా. అయితే ఆర్‌బీఐ చెప్పిందేమిటంటే పది లక్షల నోట్లు చలామణి అయితే కేవలం 7.1 నోట్లు మాత్రమే రూ.500 నకిలీ నోట్లు చలామణి అయ్యాయని.. అదే రూ.1,000 నోటు విషయానికి వస్తే ప్రతి పది లక్షల నోట్ల చలామణినికా గాను కేవలం 19.1 నోట్లు మాత్రమే నకిలీవని ఆర్‌బీఐ సాంపిల్ సర్వేలో తేలిందని వెల్లడించింది.

తాజాగా రిజర్వుబ్యాంకు వెల్లడించిన గణాంకాలపై ప్రతిపక్షం గరం గరం అయ్యింది. మాజీ ఆర్థికమంత్రి పీ చిదంబరం దీనిపై స్పందిస్తూ.. ఆర్‌బీఐ రూ.16,000 కోట్లు పెద్దనోట్ల రద్దుతో లాభపడితే రూ.21,000 కొత్త నోట్లుముద్రించి నష్టపోయిందని విమర్శించారు. పెద్దనోట్ల రద్దుకు సూచించిన ఆర్థికవేత్తకు నోబుల్ ప్రైజ్ ఇచ్చి సత్కరించాలని వ్యంగ్యంగా అన్నారు.

రద్దు చేసిన రూ.15,44,000 కోట్ల కరెన్సీలో రూ.16,000 కోట్లు వెనక్కి తిరిగిరాలేదు. దాని అర్థం ఏమిటంటే రద్దు చేసిన పాత నోట్లలో ఒక శాతం వెనక్కిరాలేదని.. పెద్దనోట్ల రద్దు సలహా ఇచ్చినందుకు ఆర్‌బీఐ సిగ్గుతో తలదించుకోవాలని ట్విట్ చేశారు. పెద్దనోట్ల రద్దు అనేది నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి ఈ పథకాన్ని తీసుకొచ్చారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

జూన్ 30, 2017 నాటికి స్పెసిఫైడ్ బ్యాంకు నోట్స్ (ఎస్‌బీఎన్)లు మొత్తం రూ.15.28 లక్షల కోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయని తెలిపింది. పెద్దనోట్లు రద్దు చేసిన తర్వాత ఆర్‌బీఐ రద్దు చేసిననోట్లను బ్యాంకులో డిపాజిట్ చేసుకోవడానికి కొంత గడువు ఇచ్చింది. అయితే ఈ డిపాజిట్లపై ఆదాయపు పన్ను శాఖ దృష్టి పెట్టడంతో కొంత డబ్బు బ్యాంకుకు రాకపోవచ్చుననే వాదన కూడా ఉంది. నోట్ల ముద్రణకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం నుంచి ఆర్‌బీఐ రాబట్టుకుంటుంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన డివిడెండ్‌లో సర్దుబాటు చేసుకుంటుంది. ఇదిలా ఉండగా 2016-17 ఆర్థికసంవత్సరంలో ఆర్‌బీఐ ఆదాయం 23.56 శాతం క్షీణించగా.. అదే సమయంలో వ్యయం మాత్రం 107.84 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ వద్ద అదనంగా రూ.306.59 కోట్లు మిగులుంటే అంతకు ముందు సంవత్సరం రూ.658.76 కోట్లు మిగులుండింది. సుమారు 53.46 శాతం క్షీణించింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రభుత్వం కొత్త రూ.500 నోటును తీసుకొస్తే రూ.1,000 నోటుకు ప్రత్యామ్నయం లేకుండా చేసింది. దానికి బదులుగా రూ.2,000 నోటును విడుదల చేసింది. మార్చి 31, 2017 నాటికి 588.2 కోట్ల రూ.500 పాత, కొత్త నోట్‌లు చలామణిలో ఉన్నాయని తెలిపింది. అదే మార్చి 31, 2016 నాటికి రూ.500 నోట్లు మొత్తం 1507 నోట్లు చలామణిలో ఉన్నాయని పేర్కొంది. మార్చి 31, 2017 నాటికి 328.5 కోట్ల కొత్త రూ.2,000 నోట్లు చలామణిలో ఉందని తెలిపింది. ప్రస్తుతం రూ.500, రూ.2,000, తాజా రూ.200 కొత్త నోటును చలామణిలోకి తెచ్చింది. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ ఆర్ గాంధీ మాట్లాడుతూ.. పెద్దనోట్ల రద్దు ప్రభావం దీర్ఘకాలంలో కనిపిస్తుందన్నారు. నోట్ల రద్దు తర్వాత రద్దైన నోట్లతో కొంత కరెన్సీ తిరిగి వచ్చే అవకాశాల్లేవన్నారు.

లగ్జరీ కార్ల ధరలకు రెక్కలు

● 15 నుంచి 25 శాతానికి సుంకం పెంపు ● ఆర్డనెన్స్ ద్వారా జీఎస్టికి సవరణ



న్యూఢిల్లీ : కేంద్ర కేబినెట్ బుధవారం నాడు ఆర్డినెన్స్ ద్వారా వస్తు సేవల పన్ను (జీఎస్టి)లో మధ్యరకం నుంచి పెద్ద కార్లు స్పోర్ట్‌యుటిలిటి కార్లపై 15 శాతం నుంచి 25 శాతం వరకు సుంకాన్ని పెంచుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ ఆర్డినెన్స్ సెప్టెంబర్ 9వ తేదీన హైదరాబాద్‌లో జరిగే జీఎస్టి కౌన్సిల్ సమావేశం ప్రస్తావనకు వస్తుంది. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎంత మొత్తం సుంకం పెంచాలో నిర్ణయం తీసుకుంటుంది.

జులై 1 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఎస్‌యువీలో పాటు పెద్ద కార్ల ధరలను రూ.1.1 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు కంపెనీలు తగ్గించాయి. దీంతో కార్ల అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి. తాజాగా కేంద్రకేబినెట్ లగ్జరీ కార్లపై సుంకం పెంచడంతో తిరిగి కార్ల ధరలు పెరుగుతాయి. కేబినెట్ సమావేశం తర్వాత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం గురించి వివరించారు. ఆర్డినెన్స్ ద్వారా జీఎస్టిలో పన్ను రేట్ల సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా కొన్ని మోటార్ వాహనాలపై సుంకాన్ని పెంచుకోడానికి వీలవుతుంది. వచ్చిన డబ్బును జీఎస్టి అమలు తర్వాత రాష్ట్రాలు కోల్పోతున్న రెవెన్యూ పరిహారంగా చెల్లించడానికి వీలవుతుందన్నారు.

కేంద్రప్రభుత్వం నిర్ణయంపై మెర్సిడెజ్ బెంజ్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ హడావుడిగా నిర్ణయం తీసుకునే బదులు జీఎస్టి అమల్లోకి వచ్చిన ఆరు నెలల తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటే బాగుండేదన్నారు. హడావుడిగా సుంకం పెంచాలని నిర్ణయం తీసుకోడం తమకు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా కు చెందిన పవన్ గోయెంకా మాట్లాడుతూ.. అనుకున్న విధంగానే సుంకం పెంచారని అన్నారు.

ప్రస్తుతం ఆటో రంగం సంక్షోభంలో ఉన్న ప్పుడు పెంచడం భావ్యంగా లేదని, ఎంత మొత్తం ఎందుకు పెంచాల్సి వస్తుందో ప్రభుత్వం వివరించి ఉంటే బాగుండేదన్నారు. ఇప్పటికే ఆటో రంగం ప్రభుత్వానికి కొన్ని వినతి పత్రాలు అందించిందని, దానిపై తుది నిర్ణయం తీసుకోకుండా నిర్ణయం తీసుకున్నారు. సుంకం పెంచి ఆటో రంగానికి ఆందోళన కలిగిస్తున్నారని ఆయన వాపోయారు.



100 జీప్ కంపాస్ డెలివరీ

హైదరాబాద్ : ఫ్రైడ్‌మోటార్స్ హైదరాబాద్ జీప్ కంపాస్ 100, వాహనాన్ని బుధవారం డెలివరీ ఇచ్చింది. ఫ్రైడ్ మోటార్స్‌కు చెందిన సురేశ్, హైదరాబాద్‌కు చెందిన ఈ ప్రదీప్‌కుమార్, డి దేవేందర్‌రావుకు వాహనాలను అందజేశారు. అమెరికాకు చెందిన జీప్ దేశంలోనే ఉత్పత్తి ప్రారంభించింది.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వండి

● పేపర్ టెక్, గ్రీన్ షుగర్ సమ్మిట్‌లో ఐపిఎంఎ ఉపాధ్యక్షుడు మెహతా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాంకేతిక పరిజ్ఞానం మరింతగా విస్తరించిన తరుణంలో పర్యావరణం పరిరక్షణను పరిగణలోకి తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ కాగిత ఉత్పత్తిదారుల సంఘం (ఐపిఎంఎ) ఉపాధ్యక్షుడు ఎఎస్ మెహతా అన్నారు. దేశంలోని పల్ప్ అండ్ పేపరు రంగంలో నూతన ప్రక్రియలు ఆవిష్కరించి కాగిత ఉత్పత్తులు సాధిస్తున్నారని, అదే స్థాయిలో పర్యావరణానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు. కాగిత పరిశ్రమకు అవసరమైన చెట్లు నరకడమే కాకుండా చెట్లు పెంచుతూ పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యత పోషిస్తోందని ఆయన అన్నారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) నిర్వహిస్తున్న పేపరు టెక్ - గ్రీన్ షుగర్ సమ్మిట్ 2017 సదస్సులో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెహతా మాట్లాడుతూ, దేశంలో హరితవనాల ప్రాధాన్యత ఎంతో ఉందని, పర్యావరణ నిబంధనలు పాటించేందుకు కాగిత పరిశ్రమ ఉత్పత్తిదారులు తగిన విధానాలు అమలు చేయాలని సూచించారు. చెట్లతో పాటు నీరు, ఇంధన వినియోగాన్ని కూడా పొదుపు చేయాలని, ఇందుకోసం సామర్థ్యం కలిగిన యంత్రాలు వినియోగించాలని మెహతా సూచించారు. దేశంలో పేపరు పరిశ్రమ ఎంతో విస్తరించినప్పటికీ అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తులు సాధించలేకపోతున్నామన్నారు.

రూ.350 తగ్గిన పసిడి ధర

● గ్లోబల్, దేశీయ మార్కెట్లో డిమాండ్ కరవు



న్యూఢిల్లీ : బులియన్ మార్కెట్లో బుధవారం నాడు పసిడి ధర పది గ్రాములు ఏకంగా రూ.350 తగ్గి రూ.30,100 మార్కుకు దిగివచ్చాయి. కాగా మంగళవారం నాడు బంగారం ధరలు భారీగా పెరిగాయి. గ్లోబల్ మార్కెట్లతో పాటు స్థానికనగల వ్యాపారుల నుంచి కొనుగోళ్ల డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గాయని స్థానిక వర్తకులు చెబుతున్నారు. వెండి కూడా కిలో రూ.41వేల మార్కుకు దిగివచ్చింది. కిలో ఏకంగా రూ.500 తగ్గి రూ.40,600 పడిపోయింది. స్థానిక పారిశ్రామియ యూనిట్లతో పాటు వెండి నాణెల తయారీ కంపెనీలు కొనుగోళ్లకు దూరంగా ఉండటమే దీనికి కారణం. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే పసిడి ధర మంగళవారం ఔన్స్ 0.07 శాతం క్షీణించి 1308.60 డాలర్లకు దిగిరాగా.. వెండి 0.43 శాతం తగ్గి న్యూయార్కులో 17.35 డాలర్లు పలికింది. దేశ రాజధానిలో 99.9 శాతం, 99.5 శాతం మేలిమి బంగారం పది గ్రాములు రూ.350 వరకు తగ్గి రూ.30,100, రూ.29,950కి దిగివచ్చాయి. కాగా మంగళవారం పది గ్రాములు బంగారం ఏకంగా రూ.550 పెరిగింది.

పెట్రోల్, డీజెల్‌పై పన్ను తగ్గించం



ధర్మేంద్రప్రధాన్

న్యూఢిల్లీ : పెట్రోల్, డిజెల్‌పై పన్నులు తగ్గించే ప్రసక్తిలేదని చమురుశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ బుధవారం నాడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో జులై నుంచి పెట్రోల్ ధర రూ.6పైనే పెరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన చమురు కంపెనీలు గత 15 ఏళ్ల నుంచి అనుసరిస్తున్న పక్షం రోజులకు ఒకసారి ధరలను సవరించే పద్ధతికి స్వస్తిపలికి రోజు వారి ధరలు సవరించడం మొదలుపెట్టింది. రోజు వారి ధరలను సవరించిన తర్వాత పక్షం రోజులపాటు ధరలు తగ్గముఖం పట్టినా, అటు తర్వాత అంటే జులై 3 నుంచి ధరలు పెరగడమే తప్ప దిగిరావడం లేదు. ప్రస్తుతం ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.6.08పైసలు పెరిగి రూ.69.12 పలుకుతోంది. చివరగా ఈ ధర ఆగస్టు 2014 స్థాయికి వచ్చింది. డిజెల్ విషయానికి వస్తే రూ.3.65 పైసలు పెరిగి రూ.57.01కి విక్రయిస్తున్నారు. ధరల సవరింపు అనేది పారదర్శకంగా జరుగుతోందని ఒక్కో నగరంలో ఎంతో ధర పలుకుతుందో ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకోవచ్చునని ప్రధాన్ అన్నారు. రోజువారి ధర సవరింపు అనేది ప్రస్తుతం మార్కెట్ ఎలా ఉందో సూచిస్తుందని, ప్రస్తుతానికి అత్యుత్తమ పద్ధతి ఇదేనని ఆయన రోజు వారి రేట్ల సవరింపును సమర్థించారు. పెట్రోల్, డిజెల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించే అవకాశం ఏమైనా ఉందా అని ప్రశ్నించగా.. ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పరిస్థితిని బట్టి ఆలోచిద్దామన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నవంబర్ 2015, జనవరి 2016లో పెట్రోల్, డిజెల్‌పై ఐదు రెట్లు ఎక్సైజ్ సుంకం పెంచేశాయి. ఎక్సైజ్ సుంకం పెట్రోల్‌పై లీటరుకు రూ.4.02, డిజిల్‌పై రూ.6.97 పెంచాయి. అంతకు ముందు ప్రభుత్వం నాలుగు వాయిదాల్లో ఎక్సైజ్ సుంకం పెట్రోల్, డిజెల్‌పై నవంబర్ 2014 నుంచి జనవరి 2015 వరకు పెంచాయి. నాలుగవసారి ఎక్సైజ్ సుంకం లీటరుకు రూ.7.75, డిజిల్ రూ.6.50 పెంచాయి. దీంతో ప్రభుత్వానికి రూ.20వేల కోట్ల అదనపు రెవెన్యూ వచ్చి పడింది. దీంతో ద్రవ్యలోటు తగ్గించుకోవడానికి వీలైంది. మొత్తానికి పెట్రోల్‌పై లీటరుకు రూ.11.77, డిజిల్ రూ.13.47 పెంచి ప్రభుత్వం ఖజానా నింపుకుంది. కాగా పెట్రోల్, డిజెల్, ముడి చమురు, విమానాలకు వినియోగించే ఇంధనం, సహజ వాయువులను జీఎస్టి పరిధి నుంచి మినహాయించారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టిలోకి తీసుకురావడానికి తాము అనుకూలమేనని ప్రధాన్ అన్నారు.

తగ్గనున్న వృద్ధిరేటు

● క్యూ1లో 6 శాతమే : హెచ్ఎస్‌బీఎసీ

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జీడీపీ వృద్దిరేటు కాస్తా తగ్గే అవకాశం ఉందని హెచ్ఎస్‌బీసీ తాజా నివేదికలో వెల్లడించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 6 శాతం నమోదయ్యే అవకాశాలున్నాయని అంచనా వేసింది. అంతకు ముందు అంటే మార్చితో ముగిసిన త్రైమాసికంలో 6.1 శాతం వృద్దిరేటును సాధించింది. ప్రైవేట్ వినియోగం పెరగడం.. పెట్టుబడులు మందగించడంతో ప్రభుత్వం వ్యయం తగ్గించడంతో ఎగుమతులు కూడా బలహీనంగా నమోదు కావడంతో దాని ప్రభావం వృద్దిరేటుపై చూపుతోందని వివరించింది. బడ్జెట్‌ను ముందుకు జరపుతామని ప్రకటించడంతో పాటు కొత్తగా అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టి) రేట్ల వల్ల రాబోయే కాలంలో జీడీపీ వృద్దిరేటు అంతంత మాత్రంగానే ఉంటుందని అంచనా వేసింది.

రాబోయే త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థను కొలవడానికి గ్రాస్ వాల్యూ యాడెడ్ ద్వారా (జీవీఏ) లెక్కిస్తే ఖచ్చితమైన సమాచారం లభిస్తుందని తేల్చి చెప్పింది. గతేడాది నవంబర్ 8వ తేదీన పెద్దనోట్ల రద్దు, ఈ ఏడాది జులై 1 నుంచి జీఎస్టి అమలుతో పాటు ప్రభుత్వం పలు విధానాలు మారుస్తుండటంతో జీడీపీని లెక్కించే బదులు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి జీవీఏపై ఆధారపడ్డం మేలని హెచ్ఎస్‌బీసీ సూచించింది. జీవీఏ ప్రకారం చూస్తే ఈ ఆర్థికసంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు కాస్తా మెరుగుపడి 6.2 శాతం దాటుతుందని.. జీడీపీ ప్రకారం లెక్కిస్తే ఆరు శాతం కంటే తగ్గుతుందని హెచ్ఎస్‌బీసీ పరిశోధన పత్రంలో పేర్కొంది. ఇదిలా ఉండగా కేంద్రబడ్జెట్ ఈ ఏడాది ఫిబ్రవరి 1న విడుదల చేసింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే ఒక నెల ముందుకు జరిపింది. దీంతో ప్రభుత్వం అనుమతులు వీలైనంత త్వరగా ఇవ్వడానికి వీలవుతుంది. వ్యయం కూడా చేయడానికి వీలవుతుంది ముఖ్యంగా సబ్సిడీలపై అని తెలిపింది. అలాగే కొత్త పన్ను వ్యవస్థ జీఎస్టిని తీసుకురావడంతో పన్ను వసూళ్లలో కూడా వ్యత్యాసం ఉంటుందని వివరించింది. తమ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జీవీఏ వృద్ధిరేటు సంవత్సరం ప్రాతిపదికన చూస్తే కాస్తా కోలుకొని 6.2 శాతంగా నమోదు కావచ్చునని అంతకు క్రితం త్రైమాసికంలో పెద్దనోట్ల రద్దు వల్ల 5.6 శాతంగా నమోదైందని పరిశోధన ప్రతంలో పేర్కొంది. అటు తర్వాత పరిస్థితులు మెరుగు పడినా.. వృద్ధిరేటు మాత్రం పెద్దగా జోరుండదని స్పష్టం చేసింది. వాస్తవానికి చూస్తే 2016 జూన్ నుంచి వృద్దిరేటు క్రమంగా తగ్గుకుంటూ వచ్చిందని తెలిపింది. ఉత్పత్తి, వ్యవసాయం, వాణిజ్యం, సేవల రంగంలో బలోపేతం అవుతాయని, తయారీరంగం కూడా మెరుగుపడి ఐఐపీ గణాంకాలపై ప్రభావం చూపుతుందని, ఆర్థిక సేవల రంగం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయని స్పష్టం చేసింది.

బ్రిడ్జ్‌స్టోన్ అంబాసిడర్‌గా పి.వి.సింధు

హైదరాబాద్: టైర్ల తయారీ రంగంలోని బ్రిడ్జ్‌స్టోన్ ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధును తమ తొలి బ్రాండ్ అంబాసడర్‌గా నియమించుకుంది.



బ్రిడ్జ్‌స్టోన్ ప్రపంచవ్యాప్తంగా ఒలింపిక్ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. పి.వి. సింధు బ్రిడ్జ్‌స్టోన్ యాక్టివేషన్స్‌లో భాగమ వుతారని, ఈ ఒప్పందం మూడేళ్లపాటు అమలులో వుంటుందని బ్రిడ్జ్‌స్టోన్ తెలిపింది. రియో ఒలింపిక్స్‌లో వెండి పతకం సాధించిన పద్మశ్రీ సింధును బ్రాండ్ అంబసడర్‌గా నియమించుకోవడం ఆనందకరమని బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుతోషి ఒయమా ఈ సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో చెప్పారు. మా బ్రాండ్‌ను ప్రతిఫలించేలా సింధు విజయసాధకురాలిగా కొనసాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక, ఫలప్రదమైన భాగస్వామ్యంగా ఈ అనుబంధం పటిష్టమవుతుందని భావిస్తున్నట్లు పి.వి. సింధు ఈ సందర్భంగా చెప్పారు.

ర్యాలీ, బహిరంగ సభకు అనుమతించండి

ఎన్జీవో నేతల విజ్ఞప్తి

అమరావతి, ఆంధ్రప్రభ : కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగుల ర్యాలీ, బహిరంగ సభలకు అనుమతి ఇవ్వాలని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్‌బాబు ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగ సంఘ నేతలు విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్‌ను కోరారు. బుధవారం ఈ మేరకు విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ సవాంగ్ ర్యాలీని శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఉద్యోగ సంఘ నేతలకు సూచించారు. పోలీస్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఏపీఎన్జీవో నేతలు ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, డి. రమణ, ఎ. విద్యాసాగర్, సీపీఎస్ ఉద్యోగసంఘ నేతలు ఉన్నారు.

మా కుమార్తె కారుణ్య మరణానికి అనుమతించండి

న్యాయమూర్తికి పాప తల్లిదండ్రులు అభ్యర్థన

మదనపల్లె, కెఎన్ఎన్ : తన కుమార్తె కారుణ్యమరణానికి అనుమతి ఇవ్వాలని కురబలకోట మండలం తెట్టు గ్రామం పుల్లగూర వారిపల్లెకు చెందిన బొగ్గల చిన్నరెడ్డెప్ప బుధవారం మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జిని కోరారు. ఈసందర్భంగా చిన్నరెడ్డెప్ప మాట్లాడుతూ, తనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని తెలిపారు. వారిలో పెద్దకుమార్తె శృతిహాసన్(6)కు న్యూరోఫైబ్రోమో వ్యాధి వచ్చిందని, గత మూడు సంవత్సరాలుగా తిరుపతి స్విమ్స్, బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో, వేలూరు సిఎంసి లో దాదాపుగా రూ.3లక్షల వరకు అప్పులు సైతం చేసి చూపించామని అయినా ఏమాత్రం ఫలితం లేదని, ఏ డాక్టరు కూడా పాపకు వ్యాధి నయమవుతుందని చెప్పలేదని తెలిపారు. పాపకు వ్యాధి కారణంగా మిగిలిన పిల్లలను కూడా సరిగా చూసుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఇలాంటి పరిస్థితిలో తాము ఇంకా తమ కుమార్తె శృతిహాసన్‌కు డబ్బులు ఖర్చుపెట్టి చూపించలేకపోతున్నామని తెలిపారు. కావున తమ కుమార్తె కారుణ్యమరణానికి కోర్టువారు అనుమతి ఇవ్వాలని పాప తల్లిదండ్రులు చిన్నరెడ్డెప్ప, సునీతలు కోరుతున్నారు.

ఉద్యానవన రైతులకు 'కోకో'తో సిరులు

• ప్రపంచంలోనే నాణ్యతలో ఏపీ మేటి • రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
• పదేళ్లలో లక్ష హెక్టార్లలో సాగు విస్తీర్ణ లక్ష్యం

అమరావతి, ఆంధ్రప్రభ: చాక్‌లెట్ పరిశ్రమకు కావాల్సిన ప్రధాన ముడి సరుకు కోకో రాష్ట్రంలో ఉద్యానవన రైతులకు సిరులు కురిపిస్తోంది. రైతులకు ఆదాయాన్నే కాకుండా దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని కూడా అందిస్తోంది. రైతులు పండించిన పంటకు గిరాకీ ఉండటంతో రైతులకు నికర ఆదాయాన్ని చేకూరుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 25 వేల హెక్టార్లలో కోకో పంట పండిస్తుండగా భవిష్యత్‌లో లక్ష ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించడం జరిగింది. రాష్ట్రంలో కోకో ఉత్పత్తికి ప్రభుత్వం ఉద్యానవన శాఖద్వారా పలు ప్రోత్సాహకాలను అందిస్తోంది. కొబ్బరి, ఆయిల్ ఫాం తోటల్లో అంతర్‌పంటగా ఉన్న కోకో విస్తీర్ణం, ఆదాయం పెరగడంతో ప్రధాన పంటగా మారింది. కొబ్బరి, ఆయిల్ ఫాం తోటల్లో అంతరంగా వేస్తున్న కోకో వలన రైతుకు ఎకరాకు రూ.50 నుంచి 60 వేల వరకు ఆదాయాన్ని చేకూరుస్తోంది. స్థిరమైన రాబడితో కోకో సాగు రైతుకు భరోసా ఇవ్వడంతో రైతులు ఈ పంట పట్ల మక్కువ చూపుతున్నారు. దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతం కోకో జన్మస్థలం కాగా, క్రమంగా విస్తరించి భారత్‌కు చేరింది. దేశంలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కోకో పంటను పండిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అధికంగా పండిస్తున్నారు. ప్రపంచంలో ఆఫ్రికా దేశంలోని 'ఘనా' కోకో నాణ్యతలో ప్రథమ స్థానంలో ఉండగా, తర్వాతి స్థానం ఏపీ ఉత్పత్తులకు ఉండటం విశేషం. ఏపీలో పండించిన కోకో బహిరంగ మార్కెట్లో ఇతర రాష్ట్రాల్లో పండించిన ఉత్పత్తుల కంటే అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దేశంలో కేరళ, ఆంధ్రప్రదేశ్‌ల్లో కోకో ఎక్కువగా



పండిస్తుండగా, కేరళ రాష్ట్రంలో దిగుబడులు, ధరల కంటే ఆంధ్రప్రదేశ్‌లో దిగుబడులు మెరుగ్గా ఉండటంతోపాటు నాణ్యతా ప్రమాణాలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడి రైతులు పండించిన పంటకు గరిష్టంగా కిలోకు రూ.185 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దేశంలో కోకో వాడకానికి తగ్గట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో పండించిన పంటకు డిమాండ్ అధికంగా ఉంది. ప్రధానంగా చాక్‌లెట్ పరిశ్రమకు కోకో మూలాధారం కావడంతో ప్రముఖ చాక్‌లెట్ తయారీ సంస్థ క్యాడ్‌బరీస్ రైతులతో ముందస్తు ఒప్పందం కుదుర్చుకుని మరీ ఉత్పత్తులను అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా కొనుగోలు చేస్తోంది. అంతేకాకుండా క్యాడ్‌బరీస్ పశ్చిమ గోదావరి జిల్లాలోని గంగన్నగూడెం, పోరుమామిడి, కొత్తపేటలలో నర్సరీలను పెంచుతూ ఏటా 20 మొక్కలును ఉత్పత్తి చేస్తోంది. కోకో పంటకు హెక్టారుకు రూ.40 వేలు ఖర్చు అవుతుండగా, ఉద్యానవనశాఖ, 20 సబ్సిడీ అందజేస్తుంది. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కూడా పశ్చిమ గోదావరి జిల్లాలోని విజయరాయి వద్ద క్లోనింగ్ గార్డెన్‌ను ఏర్పాటు చేసింది.

ఉద్యానవన శాఖ ద్వారా క్లోనింగ్ చేసిన మొక్కలను రైతులకు అందజేస్తుంది. మూడు నుంచి నాలుగేళ్ల వ్యవధిలో కోకో ఉత్పత్తులు మొదలై సుమారు 40 ఏళ్ల పాటు రైతుకు నికరమైన ఆదాయాన్ని కల్పిస్తుంది. క్యాడ్‌బరీస్ సంస్థ ఇటీవల శ్రీసిటీలో చాక్‌లెట్ తయారీ పరిశ్రమను నెలకొల్పింది.

ఈ సందర్భంగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోకో ఉత్పత్తిని అధికం చేసేందుకు రైతులకు ప్రోత్సహిస్తామన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం రాష్ట్రంలో 25 వేల హెక్టార్లలో ఉన్న కోకో సాగును రానున్న పదేళ్లలో లక్ష హెక్టార్లకు విస్తరించే విధంగా చర్యలు చేపడతామని సీఎం వెల్లడించారు. కాగా ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవిచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో కోకో విస్తీర్ణం పెంచేందుకు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. హెక్టారుకు అయ్యే ఖర్చులో 50 శాతం సబ్సిడీ అందజేయడం జరుగుతుందన్నారు.

నాలుగేళ్లపాటు వ్యవసాయం చేయగలిగితే 40 ఏళ్ల పాటు నికర ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కేరళ రాష్ట్రంలో హెక్టారుకు కిలోన్నర గింజలు ఉత్పత్తి అవుతుండగా, రాష్ట్రంలో రెండున్నర కిలోల వరకు దిగుబడి వస్తుందన్నారు.

అంతేకాకుండా రాష్ట్రంలో పండించిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో గిరాకీ ఉండటంతో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. క్యాడ్‌బరీస్ సంస్థ రైతులకు నర్సరీ ద్వారా మొక్కలను పంపిణీ చేయడంతోపాటు వారి ఉత్పత్తులను కూడా కొనుగోలు చేస్తోందన్నారు.

కొన్ని రైళ్లు రద్దు.. 14 ట్రైన్లలో అదనపు కోచ్‌లు

అమరావతి, ఆంధ్రప్రభ: దురంతో ఎక్స్‌ప్రెస్ ఘటన నేపథ్యంలో ఆ మార్గంలో నడిచే కొన్ని రైళ్లను పూర్తిగాను, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే తాజాగా నిర్ణయం తీసుకుంది. దాదర్ - జల్నా జనశతాబ్ది (12071) ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూర్ - లోకమాన్యతిలక్ (11014) ఎక్స్‌ప్రెస్ , చెన్నై సెంట్రల్ - ముంబాయి సీఎస్ఎంటీ (11042) ఎక్స్‌ప్రెస్, లోకమాన్యతిలక్ - కోయంబత్తూర్ (11013) ఎక్స్‌ప్రెస్, లోక్‌మాన్యతిలక్ - హెచ్.ఎస్.నాందేడ్ (11011) ఎక్స్‌ప్రెస్, ముంబాయి సీఎస్ఎంటీ - చెన్నై సెంట్రల్ (11041) ఎక్స్‌ప్రెస్ , హెచ్.ఎస్.నాందేడ్ - ముంబయి సీఎస్ఎంటీ (17618) తపోవన్ ఎక్స్‌ప్రెస్ , హైదరాబాద్ -ముంబయి సీఎస్ఎంటీ (12702) హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ , హైదరాబాద్ - ముంబయి సీఎస్ఎంటీ (17032) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 30వ తేదీన రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అదే విధంగా ఈనెల 31వ తేదీన కూడా కొన్ని రైళ్లను రద్దు చేశామని సంబంధిత అధికారులు ప్రకటించారు. ముంబాయి సీఎస్ఎంటీ - కెఎస్ఆర్ బెంగుళూర్ ఉదయన్ ఎక్స్‌ప్రెస్ (11301) తో పాటు హెచ్.ఎస్.నాందేడ్ లోకమాన్యతిలక్ (11012) ఎక్స్‌ప్రెస్, ముంబాయి సీఎస్ఎంటీ - హెచ్.ఎస్.నాందేడ్ (17617) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 31న రద్దు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.29న కొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. నాగర్‌సోల్ - ముంబాయి సీఎస్ఎంటీ (16340) ఎక్స్‌ప్రెస్‌తో పాటు హైదరాబాద్ - ముంబాయి సీఎస్ఎంటీ హుస్సేన్‌సాగర్ (12702) ఎక్స్‌ప్రెస్, కేఎస్ఆర్ బెంగుళూర్ - ముంబాయి (11302) ఉయదన్ ఎక్స్‌ప్రెస్, హెచ్.ఎస్.నాందేడ్ - పన్‌వెల్ ఎక్స్‌ప్రెస్ (17614) ఎక్స్‌ప్రెస్‌తో పాటు కాజీపేట - లోకమాన్యతిలక్ (22128) ఆనందవన్ ఎక్స్‌ప్రెస్ , సికింద్రాబాద్ - లోకమాన్యతిలక్ (12220) ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. అదే విధంగా ముంబాయి సీఎస్ఎంటీ -హైదరాబాద్ (17031) ఎక్స్‌ప్రెస్, జల్నా - దాదర్ జనశతాబ్ది (12072) ఎక్స్‌ప్రెస్ , ధర్మాబాద్ - మన్మమడ్ మరత్వాడ (17688) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.అలాగే మరికొన్ని రైళ్లను రీ షెడ్యూల్ చేశామని అధికారులు తెలిపారు.

14 రైళ్లల్లో అదనపు కోచ్‌లు

వెయిటింగ్ లిస్టులో ఉన్న రైల్వే ప్రయాణీకులకు అదనపు ప్రయాణ సౌకర్యం కల్పించేందు కు 14 రైళ్లలో తాత్కాలిక పద్ధతిలో అదనపు కోచ్‌లను ఏర్పాటు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే తాజాగా చర్యలు తీసుకున్నది. నాందేడ్ - ముంబై (నెంబర్ 17618) సీఎస్ఎంటీ తపోవన్ ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ చైర్‌కార్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా ముంబాయి సీఎస్ఎంటీ - నాందేడ్ (17617) తపోవన్ ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ రెండో తేదీ నుంచి అక్టోబర్1వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ చైర్‌కార్ కోచ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా గుంటూరు-వికారాబాద్ (12747) పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ చైర్‌కార్ కోచ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వికారాబాద్ - గుంటూరు (12748) పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ చైర్‌కార్ కోచ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్- నర్సాపూర్ (17256) ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీటైర్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. నర్సాపూర్- హైదరాబాద్ (17255) ఎక్స్‌ప్రెస్‌లో కూడా సెప్టెంబర్ రెండో తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీ టైర్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ - త్రివేండ్రం (17230) శబరి ఎక్స్‌ప్రెస్‌లో కూడా సెప్టెంబర్ 3 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఒక ఏసీ త్రీటైర్ కోచ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. త్రివేండ్రం-హైదరాబాద్ (17229) శబరి ఎక్స్‌ప్రెస్‌లో కూడా సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 4వ తేదీవరకు ఒక ఏసీ త్రీటైర్ కోచ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే తిరుపతి - హెచ్.నిజాముద్దీన్ (12707) ఏపీ సంపర్క్ ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 29వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీటైర్ కోచ్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది అలాగే హెచ్.నిజాముద్దీన్ - తిరుపతి (12708) ఏపీ సంపర్క్ ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ 3వ తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీ టైర్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. మచిలీపట్నం - సికింద్రాబాద్ (12749) ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీ టైర్ కోచ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే సికింద్రాబాద్ - మచిలీపట్నం (12750) ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబర్ రెండో తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీ టైర్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ - ఎల్‌టీటీ ముంబాయి (17221) ఎక్స్‌ప్రెస్‌లో పెప్టెంబర్ రెండో తేదీ నుంచి 30వ తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీ టైర్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఎల్‌టీటీ ముంబాయి - కాకినాడ (17222) ఎక్స్‌ప్రెస్‌లో పెప్టెంబర్ మూడో తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు అదనంగా ఒక ఏసీ త్రీ టైర్ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ అదనపు సౌకర్యాన్ని రైల్వే ప్రయాణీకులంతా వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన విశాఖ కాపు నేతలు



అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖపట్టణం జిల్లా పెందుర్తి మండలానికి చెందిన శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సచివాలయంలో రూ.1.60 కోట్లతో నిర్మిస్తున్న ఈ భవనానికి కాపు కార్పొరేషన్ నుండి రూ.1.10 కోట్ల నిధులు మంజూరు చేయాల్సిందిగా కాపు కార్పొరేషన్ భవన నిర్మాణానికి నిధులు ముఖ్యమంత్రిని కోరారు. ఇందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

బాలల హక్కులను కాపాడుతున్నారు: హైమావతి

రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న విధానాలకు ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ హైమావతి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన హైమావతి తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే బాలల పరిరక్షణకు భరోసా కలిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఉద్దానం ప్రాంతంలో స్వల్ప భూకంపం

ఇళ్లలోంచి పరుగులు తీసిన జనం

శ్రీకాకుళం, కెఎన్ఎన్ బ్యూరో: ఉద్దానం ప్రాంతంలోని పలాస మున్సిపాలిటీ, మందస, సోంపేట మండలాలలో బుధవారం మధ్యాహ్నం 3.50 గంటల సమయంలో రెండునుంచి మూడు సెకన్లపాటు భూమి కంపించినట్లు ఆయా ప్రాంతాల ప్రజలు తెలియచేస్తున్నారు. ఇళ్లల్లో టేబుళ్లపై ఉన్న గ్లాసులు, కంచాలు కిందకు పడటం, తలుపులు కొట్టుకోవడంతో భూకంపం వచ్చిందన్న భయంతో కొందరు ఇళ్లనుంచి బయటకు కేకలు వేసుకుంటూ వచ్చారు. ఆ సమయంలో వింతగా వచ్చిన శబ్దాలను కూడా కొందరు విన్నట్లుగా చెబుతున్నారు. అయితే అవి వినాయకచవితి వేదికల వద్ద బాణాసంచా కాల్చుతుండటం, ఆకాశం మబ్బులు వేయడంతో ఉరుములుగా కొందరు భావించారు. ముఖ్యంగా పలాస, సోంపేట పట్టణాలలో ప్రజలు భూకంపం ఎక్కువశాతం గుర్తించలేకపోయినట్లుగా తెలుస్తోంది. మందస మండలం గ్రామీణ ప్రాంతాలు హరిపురం, కిల్లోయి, కొండలోగాం, సిరిపురం తదితర గ్రామాలలో మాత్రం భూకంపం వచ్చినట్లుగా ఎక్కువమంది గుర్తించి భయంతో ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు.అయితే అధికారులకు దీనిపై ఎటువంటి సమాచారం లేదని చెబుతున్నారు.

సెప్టెంబర్ 1 నుంచి 7 వరకూ

రైతాంగ డిమాండ్ల వారోత్సవం

7న చలో గన్నవరం: రావుల వెంకయ్య



పోస్టర్ విడుదల చేస్తున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య

అమరావతి, ఆంధ్రప్రభ : దేశ వ్యాప్తంగా రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1 నుంచి 7 వరకూ రైతాంగ డిమాండ్ల వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య తెలిపారు. సెప్టెంబర్ 7 న జరిగే చలో గన్నవరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం విజయవాడ దాసరి భవన్‌లో విలేకరుల సమావేశంలో రావుల వెంకయ్య మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏఐకేఎస్ సమావేశంలో రైతాంగ డిమాండ్ల వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దానిలో భాగంగా వారం రోజుల పాటు అన్ని జిల్లాల్లోనూ ఆందోళనలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పరిహాసంగా మారిందని విమర్శించారు. వడ్డీలకు తెచ్చుకున్న రైతులు వాటిని చెల్లించలేక నరకయాతనలు పడుతున్నారని, కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో రుణమాఫీ ఖాతాల్లో జమ చేయకపోవడం వల్ల రైతులకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయన్నారు. మూడో విడత రుణమాఫీ కింద రూ.3,600 కోట్లను కేటాయించని ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసేందుకు 5 నెలల సమయం తీసుకోవడం శోచనీయమన్నారు. ప్రతి జిల్లాల్లో సాధికార సెల్‌ను ఏర్పాటు చేయాలని వెఙయ్య కోరారు. ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడవుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2018లో ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మిగిలిన రెండు విడతల రుణమాఫీలకు సంబంధించి నిధులను ఒకేసారి విడుదల చేసి రైతులను రుణ విముక్తులను చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ విద్యార్థుల ఆందోళనకు రైతు సంఘం మద్దతు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గత 22 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించే తీరిక ప్రభుత్వానికి లేకపోవడం దురదుష్టకరమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. విద్యార్థుల న్యాయమైన కోర్కెలను తీర్చని పక్షంలో ఇతర రైతు, విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళనకు సమాయత్తమవుతామని ప్రసాద్ స్పష్టం చేశారు. ఆనంతరం సెప్టెంబరు 7న నిర్వహించే చలో గన్నవరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసమావేశంలో ఏపీ రైతు సంఘం కార్యదర్శి మల్నీడి యలమందరావు, కృష్ణాజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కామల ఉమమహేశ్వరరావు, కాట్రగడ్డ జోషి, పరసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం

సెప్టెంబర్ 27న డిమాండ్ డే

అమరావతి, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కరం కోసం సెప్టెంబర్ 27న డిమాండ్ డే ను నిర్వహిస్తున్నట్లు కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దేవంజ్ చక్రవర్తి వెల్లడించారు. అలాగే ఢిల్లీలో నవంబరు 9 నుంచి 11 వరకు బిఎంఎస్ మినహా అన్ని ట్రేడ్ యూనియన్లు పాల్గొనే మహా పడావో కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి నిర్మాణ రంగ కార్మికులు వేల సంఖ్యలో పాల్గొంటారని ఆయన తెలిపారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో దేవంజ్ చక్రవర్తి మాట్లాడుతూ, కార్మిక సంక్షేమ బోర్డు కార్మికుల సంక్షేమాన్ని పూర్తి స్థాయిలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రూ.35 వేల కోట్లు చెస్ రూపంలో వసూలు చేస్తే వాటిలో బోర్డు కేవలం రూ.7 కోట్లు మాత్రమే కార్మికుల సంక్షేమానికి వెచ్చించిందన్నారు. కార్మికులను సంక్షేమబోర్డులో రిజిష్టర్ చేయల్సిన బాధ్యత ప్రభుత్వందేనన్నారు. కార్మికుల నుంచి చెస్ సరిగా వసూలు చేయడంలేదని ఆయన ఆరోపించారు. వసూలు చేసిన చెస్‌ను పూర్తిగా నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి వినియోగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో చెస్ వసూలు చేసి ఆ మొత్తాన్ని నిర్మాణ రంగ కార్మికుల పిల్లల విద్య, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్యం వంటి సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రీన్ బెల్ట్ పేరుతో సుప్రీం కోర్టును అడ్డు పెట్టుకుని ప్రభుత్వం మైనింగ్‌ను పూర్తిగా నిలిపిచేసిందని, దీంతో నిర్మాణ రంగంతో పాటు రియల్ ఎస్టేట్ రంగం కూడా దెబ్బతింటోందని విచారం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతులివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్మాణ రంగ మెటీరియల్ పై జీఎస్టీ వల్ల భారం పెరిగిందని, ఆ భారాన్ని తగ్గించేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ సింగారవేలు మాట్లాడుతూ, కార్మికులు తమ హక్కులను కోల్పోయేలా చట్టాల్లో మార్పులు తీసుకువస్తోందని దీనిని వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఉమామహేశ్వరరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోలు దాఖలు చేసిన కోర్టుధిక్కరణ కేసుపై

విచారణ ముగించిన హైకోర్టు

సభ్యత్వ రుసుము, తాళం చెవులను హైకోర్టుకు సమర్పించిన భాగ్యనగర్ టీఎన్జీవోలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీ ఎన్జీవో భవన్ లోని నాలుగు గదులు, సావేశ మందిరం తాళాలను తమకు అప్పగించలేదని పేర్కొంటూ ఏపీఎన్జీవో సంఘం దాఖలు చేసిన కోర్టు ధిక్కారణ కేసుపై హైకోర్టు విచారణ ముగించింది. అలాగే ఏపీ ఎన్జీవో సంఘంలో చేరిన 660 మంది సభ్యత్వ రుసుము కింద రూ.2,31,000 డిమాండ్ డ్రాఫ్టును, గదులకు వేసిన తాళం చెవులను భాగ్యనగర్ టీఎన్జీవో సంఘం తరపు న్యాయవాది హైకోర్టుకు సమర్పించారు. దీంతో భవనంలోని గదులకు తాళం వేయరాదని హైకోర్టు ఏపీ ఎన్జీవోల సంఘానికి సూచించింది.

ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ , జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు . గన్ ఫౌండ్రీ లో ఉన్న ఏపీ ఎన్జీవో భవన్ లోని నాలుగు గదులు, ఒక సమావేశ మందిరానికి వేసిన తాళాలను భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘం తమకు అప్పగించలేదని పేర్కొంటూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ బాబు కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో భవనంలో నాలుగు గదులు, ఓ సమావేశ మందిరానికి వేసిన తాళం చెవులను ..భాగ్యనగర్ అసోసియేషన్ తరపు న్యాయవాది జె.కనకయ్య ధర్మాసనానికి అందజేశారు. అలాగే ధర్మాసనం ఆదేశాల మేరకు ఏపీ ఎన్జీవో సంఘంలో చేరిన 660 మంది భాగ్యనగర్ టీఎన్జీవోల సభ్యత్వ రుసుము కింద రూ.2,31,000 విలువ చేసే డిమాండ్ డ్రాఫ్టును ధర్మాసనానికి సమర్పించారు. ఏపీ ఎన్జీవో సంఘం తరపు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాటిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ధర్మాసనం భాగ్యనగర్ టీఎన్జీవోల సంఘం పై దాఖలైన కోర్టు ధిక్కారణ వ్యాజ్యంపై విచారణ ముగించింది. అలాగే గన్ ఫౌండ్రీలోని ఏపీ ఎన్డీవో సంఘం భవనంలోని గదులకు తాళం వేయరాదని ఏపీ ఎన్జీవో సంఘానికి ధర్మాసనం సూచించింది.

తల్లిదండ్రులకు 23 మంది బాలల అప్పగింత

విశాఖపట్నం, కెఎన్ఎన్ ప్రతినిధి : రైల్వేస్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న 23 మంది చిన్నారులను మహిళా, శిశు సంక్షేమశాఖ వారి తల్లితండ్రుల వద్దకు చేర్చింది. గత నెల 25న వారిని రైల్వే పోలీసులు ప్రశ్నించగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌ల నుంచి మదర్సాల్లో చేర్చేందుకు నూర్ అహ్మద్ అనే వ్యక్తి వారిని గాజువాక మదర్సాకు తీసుకొచ్చారు. పిల్లలకు ఆ పాఠశాల నచ్చకపోవడంతో వారిని రాజమండ్రి మదర్సాకు తీసుకెళ్ళేందుకు గాజువాక నుంచి రైల్వే స్టేషన్‌కి తీసుకొచ్చారు. వారిని రైల్వే పోలీసులు ప్రశ్నించగా కోల్‌కత్తా వెళ్తున్నాని చెప్పారు. పిల్లలను తీసుకొచ్చిన వ్యక్తి రాజమండ్రి మదర్సాకు వెళ్తున్నామని తెలిపాడు. అయితే టిక్కెట్లు కాకినాడ పోర్టుకు తీసుకున్నారు. దీంతో వారిని సాతి రైల్వే చైల్డ్‌లైన్‌కి అప్పగించారు. వారిని బాలల సంక్షేమ సమితి ముందు హాజరుపరచగా, తాత్కాలికంగా బాలుర వసతి గృహం లో బస కల్పించారు. సమాచారాన్ని ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌ల్లోని బాలల సంక్షేమ సమితికి సామాజిక పరిశోధన నివేదిక కోసం పంపించగా వారు పిల్లల తల్లితండ్రులను పిలిపించి మాట్లాడారు. దీంతో వారు తమ రాష్ట్రాల బాలల సంక్షేమ సమితిల ముందు హాజరు పరచాలని కోరారు. ఈ మేరకు విశాఖపట్నం బాలల సంక్షేమ సమితికి చెందిన మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ రఖీబ్, బాలల సంరక్షణ విభాగం అధికారులు, ప్రత్యేక పోలీసు విభాగం సిబ్బంది, సాతి రైల్వే చైల్డ్‌లైన్‌కి చెందిన రమణ, ప్రశాంత్‌లు వారిని ఆయా రాష్ట్రాలకు తీసుకెళ్ళి అక్కడి బాలల సంక్షేమ సమితిలకు అప్పగించారు. అనంతరం 27న వారు పిల్లలను వారి తల్లితండ్రులకు అప్పగించారు.


గుంటూరులో షాపూర్ పల్లంజి కార్యాలయానికి తాళాలు

అమరావతి, ఆంధ్రప్రభ : గుంటూరులో ప్రముఖ కాంట్రాక్ట్ సంస్థ షాపూర్ పల్లంజి కార్యాలయానికి బుధవారం జనం తాళాలు వేసి ధర్నా నిర్వహించారు. గుంటూరులో సమారు వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను షాపూజ్ పల్లంజి చేపట్టింది. ఈ నేపథ్యంలో పనిలో నాణ్యత లేకపోవడంతోపాటు నగరంలో పలుచోట్ల డ్రైనేజీ నిర్మాణం కోసం గుంటలు తవ్వి పూడ్చకపోవడంతో అసహనానికి గురైన నగర ప్రజలు స్థానిక ఎస్వీఎన్ కాలనీలోని సంస్థ కార్యాలయం వద్ద ధర్నకు దిగారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతో వాదోపవాదాలు జరిగడంతో ఆగ్రహించిన జనం కార్యాలయానికి తాళం వేసి తమ నిరసన తెలిపారు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్ మెంట్, డ్రైనేజీ పనుల పర్యవేక్షణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. డ్రైనేజీ కోసం తవ్విన రోడ్లలో సరిగా పూడ్చకపోవడం, పిట్స్ జంక్షన్‌ల వద్ద వాటర్ క్యూరింగ్ సరిగా జరగడంలేదని ఆరోపించారు. డ్రైనేజీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేయశామన్నారు.

పేదవారిలో కడుపేదలు ముందు లబ్ధిపొందాలి

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సాధికారితకు కట్టుబడ్డ కేంద్రం: దత్తాత్రేయ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీల సాధికారిత కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమం, సాధికారిత కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి వివరించారు. ఈ మేరకు ఆయన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ మంత్రి తావర్ చంద్ గెహ్లాట్‌తో చర్చించినట్టు ఆయన వెల్లడించారు.



ముందుగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందజేసిన సహాయం, విడుదల చేసిన నిధుల వివరాలను దత్తాత్రేయ విడుదల చేశారు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ద్వారా రూ. 893.83 కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అందాయని తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ. 84.85 కోట్లు కేటాయించగా 24,251 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని వివరించారు. ఎస్సీలకు స్కాలర్ షిప్పు పథకం కింద 9,14,281 మంది విద్యార్థులకు రూ. 567.96 కోట్లు విడుదల చేసిందని, అలాగే 14,75,000 మంది ఓబీసీ విద్యార్థుల కోసం రూ. 86.13 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ల కోసం రూ. 55.72 కోట్లు విడుదల చేయగా 5,546 మంది లబ్ది పొందారని దత్తాత్రేయ వెల్లడించారు. డాక్టర్ అంబేడ్కర్ పేరుతో ఉన్న వైద్య బీమా పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో రోగికి రూ. 1.75 లక్షలు సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే నైపుణ్య శిక్షణ కింద ఎస్సీల్లో 2,255 మంది విద్యార్థులు, యువత కోసం రూ. 84.84 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన పథకం కింద తెలంగాణలో 6 గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ. 1.26 కోట్లు విడుదల చేశామని, ఇతర పథకాల్లో కేంద్ర సహాయం కింద రూ. 4.81 కోట్లు విడుదల చేశామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 1,52,128 కుటుంబాలకు రూ. 90 కోట్ల సబ్సిడీ ఇచ్చినట్టు దత్తాత్రేయ తెలిపారు. అలాగే స్కాలర్ షిప్పు కోసం ఎస్సీలలో 22,00,181 మంది విద్యార్థులకు రూ. 448.46 కోట్లు కేంద్రం విడుదల చేసిందని అన్నారు. అలాగే 1,26,400 మంది ఓబీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్పుల కింద రూ. 153.63 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఏపీలో సాంఘీక సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం కోసం ఒక్కో హాస్టల్ కు 225 సీట్ల కింద ప్రత్యేక నిధుల కేటాయింపు చేస్తున్నామని అన్నారు. ఓబీసీ హాస్టళ్ల కోసం రూ. 4.5 కోట్లు విడుదల చేయడం చేస్తూ, 3 హాస్టళ్లలో 300 సీట్లు దక్కే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని ఫైనాన్స్ కార్పొరేషన్లకు రూ. 114.9 కోట్లు విడుదల చేశామని, 9,709 మంది లబ్ది పొందారని అన్నారు. నైపుణ్య శిక్షణ కోసం ఏపీలో 4,054 మందికి శిక్షణ ఇచ్చి రూ. 2.43 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల సాధికారిత కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని కేంద్ర మంత్రి దత్తాత్రేయ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సరిగా అమలు చేస్తూ సంక్షేమ ఫలాలను అందరికీ అందేలా చొరవ చూపాలని ముఖ్యమంత్రులిద్దరినీ ఉద్దేశించి దత్తాత్రేయ అన్నారు. మీడియా సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ బీజేపీ అధికార ప్రతినిధి, ఈఎస్ఐ కార్పొరేషన్ సభ్యుడు రామకోటయ్య కూడా పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సిఫార్సులన్నీ అమలవుతాయి

వెనుకబడిన వర్గాలను జాతీయ స్థాయిలో వర్గీకరించడం ద్వారా అందరికీ సమన్యాయం జరిగేలా ప్రయత్నిస్తున్నామని బండారు దత్తాత్రేయ అన్నారు. ఇన్నాళ్లూ రిజర్వేషన్ల వల్ల విద్య, ఉద్యోగాల్లో లబ్ది పొందలేకపోయిన సామాజిక వర్గాలకు ఆ ప్రయోజనాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అలాగే ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించకపోవడం వల్ల ఇన్నాళ్లూ మండల్ కమిషన్ సిఫార్సులు కూడా సరిగా అమలు కాలేదని దత్తాత్రేయ అన్నారు. చట్టబద్ధత కల్పించడం ద్వారా అన్ని ప్రయోజనాలు సక్రమంగా అందరికీ అందే అవకాశముందని తెలిపారు. మండల్ కమిషన్ సూచనల్లో అనేక సూచనలను తాము అమలు చేస్తున్నామని తెలిపారు.

బీసీ ఫెడరేషన్లకు వెసులుబాటు

• ఆర్థిక సహాయంపై నూతన మార్గదర్శకాలు
• ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని బీసీ ఫెడరేషన్లకు ఆర్థిక సహాయానికి సంబంధించి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను ఖరారుచేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్టు బుధవారం అధికారవర్గాలు తెలియజేశాయి. తాజా ఆదేశాలు 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 11 బీసీ ఫెడరేషన్లకు వర్తిస్తుంది. నాయీ బ్రాహ్మణ, వడ్డెర, మత్స్యకార సమాఖ్యలకు ఇంతకాలం ఇస్తున్న మొత్తాన్ని కూడా ప్రభుత్వం రెట్టింపుచేసిందని అధికారులు పేర్కొన్నారు. ఇంతవరకు 50 శాతం సబ్సిడీ కింద ఒక్కో సభ్యుడికి 25,000రూపాయలు, ఒక్కో సొసైటీకి 3.75 లక్షల రూపాయలు చెల్లించడం జరిగేది. ఆ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం తాజాగా ఒక్కో సభ్యుడికి లక్షరూపాయలు, సొసైటీకి 15 లక్షలకు పెంచడం జరిగింది. 50 శాతం బ్యాంక్‌లోన్ కింద ఒక్కో సభ్యుడికి 25 వేల రూపాయలు చెల్లించారు. ఆ మొత్తాన్ని లక్షరూపాయలకు, సొసైటికి అయితే 3.75 లక్షల రూపాయల నుంచి 15 లక్షలకు పెంచడం జరిగింది. యూనిట్ కాస్ట్ విషయంలో ఒక్కో సభ్యుడికి 50 వేల రూపాయలు, సొసైటీకి 7.50 లక్షల నుంచి 30 లక్షలకు పెంచడం జరిగింది. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి నిర్వహించిన సమావేశంలో 11 బీసీ ఫెడరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి చైర్మన్, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో పలు కీలకమైన నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. రుణాల మంజూరు విషయంలో 15 మందిని ఒక గ్రూపుగా చేయడంలో క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న ఇబ్బందులను కూడా సమాఖ్యల పాలకవర్గాలు ప్రభుత్వం దృష్టికి తేవడం జరిగింది. ఈ క్రమంలోనే రుణాల స్థాయిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సబ్సిడీ విషయంలో అయిదుగురు సభ్యుల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం జరిగింది. సబ్సిడీ విషయంలో సభ్యులందరూ సమానంగా లబ్ధి పొందాలని నిర్దేశించడం జరిగింది. ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునే విషయంలో అన్ని బీ.సీ సమాఖ్యలు 2008 లో జారీ చేసిన 57 వ నంబరు జీ.ఓ.ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆంధ్రప్రభ

పీఎస్‌ఎల్‌వీ సీ-39 నేడే ప్రయోగం



నెల్లూరు, ఆగస్టు 30, కెఎన్ఎన్ బ్యూరో : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ) సీ-39 ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని శ్రీహరికోటలోని 2వ ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 6.59 నిమిషాలకు పీఎస్ఎల్వీ రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోనుంది. ఈ ప్రయోగానికి సంబంధించి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కౌంట్‌డౌన్ కూడా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రారంభించారు. పీఎస్ఎల్వీ ప్రయోగ రంగంలో భాగంగా 41వ సారి మరో భారీ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ నౌక అంతరిక్షంలోకి మోసుకుపోనుంది. ఈ రాకెట్ ద్వారా ఇప్పటివరకు చేపట్టిన ప్రయోగాల్లో ఒకటి మినహా మిగిలిన ప్రయోగాలన్నీ సూపర్ సక్సెస్ అయ్యాయి. దీంతో కీలకమైన సమాచార వ్యవస్థకి చెందిన ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ప్రక్రియలో భాగంగా ఆరంభంలో పంపిన ఐఆర్ఎస్ఎస్ఎన్-1 ఉపగ్రహంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఆ స్థానంలో ఐఆర్ఎస్ఎస్ఎన్-1 హెచ్ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ సీ-39 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. 1400 కేజీల బరువు ఉన్న సమాచార ఉపగ్రహాన్ని భారతనౌక 18 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి తీసుకువెళ్ళనుంది. అనంతరం మరో 2.19 నిమిషాల్లో శాస్త్రవేత్తలు ఉపగ్రహాన్ని ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు.

ప్రయోగం సాగేదిలా...

షార్‌లోని 2వ ప్రయోగ వేదిక నుంచి 44.4 మీటర్ల ఎత్తు, 320 టన్నుల బరువుతో తన యాత్రను ప్రారంభించనున్న భారతనౌక మొత్తం 4 దశలను అధిగమించి నిర్ణీత కక్ష్యలోకి చేరుకోనుంది. మొదటి దశలో 138 టన్నుల ఘన ఇంధనంతోను, 7.6 టన్నుల ఘన ఇంధనంతో పాటు 42 టన్నుల ద్రవ ఇంధనం, 2.8 సామర్థ్యం ఉన్న మోటార్ల సాయంతో 2వ దశను అధిగమిస్తుంది. తరువాత 12.5 టన్నుల ఘన ఇంధనంతో పాటు 6 స్ట్రాఫాన్ బుస్టర్ల సాయంతో కీలకదశను అధిగమిస్తుంది. ఆ తరువాత చివరిదైన 4వ దశలో రాకెట్‌లో అమర్చిన మోటార్లసహాయంతో ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెడుతారు.

అందుబాటులోకి పూర్తిస్థాయి దిక్సూచీ వ్యవస్థ

అంతరిక్ష ప్రయోగ రంగంలో ప్రపంచ దేశాలతో పోటీపడుతూ ఇప్పటికే తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న ఇస్రో పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సమాచార వ్యవస్థ (దిక్సూచీ)ను అందుబాటులోకి తీసుకురావాలని 2013లోనే నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌ను తయారుచేసింది. అందుకోసం 7 ఉపగ్రహాలు అవసరమవుతాయని ఇస్రో గుర్తించింది. ఈ తరహా ఉపగ్రహాలను తయారు చేయడానికి భారత శాస్త్రవేత్తలు పలు కోణాల్లో అనేక పరీక్షలు నిర్వహించి 2013 జూలై 1 న దిక్సూచీ వ్యవస్థలో మొట్టమొదటి ఉపగ్రహం ఐఆర్ఎస్ఎస్ఎన్ -1 ఏ ను విజయవంతంగా ప్రయోగించింది. గత ఏడాది ఏప్రిల్ 28 తో 7వ ఉపగ్రహాన్ని ప్రయోగించి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసింది. అయితే సమాచార వ్యవస్థ పటిష్టం చేసేందుకు చేపట్టిన ప్రయోగంలో భాగంగా మొదట ప్రయోగించిన ఐఆర్ఎస్ఎస్ఎన్-1 ఏ ఉపగ్రహంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఆ ఉపగ్రహం పనిచేయడం మానేసింది. దీంతో ఆ స్థానంలో గురువారం ఐఆర్ఎస్ఎస్ఎన్ -1 హెచ్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రవేశపెట్టి భారతదేశానికి పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానానంతో రూపొందించిన దిక్సూచీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఇస్రో ఆ దిశగా ప్రయోగం విజయవంతమే లక్ష్యంగా గత నెల రోజులుగా శ్రమిస్తుంది.

ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ క్రీమీలేయర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో చేరేందుకు ఓబీసీలకు దీని వల్ల మరింత మేలు కలుగుతుంది. ఇతర వెనుకబడిన తరగతులకు మెరుగైన సామాజిక న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా క్రీమీలేయర్ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును కూడా ప్రవేశపెట్టింది. గత వారమే ఓబీసీలలో వర్గీకరణ కోసం ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఓబీసీలలో మరింత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేందుకు కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ దిశగా అడుగులేస్తోంది. విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీల ప్రాతినిధ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా మోడీ ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. అనేక ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా ఓబీసీల్లో కింది కులాను పైకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 340 కింద కమిషన్ ఏర్పాటు చేసి త్వరితగతిన నివేదికను కోరింది. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల కాలంలో ఆ వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు.

కొత్త పీఆర్సీపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని, పాలనాయంత్రాంగంలో, నవ్యాంధ్ర నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్న ఉద్యోగులకు మానవతా హృదయంతో అయినా తక్షణమే ఎరియర్స్ విడుదల చేయాలని కోరుతున్నారు.

వేతనాల కోసం విభజన చట్టం సానుకూలం

కాగా రాష్ట్ర విభజన చట్టంలో ఉద్యోగుల వేతనాలకు సంబంధించి నిర్దిష్టమైన నిబంధనలు వున్నాయి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం వేతనాలుచెల్లించలేని పక్షంలో కొత్త రాష్ట్రం అయినందువల్ల తాము వేతనాలుచెల్లిస్తామని చట్టంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒకవేళ పిఆర్‌సి బకాయిలకు చెల్లింపులకు సంబంధించి నిధులు కొరత వున్న పక్షంలో కేంద్రం చెల్లించేందుకు సిద్దంగా వుంది. కానీ ఈ దిశగా ప్రయత్నాలు జరుగకపోవడంతో ఉద్యోగులలో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త రాష్ట్రం కదా అనే కారణంగా ఉద్యోగులు ఇప్పటికే 2013 జులై నుంచి 2015 జులై వరకు ఎరియర్స్‌ను వదులుకున్నారు. మిగిలిన కాలానికి సైతం పిఆర్‌సి బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన ప్రభుత్వ ఉద్యోగులలోవుంది.అదే విధంగా ఇంక్రిమెంట్లు సైతం చెల్లించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలనే డిమాండ్ కూడా ఉద్యోగుల నుంచి వుంది. కాగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్‌ఉద్యోగులకు దాదాపు 5000 కోట్ల రూపాయల దాకా పీఆర్‌సీ బకాయిలు చెల్సించాల్సి వుందని సమాచారం.

చంద్రన్న పెళ్లి కానుక



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల కుటుంబాల సంక్షేమానికి, వారి అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త పథకాలను ప్రకటించారు. బుధవారం రాత్రి వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల సమీక్షా సమావేశంలో ఈ కొత్త పథకాలలు వెల్లడించారు. దశాబ్దాల కాలంగా దగాపడ్డ బీసీలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని సీఎం పేర్కొన్నారు. కాపులకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను కూడా దశలవారీగా నెరవేరుస్తామని చంద్రబాబు చెప్పారు. కాపు సామాజిక వర్గానికి, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వరాలజల్లు కురిపించారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు త్వరలో 'చంద్రన్న పెళ్లి కానుక' పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ వివాహ కానుక కింద ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి రూ. 25 వేలు చొప్పున పెళ్లి ఖర్చులకు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. అలాగే 'ఆదరణ పథకం' ద్వారా బలహీన వర్గాల వారందరికీ అత్యంత అధునాతన పనిముట్లు ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు వృత్తి నైపుణ్యానికి శిక్షణతో పాటు సహకారం అందజేస్తామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ఊసెత్తలేదని, తాము కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ. 1000 కోట్లనిధులు మంజూరు చేశామన్నారు. కాపు విద్యార్థులందరికీ బీసీల విద్యార్థుల మాదిరిగా స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బీసీ ఫెడరేషన్ ద్వారా ఐదుగురితో కూడిన బృందానికి రూ. 10 లక్షల వంతున యూనిట్ ఖరీదుతో స్వయం ఉపాధి పథకాలు చేపట్టే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి ఆమోదించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో జారీ చేస్తామని ఆయన వెల్లడించారు. ఎక్కడ సంక్షేమ పథకాలు అవసరమో అక్కడ అమలు చేస్తామని, ఖచ్చితంగా పథకాల ఫలితాలు చివరి లబ్ధిదారుని వరకూ చేరాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలును తాను తరచూ సమీక్షిస్తానని, ఈ పథకాలు సక్రమంగా అమలు చేయాలని, ఫలప్రదం కావాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. అభివృద్ధి పథకాల అమలులో మరింత సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. సమాజంలో ఆర్థికంగా అట్టడుగు స్థాయిలో ఉన్న బీసిలకు ఆదరణ పథకం ద్వారా తాము ఇస్తున్న చేయూతతో వారి సామాజిక వర్గాలు బాగుపడాలని, ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని అన్నారు. కాపు కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు, స్కాలర్‌షిప్స్‌లకు మరో రూ.1474.75 కోట్లు, వసతి గృహాలకు రూ.845 కోట్లు, బీసీ ఫెడరేషన్లకు రూ.300 కోట్లు, స్వయం ఉపాధికి రూ.366 కోట్లు మొత్తం రూ.5013.50 కోట్లు కేటాయించినట్లు సీఎం వివరించారు. 2017-18లో 8 లక్షల 80 వేల మంది బీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇప్పటి వరకూ (28.8.2017) నాటికి 6లక్షల 77వేల 976 మంది బీసీ విద్యార్థులు స్కాలర్‌షిప్స్ కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. 2017-18లో 3.30 లక్షల మంది ఈబీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెబుతూ, ఇప్పటివరకూ 2,34,132 మంది ఈబీసీ విద్యార్థులు తమపేర్లు నమోదు చేసుకున్నారన్నారు. బీసీలకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ రూ.274.50 కోట్లు కేటాయించగా, రూ.137.25 కోట్లు రెండు విడతలుగా విడుదల చేశామని సీఎం వెల్లడించారు. ఆగస్టు 16 వరకూ ఉన్న బకాయిల కోసం రూ.76.35 కోట్లు వ్యయం చేశామన్నారు. ఇప్పటి వరకూ రూ.487.92 కోట్లు విడుదల చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. మొత్తం 4,84,714 మంది బిసి విద్యార్థులు లబ్ధి పొందుతారన్నారు. పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 3,77,510 మంది విద్యార్థులు లబ్ధిపొందారని సీఎం చెప్పారు. ట్యూషన్ ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద రూ. 1042 కోట్లు బడ్జెట్ కేటాయిస్తే.. రూ.521 కోట్లు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈబీసీలకు ట్యూషన్ ఫీరీయంబర్స్ మెంట్ కింద బడ్జెట్‌లో రూ. 432.50 కోట్లు కేటాయించగా, రెండు విడతలుగా రూ.216.37 కోట్లు విడుదల చేశామని, రూ.216.14 కోట్ల బకాయిలు విడుదల చేశామని సీఎం స్పష్టం చేశారు. లక్షా 24 వేల 595 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి గిరిజాశంకర్, విద్యాశాఖ కమిషనర్ ఉదయలక్ష్మి, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్లు సి.హెచ్.రామానుజయ, వేమూరి ఆనందసూర్య, బిసి ఫెడరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ కార్పొరేషన్ రూపొందించిన పథకాల కరదీపికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు.

విశాఖలో 'ఇండిగో'కి తప్పిన ముప్పు

విశాఖపట్నం(ఎన్ఎడి), కెఎన్ఎన్ బ్యూరో : సుమారు 180 మంది ప్రయాణికులతో బుధవారం ఉదయం విశాఖ నుంచి బెంగళూరుకు బయలుదేరిన ఇండిగో విమానానికి తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. పైలెట్ చాకచక్యం వల్ల అంతా సురక్షితంగా బయటపడ్డారు. బుధవారం ఉదయం బెంగళూరులో బయలుదేరిన ఇండిగో విమానం విశాఖ విమానాశ్రయానికి ఉదయం 7.10 గంటలకు చేరుకుంది. ఇక్కడి విమానాశ్రయంలో ప్రయాణికులను దించేసి మరలా బెంగళూరు బయలుదేరేందుకు 180 మంది ప్రయాణికులతో సిద్ధమయ్యింది. సరిగ్గా 7.45 గంటలకు టేకాఫ్ అయ్యింది. కొంత ఎత్తులోనికి వెళ్లగానే ప్రొఫెల్లర్‌ను పక్షి ఢీకొట్టడంతో ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. విషయాన్ని గమనించిన పైలెట్ వెంటనే విమానాన్ని తిరిగి 8 గంటల సమయంలో విశాఖ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందారు. జరిగిన విషయాన్ని సిబ్బంది వివరించడంతో అందులోవున్న ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. తదుపరి విమానాన్ని సాంకేతిక సిబ్బంది పరిశీలించిన ఆ తరువాత ఇండిగో సంస్థ ఈ విమాన సర్వీసును రద్దు చేసింది. దీంతో అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులు ఇండిగో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ప్రయాణికులను శాంతింపజేసి మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ప్రయాణికులను వేరే విమానంలో బెంగళూరు పంపించే ఏర్పాటు చేశారు.

రేపు రాష్ట్రపతి తిరుమల రాక

- భారీ బందోబస్తు
- శనివారం శ్రీవారి దర్శనం

తిరుమల, కెఎన్ఎన్ ప్రతినిధి : భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రేపు తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకుంటారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి శనివారం ఉదయం స్వామివారిని దర్శించుకుంటారు. రాష్ట్రపతి తిరుమల పర్యటన నేపథ్యంలో టీటీడీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. అదేవిధంగా తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొననున్నారు. రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన తొలిసారిగా తిరుమలకు రానున్నారు. ఆయన రాక సందర్భంగా పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో గవర్నర్

నేడు తిరుగు ప్రయాణం

తిరుమల, కెఎన్ఎన్ ప్రతినిధి : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ బుధవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథి గృహాల వద్ద గవర్నర్‌కు టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, సీవీఎస్ఓ రవికృష్ణలు పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలుకగా రిసెప్షన్ అధికారులైన హరీంద్రనాథ్, లక్ష్మీనారాయణ యాదవ్‌లు బస ఏర్పాట్లు చేశారు. కొద్దిసేపు విరామం అనంతరం ఆలయ మహాద్వారం గుండా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో గవర్నర్‌కు వేదపండితులు ఆశీర్వచనం పలుకగా ఈవో, తిరుమల జేఈవోలు తీర్థ ప్రసాదాలు అందచేశారు. రాత్రికి గవర్నర్ తిరుమలలోనే బసచేసి గురువారం ఉదయం మరోమారు స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అవుతారు.

ఫాతిమా బాధితులకు సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

రీలొకేట్ చేసిందీ వివరాలను వారంలోగా పంపిస్తామన్నారు. విద్యార్థులను 2017 బ్యాచ్‌గా పరిగణించాలని కోర్టు చెప్పిందన్నారు. ఉన్న విద్యార్థులకు నష్టం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులతో మాట్లాడి రీలొకెట్ చేయడం మీద చర్చిస్తామన్నారు. ఫాతిమా కళాశాల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. 99 మందికి సంబంధించిన ఫీజులను ఫాతిమా కళాశాల నుంచి వసూలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఎంసీఐకి అదనంగా సీట్లు కేటాయించే అధికారం ఉంటుందని ఆ క్రమంలోనే 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రతీ దానిలో 4 నుంచి 5 అదనపు సీట్లు కేటాయించి ఫాతిమా విద్యార్థులకు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే కౌన్సెలింగ్ పక్రియ పూర్తయ్యిందని 119 సి కేటగిరి సీట్లు, 162 డెంటల్ సీట్లు మిగిలాయన్నారు. ప్రైవేటు కాలేజీల్లో 24 ఏ కేటగిరి సీట్లకు 4500 మంది ఆప్షన్ ఇచ్చారన్నారు. 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 1900 సీట్లు, 17 ప్రవేటు మెడికల్ కాలేజీల్లో 2000 సీట్లు ఉన్నాయన్నారు. మెడ్‌టెక్ అంశానికి సంబంధించి ఎటువంటి అనుమానాలకు తావులేకుండా ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు.


విచారణ సెప్టెంబర్ 21కు వాయిదా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కడప జిల్లా ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బాధిత విద్యార్థుల సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. బాధిత విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో పాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 2 వారాల్లోగా జవాబు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా నష్టపోయిన విద్యార్థులను ఇతర కళాశాలల్లో సర్దుబాటు చేసే పరిస్థితి ఉందా అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిస్తూ 13 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యార్థులను సర్దుబాటు చేస్తామని తెలిపారు. దీంతో కౌంటర్లు దాఖలు చేయాల్సిందిగా కేసులో ప్రతివాదులను ఆదేశిస్తూ తదుపరి విచారణ సెప్టెంబర్ 21కు వాయిదా వేసింది.

ఫాతిమా కాలేజి విద్యార్థులకు జరిగిన అన్యాయానికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. 2015-16 విద్యా సంవత్సరంలో సరైన ప్రమాణాలు పాటించనందుకు మెడికల్ కాలేజి అనుమతులను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కళాశాల యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. తాత్కాలికంగా స్టే తెచ్చుకున్న యాజమాన్యం ఆ ఏడాది అడ్మిషన్లు యథావిధిగా చేపట్టింది. అయితే 9 నెలల తర్వాత వచ్చిన తుది తీర్పులో కళాశాల యాజమాన్యాన్ని తప్పుబట్టిన న్యాయస్థానం ఎంసీఐ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో అప్పటికే 9 నెలల విద్యాభ్యాసం చేసిన 100 మంది విద్యార్థులు అడ్మిషన్లతో పాటు విద్యా సంవత్సరాన్ని నష్టపోవాల్సి వచ్చింది. వారంతా రెండేళ్లుగా తమకు న్యాయం చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చుట్టూ తిరుగుతూ వచ్చారు. కళాశాల యాజమాన్యం చేసిన తప్పులకు తమను బలి చేయవద్దంటూ నేతలను వేడుకున్నారు. ఈ క్రమంలో హస్తినలో 2 వారాలకు పైగా మకాం వేసిన బాధితులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం, ఈ సమస్యకు కోర్టు ద్వారానే పరిష్కారం సాధ్యమని భావించింది. విద్యార్థుల తరఫున కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో పాటు వారికి మద్దతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం విద్యార్థులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టింది. అయితే ఈ 100 మంది విద్యార్థుల్లో ఒకరు నీట్ పరీక్ష ద్వారా వేరే కళాశాలలో అడ్మిషన్ పొందినందున మిగతా 99 మంది విద్యార్థులను సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మిగతా వారిని 11 మెడికల్ కళాశాలల్లో సర్దుబాటు చేసే ప్రయత్నాలను ప్రారంభించింది. ఈ మేరకు తదుపరి విచారణ లోపు సమగ్ర వివరాలను సుప్రీం కోర్టుకు అందజేసేందుకు సమాయత్తమైంది. సుప్రీం కోర్టు నోటీసులతో ఫాతిమా కాలేజి విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. రెండేళ్ల విద్యా సంవత్సరం నష్టపోయినా, అడ్మిషన్లు కొనసాగే అవకాశం ఉన్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు శ్రేయస్సుకు జగన్ వ్యతిరేకి

: ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి



గుత్తి, ఆగస్టు 30 (కెఎన్ఎన్) : రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టుతో పాటు పట్టిసీమ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చేస్తున్నా కృషికి వ్యతిరేకంగా పట్టిసీమ వద్దంటూ రైతు శ్రేయస్సుకు ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి రైతు వ్యతిరేకిగా మారాడని అనంతపురం పార్లమెంటు సభ్యుడు జేసి దివాకర్ రెడ్డి ఆరోపించారు. 2019నాటికల్లా పోలవరం ప్రాజెక్టు ముఖ్యమంత్రి ఆశయంతో పూర్తి అవుతుందని, తెలివితేటలు తక్కువైనా జగన్ మోహన్ రెడ్డి పట్టిసీమకు నీరు వస్తుంటే వద్దని చెప్పడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. బుధవారం అనంతపురం జిల్లా గుత్తిపట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గుంతకల్లు శాసనసభ్యులు జితేంద్రగౌడ్ అధ్యక్షతన మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా పామిడి మండలం కత్రిమల గ్రామానికి చెందిన ప్రభాకర్ చౌదరి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎంపి హాజరై పై విధంగా అన్నారు. 2019నాటికి సిఎంగా తిరిగి చంద్రబాబునాయుడే అవుతారని తమకు ముఖ్యమంత్రి అవాధ్యమైన ప్రేమ లేదని కానీ ముఖ్యమంత్రిగా బాబు వుంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి అవుతుందని, కర్నూలు జిల్లా ముచ్చుమర్రి వద్ద ఎత్తిపోతల పథకం మరింత అభివృద్ధి అవుతుందన్నారు. ఇటీవల పామిడి సమావేశంలో తాను మాట్లాడుతూ రెడ్డి కులం అంటూ తనకు అభిమానం వుందని, అంతేకాని వైఎస్సార్ సిపికి తాను వ్యతిరేకమన్నారు. రెడ్డి కులస్తులకు తాను సహాయం అందిస్తానని అప్పట్లోనే ముఖ్యమంత్రికి వివరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల ఒరిగేదేమిలేదని కానీ బిడ్డ చనిపోయిన మరులు వుందని బిడ్డను పూడ్చి కాపాడిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే వుందని తాను వైఎస్సార్‌సిపి వైపు వెళ్లనన్నారు. కానీ నంద్యాల ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రిపై జగన్ మోహన్ రెడ్డి బట్టలు ఊడ్చి తంతా, చంపిన పాపం లేదు అనేటువంటి మాటలు వారి తాత రాజారెడ్డి బుద్దులు మనవడు జగన్‌కు వచ్చాయని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని అప్పట్లోనే నేను వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వివరించానని జేసి దివాకర్ రెడ్డి అన్నారు. కార్యకర్తలు పార్టీకి మంచిపేరు తీసుకురావాలని ఆయన వివరించారు.

నంద్యాల ఓటర్లు జగన్ చెంప లాగి కొట్టారు - మంత్రి కాలువ శ్రీనివాసులు :

ఇటీవల నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటర్లు జగన్ మోహన్ రెడ్డి లాగి చెంపపై కొట్టారని దాంతో ఇటీవల ఆయన అనారోగ్యం పాలయ్యారని గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రివర్యులు కాలువ శ్రీనివాసులు ఎద్దేవ చేశారు. బుధవారం ఆయన మార్కెడ్ యార్డులో ప్రజలను ఉద్దేశించి మట్లాడుతూ ఇటీవల నంద్యాల ఓటర్లు 27వేల మేజార్టీని దేశం అభ్యర్థికి అందజేశానని మూడు సంవత్సరాల క్రితం వైఎస్సార్‌సిపి ఎమ్మెల్యేగా వున్న నంద్యాలను ప్రస్తుతం టిడిపి కైవసం చేసుకుందన్నారు.

నేడు చంద్రబాబుతో తెలంగాణ టీడీపీ నేతల భేటీ

రాష్ట్ర, జిల్లాల కమిటీల ఖరారుపై చర్చ

అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31వ తేదీన తెలంగాణ రాష్ట్రా నికి చెందిన తెలుగుదేశం నాయకులతో భేటీ అవుతారు. వెలగపూడి సచివాలయంలో గురువారం మధ్యాహ్నం సమావేశం జరుగుతుంది. కొత్తగా నియమించిన టిడిపి రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా కమిటీలపై కూడా ఇదే సమావేశంలో చర్చజరుగుతుంది. ఖమ్మం, కొత్తగూడెం, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్షులకు సంబంధించిన ప్రతిష్టంభనపై కూడా చంద్రబాబు సమక్షంలో జరిగే భేటీలో స్పష్టత వస్తుంది. నంద్యాల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా అభినందిస్తారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షుడుగా వున బ్రహ్మయ్య మళ్లీ అదే జిల్లాకు అధ్యక్షుడిగా వుంటానంటూ ప్రతిపాదించారు. కానీ బ్రహ్మయ్య స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోకి వస్తుండటంతో ఈ విషయమై ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి కోసం భవాని శంకర్, కోనేరు చిన్నాల మధ్య పోటీ నెలకొంది.

పోలవరానికి కేంద్రం రూ.980 కోట్ల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల నిమిత్తం ఖర్చు చేసిన మొత్తంలో రూ.980 కోట్లను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఐదు విడతల్లో పోలవరానికి కేంద్రం ఖర్చుచేసిన వ్యయంలో కొంత మొత్తాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఎగువ ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

బోర్డు సమావేశం సందర్భంగా రెండు రాష్ట్రాలకు మంచినీరు,సాగు నీటిని విడుదల చేయాలని కేంద్రానికి లేఖలు రాశారు. ప్రస్థత వర్షాలతోనైనా నీటిని విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు కూడా 3,500 క్యూసెక్కుల మేర వరద వస్తోంది. కాగా ఎగువున కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 885 అడుగలకు నీటి మట్టానికి 787.2 అడుగులు ఉంది. అదే విధంగా నాగార్జునసాగర్‌లో 590 అడుగులకు గాను కేవలం 115.31 అడుగులు మాత్రమే ఉంది.ఇది డెడ్‌స్టోరేజీ దుస్థితికి చేరుకుంది. అదే ఎగువున ఉన్న ఆల్మట్టిలో ప్రస్తుతం 129.72 అడుగులకు గాను 125.47 అడుగులకు చేరింది. 27,885 క్యూసెక్కుల వరద నీరొచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నిండటానికి చేరువులో ఉంది.అదే విధంగా నారాయణపూర్‌లో 37.65 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను 34.69 టీఎంసీల నీరు ప్రాజెక్టులో ఉండడం గమనార్హం. ఇక్కడ కూడా 18,171 క్యూసెక్కుల వరద నీరొచ్చి చేరుతుంది. ఈ ప్రాజెక్టు కూడా దాదాపుగా నిండినట్లేనని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. పై నుంచి కిందికి నీళ్లొదిలితే తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీళ్లొసాయంటున్నారు. వరద వస్తున్నందున రాష్ట్రాల అధికారులు నీటిని కిందికి వదిలేయాల్సిందేనని అంటున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాగా వచ్చే 72 గంటల్లో దేశంలోని ప్రధాన నదీపరివాహక ప్రాంతాలన్నింటికి వరద ముప్పు పొంచి ఉన్నట్లు తాజాగా కేంద్ర జలవనరుల శాఖ తెలిపింది. ఈ మేరకు ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో గోదావరి తీరంలోని జిల్లాలకు వరద ముప్పు ఎదురుకానున్నట్లు పేర్కొంది. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాల కార ణంగా మహారాష్ట్రలోని నాసిక్, అహ్మద్‌నగర్,ఔరంగాబాద్, పర్బణీ,నాందేడ్, జిల్లాల్లో గోదావరి పొంగి ప్రవహించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. అలాగే దక్షిణ చత్తీష్‌గడ్‌లో కురిసే వర్షాలతో జగదల్‌పూర్,దంతేవాడలలో ఇంద్రావతి నదికి ఓ మోస్తారుగా వరద వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. దీని వల్ల తెలంగాణలోని నిజామాబాద్, జయశంకర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి జిల్లాలకు వరద ముప్పురావచ్చని హెచ్చరించారు. సతారాం, సాంగ్లి, కొల్హాపూర్, పూణే, షోలాపూర్, కర్నాటకలోని బాగల్‌కోట, విజయపుర,కలబుర్గి జిల్లాలోని ఉప నదులు, చికమగళూరు, శివమొగ్గ, బళ్లారి జిల్లాలలో కృష్ణా , తుంగభద్ర నదుల్లో నీటి మట్టాలు పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. వచ్చే 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కరిసే అవకాశం ఉన్నట్లు కూడా సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

డ్రాగన్‌తో ఇరుగుపొరుగుకి ఇక్కట్లే

ఆసియాలో అత్యంత శక్తివంతమైన దేశం చైనా. ఆర్థికశక్తిగా, సైనిక శక్తిగా డ్రాగన్ తనకుతానే సాటి. అలాంటి చైనా ఇప్పుడు సామ్రాజ్యవాద కాంక్షతో పెట్రేగిపోతున్నది. తనకు చుట్టూ ఉన్న పొరుగు దేశాలతో సఖ్యత కంటే వివాదాలే ఎక్కువ. దాదాపు 22,117 కిలోమీటర్ల మేరన భూ సరిహద్దు కలిగి వుంది. భారత్‌సహా మొత్తం 13 దేశాలు పొరుగున ఉన్నాయి. ఈ దేశాలన్నీ చైనాతో సరిహద్దు భాగస్వాములే. డ్రాగన్ దూకుడును, దురాక్రమణను బాహాటంగానే వ్యతిరేకిస్తున్నప్పటికీ, కొన్నదేశాలు మెతక వైఖరిని అవలంబిస్తున్నాయి. ఇందుకు కారణం ఈ ప్రాంతాల్లో బీజింగ్ పెట్టుబడులు అంతకంతకూ పెరుగుతుండటమే. దీంతో స్వప్రయోజనాల వ్యూహాత్మక దౌత్యంలో ఆయా దేశాలు బీజింగ్ వింతపోకడలను ఖండించలేకున్నాయి. అయితే, బీజింగ్ సైనిక కుట్రలను, వ్యూహాలను ధైర్యంగా ఎదుర్కొంటున్న, తిప్పికొడుతున్న దేశాలు ఐదున్నాయి. భారత్‌తోపాటు, మంగోలియా, వియత్నాం, జపాన్, తైవాన్‌లు చైనా బెదిరింపులకు ఎదురొడ్డి నిలిచివున్నాయి. ఇటీవల జరిగిన ఆసియాన్ సదస్సులో దురాక్రమణ వ్యతిరేక ఒప్పంద ప్రతిపాదన తెరపైకి తీసుకురావడం ద్వారా బీజింగ్‌కు పొరుగు దేశాలు సున్నితమైన హెచ్చరిక చేసినట్లయింది. ఇటీవల చోటుచేసుకున్న డోక్లామ్ సంఘటన బీజింగ్ కుట్రలకు నిదర్శనం. భారత్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా, పొరుగు దేశాలతో కీలక వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక సహాయం పేరుతో ఆయాదేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించేవ్యూహాలను మిగతా ఆసియాదేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. చైనా వ్యవహారశైలిని జపాన్ తీవ్రంగానే వ్యతిరేకిస్తున్నది. డోక్లామ్ వివాదం నేపథ్యంలో ఆ దేశం భారత్‌కు మద్దతుగా నిలిచింది. ఆసియా దేశాలతో మెగా డీల్స్ ద్వారా బీజింగ్ పన్నుతున్న వ్యూహాలు, పొరుగు దేశాలతో దౌత్యసంబంధాలపై సంక్షిప్త విశ్లేషణ.

● సరిహద్దు దేశాలు 13 - అందరితోనూ వివాదాలే ● 22,177 కి.మీ. ఉమ్మడి సరిహద్దులో తరచూ గొడవలే ● సముద్రాల్లోనూ ఆధిపత్యం కోసం బీజింగ్ కుట్రలు ● చిన్న చిన్న దీవులను కబళించే యత్నం ● ఆర్థిక, సైనిక శక్తితో చిన్నదేశాలను లొంగదీసుకునే వ్యూహం



➡ **కిర్గిస్తాన్ (తటస్థం):** చైనా జిన్‌జియాంగ్ ప్రావిన్స్‌కు చేరువలో ఉన్న దేశమిది. ఈ రెండింటి మధ్య 858 కిలోమీటర్ల ఉమ్మడి సరిహద్దు ఉంది. బిష్‌కెక్ (కిర్గిస్తాన్ రాజధాని)తో బీజింగ్ స్నేహం అంతంతమాత్రమే. కాస్తంత వివరంగా చెప్పాలంటే ఈ దేశంతో చైనా మైత్రి సంక్లిష్టమే. కిర్గిస్తాన్‌లోని చాలా ప్రాంతాలు అమెరికా, రష్యాలకు సైనిక స్థావరాలుగా ఉన్నాయన్నది బీజింగ్ ప్రాథమిక ఆరోపణ. కిర్గీస్ చైనాలో గుర్తింపు పొందిన 56 జాతుల్లో ఒకరు. కిర్గిస్తాన్ వలసల పట్ల చైనా ఒకింత ఆందోళన చెందుతుంటుంది. వీరు మారణాయుధాలను జిన్‌జియాంగ్‌కు స్మగ్లింగ్ చేస్తుంటారన్న ఆరోపణలే ఇందుకు కారణం.

ఒప్పందాలు: కీలక వాణిజ్య ఒప్పందాలు. గతంలో రష్యా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండేది. దీనిని చైనా అధిగమించింది.

➡ **తజకిస్తాన్ (తటస్థం):** ఉమ్మడి సరిహద్దు విస్తీర్ణం 414 కిలోమీటర్లు. పామిర్ పర్వత ప్రాంతాల్లో చైనా భూభాగం వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అయితే ఇది పూర్తిగా బీజింగ్ చేతుల్లోకి వెళ్లిందా? లేదా? అన్నదానిపై స్పష్టతలేదు. 130 ఏళ్ల కిందటి వివాదాన్ని ప్రస్తావిస్తూ 5 శాతం భూభాగాన్ని ఆక్రమించేసింది. ప్రస్తుతం సరిహద్దులోని 28వేల చ.కి.మీ. భూభాగం తమదేనంటూ చైనా వివాదం రేపింది.

ఒప్పందం: ఇంధన, మౌళిక రంగాలలో ఇక్కడ చైనాయే అతిపెద్ద పెట్టుబడిదారు.

➡ **ఆఫ్ఘనిస్తాన్:** ఈ దేశంతో 76 కిలోమీటర్ల సరిహద్దును కలిగివుంది. 1963 నాటి సరిహద్దు ఒప్పందం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకుంది. బడఖ్‌షాన్ ప్రావిన్స్‌లోని కొంత భూభాగాన్ని చైనా ఆక్రమించుకున్నదని, ఇది బీజింగ్ వ్యూహాత్మక చర్యేనని విశ్లేషకుల వాదన.

ఒప్పందాలు : తీవ్రవాద నిరోధక నెట్‌వర్క్‌ను పెంపొందించుకోవడం ద్వారా ఈ ఇస్లామిక్ దేశంతో మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకోవాలన్నది బీజింగ్ వ్యూహం. అదేవిధంగా పాక్‌లో నిర్మిస్తున్న ఆర్థిక నడవను కాబూల్‌కు విస్తరించాలన్నది చైనా ఆలోచన. అయితే ఇందుకు ఆఫ్ఘన్ సుముఖంగా లేదు. డ్రాగన్‌ను విశ్వసించజాలమన్నది అష్రఫ్ ఘని ఉద్దేశం.

➡ **పాకిస్తాన్ (మిత్రదేశం):** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని గిల్జిత్-బాల్టిస్తాన్ ప్రాంతంలో ఆర్థిక నడవను చేపట్టడం ద్వారా పాక్‌తో సంబంధాలను పటిష్టంచేసుకుంది. అయితే, ఆఫ్ఘన్-పాక్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద చొరబాట్లు తన సీపీఈసీ ప్రాజెక్టు కొంప ముంచే ప్రమాదం ఉందేమోనని ఇప్పుడు భయపడుతోంది.

ఒప్పందాలు : చైనా-పాకిస్తాన్ ఆర్థిక నడవ ప్రాజెక్టు నిర్మాణం. ఇందులో చైనా 55 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టింది.

➡ **నేపాల్ (తటస్థం):** ఇండో-చైనా యుద్ధం తర్వాత 1236కి.మీ సరిహద్దుపై 1963లో ఇరుదేశాల మధ్య ఒడంబడిక కుదిరింది. అయినా నేపాల్‌లో ప్రవహిస్తున్న లిపు సరస్సుపై ఇప్పటికీ వివాదం నడుస్తూనే ఉంది.

ఒప్పందాలు: వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకుంది. ఇది భారత ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్య. మొదటి నుంచీ నేపాల్‌కు దౌత్యపరంగానూ, వాణిజ్య అంశంలోనూ భారత్ పెద్ద దిక్కుగా ఉంది. ఈ స్థానాన్ని చైనా కబళించే ప్రయత్నం చేస్తున్నది. హైస్పీడ్ రైల్వే వ్యవస్థపై నేపాల్‌కు ఇండియా హామీ ఇచ్చింది.

➡ **భూటాన్ (తటస్థం) :** మొత్తం 760కి.మీ ఉమ్మడి సరిహద్దు. కాగా, తూర్పు, పశ్చిమ ప్రాంతంలోని 270 చ. కి.మీ. భూభాగంపై సరిహద్దు వివాదం ఉంది. తనకు సంబంధించిన డోక్లామ్ వివాదం నేపథ్యంలోనూ థింపూ ప్రభుత్వం సమతూకంగా వ్యవహరించింది.

➡ **మయన్మార్ (మిత్రదేశం):** ఆంగ్‌సాంగ్ సూకీ హయాంలో చైనాతో వాణిజ్య సంబంధాలు వృద్ధి చెందాయి. చైనాతో మైత్రికి ఆమె ఆసక్తి చూపారు. ప్రస్తుతం మయన్మార్‌లో చైనాయే కీలక భాగస్వామిగా ఉంది. ఓడరేవులు, రహదారులు, విద్యుత్ రంగాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. ఈదేశంతో బీజింగ్‌కు 2,185 కి.మీ సరిహద్దు ఉంది.

➡ **లావోస్ (మిత్రదేశం):** యువాన్ రజవంశంతో బీజింగ్ కు సత్సంబంధాలు ఉన్నాయి. మొదటి నుంచీ ఈ పేద దేశం ఎక్కువగా చైనాపైనే ఆధారపడుతూ వచ్చింది. ఒకప్పుడు మిలియన్ ఎలిఫెంట్స్ నేషన్‌గా లావోస్ ప్రసిద్ధి గాంచింది.

ఒప్పందాలు: మౌళిక రంగంతోపాటు అనేక కీలక రంగాల్లో చైనా పెట్టుబడులు ఉన్నాయి. నిరుపేద దేశమైన లావోస్ నుంచి జుంబోలను తరచూ కొనుగోలు చేస్తుంటుంది.

➡ **కజకిస్తాన్ (మిత్రదేశం):** 1783 కిలోమీటర్ల ఉమ్మడి సరిహద్దు కలిగివుంది. సరిహద్దు వివాదాల్లేని పొరుగుదేశమిదే. గతంలో కుదుర్చుకున్న ఒడంబడికలపై ఇరు దేశాలు సంతృప్తిగా ఉన్నాయి. రష్యాకు అత్యంత మిత్రదేశమైన కజకిస్తాన్, ప్రపంచంలోని చమురు నిల్వల్లో మూడో వంతు వాటా కలిగివుంది. చైనా చేపట్టిన ఒన్ బెల్ట్-ఒన్ రోడ్డు ప్రాజెక్టులో కీలకంగా ఉంది.

ఒప్పందాలు: సరిహద్దులో స్వేచ్ఛా వాణిజ్యం కొనసాగింపు. తమ పోర్టుల నుంచి చైనా కార్గోలకు గేట్‌వెను అనుమతించింది.

➡ **మంగోలియా (వ్యతిరేకి):** చైనాతో 4,677 కిలోమీటర్ల సుదీర్ఘ ఉమ్మడి సరిహద్దు. కొత్త అధ్యక్షుడు బట్టుల్గా అధికారం చేపట్టిన తర్వాత బీజింగ్‌తో వ్యూహాన్ని మార్చారు. డ్రాగన్‌పై అతిగా ఆధారపడే విధానాలకు క్రమంగా స్వస్తిపలుకుతున్నారు. 90 శాతం ఎగుమతులు, 30 శాతం దిగుమతులకు ఇప్పటి వరకు బీజింగ్‌తోనే జరుగుతున్నాయి. ఇకమీదట ఢిల్లీతో స్నేహం పొంపొందించుకోవాలని మంగోలియా పాలకులు భావిస్తున్నారు.

ఒప్పందాలు: గోబి ఎడారి నుంచి రష్యాకు రోడ్డు నిర్మాణానికి చైనా ప్రాన్ చేసింది. ఈ రోడ్డు మంగోలియా మీదుగా వెళ్తుంది. ఇందుకు సుమారు 30 బిలియన్ డాలర్లను వచ్చే కొద్ది సంవత్సరాల్లో పెట్టుబడులు పెట్టనుంది.

➡ **రష్యా (సంక్లిష్టం):** తన హయాంలో మాస్కో-బీజింగ్ మధ్య సంబంధాలు చరిత్రలోనే సువర్ణాధ్యాయంగా జిన్‌పింగ్ పేర్కొన్నారు. అయితే, రష్యాకు బయట దేశాల్లో నానాటికీ పెరుగుతున్న చైనా ప్రాబల్యం, పెట్టుబడుల విస్తరణ మాస్కోకు గట్టిపోటీగా పరిణమించింది. మాస్కోతో సుమారు 3,645 కి.మీ. ఉమ్మడి సరిహద్దును చైనా కలిగివుంది.

➡ **ఉ. కొరియా (మిత్రదేశం):** ఉమ్మడి సరిహద్దు విస్తీర్ణం రమారమి 1420 కి.మీ. బీకూ,జియాండో పర్వత ప్రాంతాలు మావేనంటూ చైనా ఆరోపిస్తున్నది. అయితే, ఆహారం నుంచి మిగతా విషయాలన్నింటిలోనూ ఉ.కొరియా ఎక్కువగా చైనాపైనే ఆధారపడివుంది. అయితే, నియంతలా వ్యవహరిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తీరుపై జిన్‌పింగ్‌కు ఓవైపు ఆందోళనగానే ఉంది. అమెరికా - ఉ.కొరియా ఉద్రిక్తలకు బీజింగ్ బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

➡ **ద. కొరియా (వ్యతిరేకి):** రెండు దేశాల మధ్య తూర్పు చైనా సముద్ర జలాల వివాదం ఉంది. మరొకవైపు అమెరికాకు తొత్తుగా వ్యవహిస్తూ, ఉత్తర కొరియాపై దూకుడు ప్రదర్శించడాన్ని బీజింగ్ ఆక్షేపిస్తున్నది. థాడ్ క్షిపణి నిరోధక వ్యవస్థ ఏర్పాటుపై ఆగ్రహంతో ఉంది.

➡ **జపాన్ (వ్యతిరేకి):** భౌగోళిక, ఆర్థిక అంశాల్లో ఈ రెండు దేశాలు పరస్పర బద్ధ శత్రువులుగా ఉన్నాయి. ప్రధానంగా సెంకాకు దీవులపై వివాదం ఇరువురి మధ్య వైరాన్ని పెంచుతోంది. దీనికి పరిష్కారంపై చైనా మొండిగా వ్యవహరించడాన్ని జపాన్ తీవ్రంగా ఆక్షేపిస్తున్నది.

➡ **తైవాన్ (వ్యతిరేకి):** అమెరికాతో తైపీ స్నేహంగా మెలగలడాన్ని బీజింగ్ జీర్ణించుకోలేకపోతున్నది. చైనా కరెన్సీ అమలు చేస్తున్న ఈ దేశానికి అగ్రరాజ్యం సైనిక సహాయాన్ని అందించడాన్ని చైనా వ్యతిరేకిస్తున్నది. 193 దేశాల ఐక్యరాజ్యసమితిలో 19దేశాల మద్దతుతో చైనా నుంచి విడిపోయి తైవాన్ ప్రత్యేక దేశంగా ఏర్పాటైంది.

➡ **ఫిలిప్పీన్స్ (మిత్రదేశం):** స్కార్బొరోషోల్ వివాదంలో చైనాను గట్టిగా వ్యతిరేకించింది. బీజింగ్‌కు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి ట్రిబ్యునల్‌లో కేసు కూడా వేసింది. అంతిమ తీర్పు ఫిలిప్పీన్స్‌కు అనుకూలంగా వచ్చింది. చైనాతో స్నేహంగా ఉంటున్నప్పటికీ, తమ దేశ ప్రయోజనాల విషయంలో మాత్రం రాజీ పడకుండా వ్యవహరిస్తోంది. ఇటీవల బీజింగ్ నోటి దురుసుపై అధ్యక్షుడు డుర్టటే ఘాటుగా సమాధానం చెప్పారు కూడా.

➡ **వియత్నాం (వ్యతిరేకి) :** ఆసియాలోని చైనా పొరుగు దేశాల్లో తెగువ కలిగిన దేశమిది. బీజింగ్ చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంలో ఏ మాత్రం వెనుకాడదు. అటు సరిహద్దు, ఇటు సముద్ర జలాల వివాదంలో చైనాతో ఢీ అంటే ఢీ అంటోంది. స్పెయిన్ సహకారంతో వంగ్వార్డ్ సముద్ర తీరంలో చమురు నిల్వలను వెలికితీసి, ఆర్థిక వనరులను సమకూర్చుకుంటోంది. అయితే ఈ చమురు క్షేత్రం మాదేనంటూ చైనా గొడవకు దిగింది. ఇటీవల వియత్నాం ప్రభుత్వం ఓఎన్‌జీసీతో ఒప్పందం కుదుర్చుకోవడాన్ని బీజింగ్ పాలకులు వ్యతిరేకించారు.

➡ మరోవైపు బ్రూనీ చైనాకు వ్యతిరేకిగా వ్యవహరిస్తుండగా, మలేసియా తటస్థంగా ఉంది. కొలంబియా మాత్రం బీజింగ్‌తో మిత్రత్వాన్ని కొనసాగిస్తున్నది. దీర్ఘకాలంగా చైనాతో భాగస్వామిగా ఉంది.

దక్షిణ చైనా సముద్ర జలాల వివాదం

ఎక్కడ?

ద.చైనా సముద్రంలోని చిన్న చిన్న దీవులు, వీటిల్లో ఉన్న సుమారు 750 ఇసుక రీఫ్‌పై నాలుగు దేశాలు హక్కుల కోసం పోరాడుకుంటున్నాయి. ఈ దీవులు చైనా తీరానికి 800 కి.మీ. దూరంలో ఉన్నాయి.

ఏమిటి?

ద.చైనా సముద్రాన్ని చైనా సైనిక స్థావరాలుగా మార్చేసింది. తొమ్మిది దీవుల్లో సైనిక సామగ్రిని, హార్డ్‌వేర్‌ను డంప్ చేసింది. మొత్తం 3200 ఎకరాల దీవులను ఏడు విభాగాలుగా చేసింది. పొరుగు దేశాలపై ఆధిపత్యానికి, యుద్ధ సమయాల్లో ఈ దీవులు చాలా వ్యూహాత్మకం. అందువల్ల చైనా ఆధిపత్యాన్ని మిగతా దేశాలు ఎంతమాత్రం సహించడం లేదు.

ఎందుకు?

➡ కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక స్థావరాల నుంచి చైనా ప్రతి ఏరియాను కవర్ చేయడానికి వీలవుతుంది. త్రిభుజాకారంలోని దీవుల నుంచి శత్రుదేశాలను లక్ష్యంగా చేసుకోడం బీజింగ్‌కు సులువైన చర్య. ఈశాన్యంలోని స్కాబోరో షోల్ మాత్రమే ఈ లక్ష్య పరిధిలోకి రాదు. ప్రధాన భూభాగానికి 650 కి.మీ. దూరంలో ఉన్న ఓ దీవికోసం ఫిలిప్పీన్స్‌తో చైనా గొడవకు దిగింది. చైనా వాదనను ఫిలిప్పీన్స్ ఎంతమాత్రం అంగీకరించడం లేదు.

➡ భారత్‌తో సహా చైనాతో 13 దేశాలు సరిహద్దును కలిగివున్నాయి

➡ 22,117 కిలోమీటర్ల మేరకు భూ సరిహద్దును కలిగివుంది.

➡ సముద్ర జలాల పరిధి 3.5 మెట్రిక్ చ.కిలోమీటర్లు


➡ మల్టీ బిలియన్ డాలర్ల ఆర్థిక నిల్వలు బీజింగ్ సామర్థ్యానికి ప్రతీక.

బీఆర్‌డీలో కొనసాతున్న చిన్నారుల మృత్యుఘోష

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని బాబా రాఘవ్‌దాస్ మెడికల్ కళాశాల (బీఆర్‌డీ) ఆస్పత్రిలో చిన్నారుల మరణాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో 290 మంది మృతి చెందగా... 27,28 తేదీల్లో 37 మంది చిన్నారులు చనిపోయినట్లు కళాశాల ప్రిన్సిపల్ పీకే సింగ్ తెలిపారు. వీరిలో 213 మంది ఐసీయూలో మరణించగా మిగతావారు మెదడువాపు వ్యాధితో చనిపోయారని వెల్లడించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 1250 మంది చిన్నారులు కన్నుమూశారన్నారు. మరణాలకు సంబంధించిన కారణాలను ఆయన వివరించారు. వివిధ రకాల సమస్యలతో చిన్నారులు ఆస్పత్రిలో చేరుతున్నారని, ముఖ్యంగా నెలలు నిండని చిన్నారులు, కామెర్లతో బాధ పడేవారు, మెదడు వాపు వ్యాధిగ్రస్తులు పరిస్థితి విషమించిన తరువాత ఇక్కడ చేరుతుంటారని తెలిపారు. సకాలంలో తీసుకొస్తే వారి ప్రాణాలు కాపాడుతామన్నారు. ఆగస్టు 12 న బీర్‌డీలో ఆక్సిజన్ అందక 60 మంది చిన్నారులు మరణించిన విషయం పాఠకులకు విదితమే. సీఎం యోగి ఆదేశాల మేరకు ఈ కేసు విచారణకు ఒక కమిటీని వేశారు.

హైదరాబాద్‌లో స్వైన్‌ఫ్లూ పంజా

● ఒకరు మృతి ● చికిత్స పొందుతున్న మరో ఏడుగురు



హైదరాబాద్, కెఎన్ఎన్ : స్వైన్ ఫ్లూ మహమ్మారి వాతావరణాలకు అనుగుణంగా తన శక్తిని పెంచు కుంటూ ఎండా, వాన అనే తేడా లేకుండా ప్రజలపై పంజా విసురుతుంది. తాజాగా సికింద్రాబాద్ నామాల గుండు ప్రాంతానికి చెందిన గణేశ్(65) తీవ్ర అనా రోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. ఎంతకీ వ్యాధి నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 28వ తేదీన గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అన్ని పరీక్షలు జరిపిన వైద్యులు స్వైన్ ఫ్లూ వైరస్ సోకిందని నిర్ధారించి, తగిన చికిత్స అందించారు. స్వైన్ ఫ్లూతో పాటు ఇతర అనారోగ్యాల కారణంగా గణేశ్ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడని స్వైన్ ఫ్లూ విభాగం వైద్యాధికారి డాక్టర్ నరేం దర్ తెలిపారు. స్వైన్ ఫ్లూ వైరస్ ప్రభావం ఉన్న వారు ఏడుగురు చికిత్స పొందుతుండగా ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, అతనిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్సలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. మిగిలిన వారికి మెరుగైన వైద్య అందజేస్తున్నట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ తెలిపారు. వ్యాధి లక్షణాలు కనపడగానే వెంటనే గాంధీ ఆసుపత్రికి లేదా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందాలని సూచించారు. చేతుల శుభ్రతతోపాటు జనసంచారం ఉన్న చోట ముక్కుకు మాస్క్ ధరించడం ఉత్తమమని వైద్యులు సూచించారు.

కేబినెట్ విస్తరణకు అన్నాడీఎంకే బ్రేకులు

● సెప్టెంబర్ 1, 2 తేదీల్లో విస్తరణకు కేంద్రం సన్నాహాలు

● ఐదుగురు సహాయ మంత్రులకు పదోన్నతలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు అన్నా డీఎంకే పార్టీ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆ పార్టీలో రెండు చీలిక వర్గాలను ఏకం చేసినప్పటికీ, రాజకీయ సంక్షోభం ఇంకా ఒక కొలిక్కి రాకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న ఈ. పళని స్వామి, మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీరుసెల్వం వర్గాలు విలీనమైనప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కా రం కాలేదు. పార్టీలో కొందరు ఇప్పటికీ శశికళ వర్గం నేత టీటీవీ దినకరన్‌కు మద్ధతు తెలపడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. సుమారు 23 మంది ఎమ్మెల్యేలు దినకరన్‌కు బహి రంగంగానే మద్దతు ప్రకటిస్తూ, ముఖ్యమంత్రిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేయగా, ఇంకా చాలామంది 'స్లీపర్ సెల్స్'గా ఉన్నారంటూ దినకరణ్ బాంబు పేల్చాడు. ముఖ్యమంత్రిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ బలపరీక్ష నిర్వహించాల్సిందిగా దినకరన్ వర్గం గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావును కోరినప్పటికీ, ఆయన నిరాకరించి తాత్కాలికంగా సమస్యను గట్టెక్కించారు. అయితే ఇప్పుడు దినకరన్ వర్గానికి తోడు డీఎంకే పార్టీ కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా బలపరీక్షకు సిద్ధమవడం అన్నా డీఎంకే వర్గాన్ని కలవరపెడు తోంది. మొత్తం పార్టీలో నెలకొన్న ఈ అంతర్గత సమస్యలతో కేంద్ర కేబినెట్ విస్తరణకు జాప్యం జరుగుతోంది.

నిజానికి సోమ, మంగళవారాల్లోనే కేంద్ర కేబినెట్ విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు గతంలోనే వెల్లడించాయి. అయితే అన్నా డీఎంకేలో నెలకొన్న సంక్షోభమే ఈ కాస్త జాప్యానికి కారణమవుతుందని, అయినా సరే సెప్టెంబర్ 1 లేదా 2 తేదీల్లో కేంద్ర కేబినెట్ విస్తరణ, పునర్వ్యవస్థీక రణ ఉంటాయని ప్రభుత్వం లో సీనియర్ నేతలు చెబుతు న్నారు. ఈసారి విస్తరణలో అన్నా డీఎంకేతో పాటు జేడీ(యూ) కూడా చేరనున్న విష యం తెలిసిందే. ఈ రెండు పార్టీలతో పాటు ఎన్సీపీ సైతం చేరుతుందన్న కథనాలు వినిపిస్తున్నాయి.

అన్నా డీఎంకేతో బహుళ ప్రయోజనాలు

పార్లమెంటు ఉభయ సభల్లో 50 మంది సభ్యుల బలం ఉన్న అన్నా డీఎంకేని చేర్చుకోవడం ద్వారా ఎన్డీయేకు బహుళ ప్రయోజనాలున్నాయని నేతలు విశ్లేషిస్తున్నారు. రాజ్యసభలో పూర్తిస్థాయిలో బలం లేని ఎన్డీయేకు, అన్నా డీఎంకే ద్వారా ఏకంగా 12 మంది సభ్యుల బలం పెరుగుతుంది. ప్రభుత్వం తీసుకొచ్చే అనేక బిల్లులకు బ్రేకులు వేస్తున్న రాజ్యసభలో బలం పెంచుకోవడంపై దృష్టి పెట్టిన బీజేపీకి అన్నా డీఎంకే పార్టీ ఒక పెద్ద అవకాశంగా నిలుస్తోంది. ఇదిలా ఉంటే తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీకి బలం పెంచుకోడానికి అన్నా డీఎంకేతో పొత్తు లాభిస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.

రైల్వే శాఖపై జేడీ(యూ) కన్ను

కేంద్ర కేబినెట్‌లో ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి బెర్తులు ఖరారు చేసుకున్న జేడీ(యూ) పార్టీ ఏకంగా రైల్వేశాఖపైనే కన్నేసినట్టు తెలుస్తోంది. వరుస రైలు ప్రమాదాలతో మనస్తాపం చెంది రాజీనామా సిద్ధపడిన సురేశ్ ప్రభు వ్యవహారంతో ఈ శాఖ మార్పిడి ఖాయమని తెలుస్తోంది. అయితే రైల్వేశాఖపై బిహారీలకు ఉన్న ఆసక్తి చాలా ఎక్కువ. గతంలో లాలూ ప్రసాద్ ప్రసాద్ యాదవ్ కూడా యూపీఏ హయాంలో రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. జేడీ(యూ) కూడా ఆనవాయితీ కొనసాగి స్తూ రైల్వే మంత్రి పదవి కోసం పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. జేడీ(యూ) నుంచి కేంద్ర మంత్రి పదవుల కోసం ఇద్దరి పేర్లను ఖరారు చేసింది. ఆ పార్టీ రాజ్యసభ నేత రామచంద్ర ప్రసాద్ సింగ్‌తో పాటు పూర్ణియా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైన సంతోష్ కుమార్ కష్వాహా పేర్లను ఆ పార్టీ ప్రతిపాదించగా, ఇద్దరికీ పాలనా అనుభవం లేకపోవ డం వల్ల కీలకమైన రైల్వే శాఖను ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. కేబినెట్ పదవి కాకపోయినా కనీసం సహాయ మంత్రి పదవైనా ఇవ్వాలని పట్టుబడుతు న్నట్టు సమాచారం.



సమర్థతకే పెద్దపీట

మరోవైపు సరైన పనితీరు కనబర్చని కేంద్ర మంత్రులకు ఉద్వాసన పలికి పార్టీ బాధ్యతలు లేదా మరే ఇతర బాధ్యతలైనా అప్పగించే అవకాశముంది. ఈ క్రమంలో 75 ఏళ్లు పైబడిన కారణంగా కల్‌రాజ్ మిశ్రా, పార్టీ బాధ్యతలు అప్పగించాలన్న ఉద్దేశంలో భాగంగా రాజీవ్ ప్రతాప్ రూఢీ, నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా, సరైన పనితీరు లేనందున సంజీవ్ కుమార్ బల్యాన్, కృష్ణరాజ్‌లకు ఉద్వాసన పలికే సూచనలు కనిపిస్తున్నాయి. అలాగే సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన 13 మంది సహాయ మంత్రులకు పదోన్నతులు లేదా మరింత కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రదాన్, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, ప్రకాశ్ జవడేకర్, జితేంద్ర సింగ్‌లకు ప్రమోషన్ ఇవ్వాలని ప్రధాని మోడీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో ప్రకాశ్ జవడకేర్ గత కేబినెట్ విస్తరణలోనే సహాయ మంత్రి నుంచి కేబినెట్ మంత్రిగా పదోన్నతి పొందగా, ఈ సారి మరింత కీలకమైన శాఖను అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మిజోరాం పార్లమెంటరీ కార్యదర్శుల మూకుమ్మడి రాజీనామా

● ఆమోదించిన సీఎం లాల్ థన్వాల్

అజ్‌వాల్: మిజోరాం ప్రభుత్వం నియమించిన ఏడుగురు పార్లమెంటరీ కార్యదర్శులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పార్లమెంటరీ కార్యదర్శులను నియమించే అధికారం రాష్ట్రప్రభుత్వాకి సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తమ రాజీనామాలను సీఎం లాల్ థన్వాల్‌కు సమర్పించారు. కేఎస్ తంగా, హెచ్ జోతాంగిలియానా, జడ్ఎస్ జుఆలా, కె లరిన్‌తంగా, టీటీ జ్యోత్సంగా, ఖయంగేట్, జోసెఫ్ ల రాజీనామాలను బుధవారం సీఎం ఆమోదించారు. జస్టిస్ జే చలమేశ్వర్, జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, జస్టిస్ ఎఎమ్ సప్రెలతో కూడిన ధర్మాసనం పార్లమెంటరీ కార్యదర్శులను నియమించే అర్హత అసోం శాసనసభకు లేదని పేర్కొంది. వారి నియామకం రాజ్యాంగ విరుద్ధమని తెలిపింది. మిజోరాం శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజీనామా చేసిన వారిని పార్టీ కార్యదర్శులుగా నియమిస్తామని మిజోరాం పీసీసీ ప్రకటించింది. ఇప్పటికే మాజీ మంత్రులిద్దరు ఎంపీసీసీ జనరల్ సెక్రటరీలుగా కొనసాగుతున్నారు.

స్కూల్‌కు తాళం వేసి లోపల బైఠాయించిన విద్యార్థులు

ఛత్తర్‌పూర్: ఛత్తర్‌పూర్‌లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం నడుపుతున్న పాఠశాల విద్యార్థు లు గేటుకు తాళంవేసి లోపల బైఠాయిం చారు. స్కూల్‌కు కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. నహర్‌పూర్‌లోని పాఠశాల స్థాయిని ప్రభుత్వం (అప్‌గ్రేడ్) పెంచింది. గత 30 ఏళ్లుగా కేవలం నాలుగు గదులు మాత్రమే ఉన్నాయని.. కొత్త భవ నాలు నిర్మించాలని స్థానికులు గతంలోనే కోరారు. ఈ పాఠశాల ప్రారంభంలో 8 వతరగతి వరకు ఉండేది. 1987లో 10 వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. 2013లో హైయ్యర్ సెకండరీ (సీబీఎస్ఈ 12) వరకు స్థాయిని పెంచినట్లు విద్యార్థులు తెలిపారు. ప్రస్తుతం ఈ స్కూల్లో 450 మంది విద్యార్థులున్నారు. నాలుగు గదుల్లో పాఠశాల నిర్వహించడం చాలా కష్టంగా ఉందని ప్రభుత్వానికి అనేక సార్లు వినతిపత్రాన్ని సమర్పించిట్లు స్థానిక సర్పంచ్ జైరామ్ పటేల్ తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో విద్యార్థులు పాఠశాల గేటుకు తాళం వేసి లోపలే ఉండి నిరసన తెలుపుతున్నారని పటేల్ అన్నారు. మా డిమాండ్ నెరవేరేంతవరకు ధర్నా చేస్తామని పటేల్ సోమవారం ప్రకటించారు. గత వారంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. రాష్ట్రంలో అనేక స్కూళ్లలో మౌలిక సదుపాయాలు లేవని.. స్కూళ్ల అభివృద్ధికి రూ. 85 కోట్లు కేటాయించామని.. త్వరలోనే నహర్‌పూర్ పాఠశాల విద్యార్థులు డిమాండ్లను పరిష్కరిస్తామని విద్యాశాఖ మంత్రి దీపక్ జోషి తెలిపారు.

ఆంధ్రప్రభ క్రీడాప్రభ

ఇది ధోనీ ప్రత్యేకం

● '300' ముంగిట మహి ● అందరి కళ్లూ అతనిపైనే ● నేడు లంకతో నాలుగో వన్డే



మహేంద్ర సింగ్ ధోని.. 299 వన్డేలు.. 90 టెస్టులు... 77 టీ20లు. 50 ఓవర్ల గేమ్‌లో అత్యుత్తమ ఫినిషర్‌గా తిరుగులేని రికార్డు. రెప్పపాటు కాలంలో కళ్లు చెదిరే స్టంపింగ్స్.. కీపింగ్‌లో ప్రపంచ రికార్డు. కెప్టెన్‌గానూ చరిత్రాత్మక విజయాలు. రెండు ప్రపంచ కప్‌లు. 36 ఏళ్ల వయసులోనూ యువకులతో పోటీపడి పరిమిత ఓవర్ల క్రికెట్లో మెరుపు ఇన్నింగ్స్. లంకపై చివరి రెండు వన్డేల్లోనూ అజేయంగా నిలిచి తనలో చేవ తగ్గలేదని చాటిన మిస్టర్ కూల్.. మరో మైలురాయి ముంగిట నిలిచాడు. అది.. వన్డేల్లో '300' క్లబ్. ఇపప్పటివరకు ఐదుగురు భారత ఆటగాళ్లకే సాధ్యమైన ఫీట్. గురువారం కొలంబోలో లంకతో జరిగే నాలుగో డేనైట్ వన్డేతో ఆ ఐదుగురు దిగ్గజాల సరసన చేరబోతున్నాడు. ఈ వన్డే ధోనీ ప్రత్యేకం. ఇపుడు అందరి కళ్లూ మహిపైనే. మరో మరపురాని ప్రదర్శనతో 300వ వన్డేను చిరస్మరణీయం చేసుకుంటాడా! టీమ్ఇండియా ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో ఘనంగా గెలిచి మాజీ సారథికి జోహార్ అర్పిస్తారా! చూడాలి.

కొలంబో: కోహ్లి సేన మరో పంచ్‌కు సిద్ధమైంది. మాజీ సారథి మహికి అపురూపమైన వన్డేలో... ఇప్పటికే చప్పగా చతికిలపడ్డ శ్రీలంకపై మరో బలమైన పంజా విసిరేందుకు సమాయత్తమైంది. గత రెండు మ్యాచ్‌లలోనూ ఛేజింగ్‌లో జట్టు కష్టకాలంలో ఉన్నపుడు మిస్టర్ కూల్.. కూల్‌గా ఆడి అజేయంగా నిలిచి వరుస విజయాలను సాధించిపెట్టాడు. రెండో వన్డేలో 45, మూడో వన్డేలో 67 పరుగులు సాధించాడు. ఆ క్రమంలో 2019 ప్రపంచకప్‌పై కన్నేశాడు.

ప్రపంచంలోనే అత్యుత్తమ ఫినిషర్ అయిన ధోని.. రెండో వన్డేలో భువనేశ్వర్‌కు, మూడో వన్డేలో రోహిత్‌కు తోడ్పాటునందించాడు. ఒకవైపు టాప్‌ఆర్డర్‌ను కకావికలు చేసిన దనంజయ సైతం ధోనీపై ఒత్తిడి పెంచలేకపోయాడు. వన్డేల్లో తొలి అర్థశతకం సాధించేలా భువీని మహి ప్రోత్సహించాడు.

బెంచ్ కదిలేనా: టీమ్ఇండియా ఇప్పటికే సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న నేపథ్యంలో రిజర్వు బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లకు చివరి రెండు వన్డేల్లోనైనా ఆడే అవకాశం వస్తుందా!. బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లు కుల్‌దీప్ యాదవ్, మనీష్ పాండే, అజింక్య రహానే, శార్దూల్ ఠాకుర్‌లకు అవకాశమివ్వాలని కెప్టెన్ విరాట్ భావిస్తున్నాడు. కోహ్లి కూడా గత రెండు మ్యాచ్‌లలో పెద్దగా స్కోర్లు చేయలేదు. రాహుల్‌తో పాటు తను కూడా ఫామ్‌ను అందుకోవాలని, పరుగుల వరద పారించాలని కృతనిశ్చయంతో ఉన్నాడు. నాలుగో నంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగుతున్న రాహుల్ ఆ స్థానంలో కుదురుకున్నట్లు కనిపించడం లేదు. వరుసగా డకౌట్లు అవుతున్న కేదార్ జాదవ్‌పైనా ఒత్తిడి ఉంది. దనంజయ బౌలింగ్‌ను చదవడంలో అతను మరీ ఘోరంగా విఫలమయ్యాడు. ఆ నేపథ్యంలో జాదవ్‌కు బదులు మనీష్ పాండేకు అవకాశం ఇస్తారా అన్నది ఆసక్తికరం. ఐతే జీవం లేని పిచ్‌లే జాదవ్ స్థానాన్ని కాపాడాలి. జాదవ్ తుది జట్టులో ఉంటే కోహ్లికి మరో బౌలింగ్ అవకాశం ఉంటుంది. సిరీస్‌లో ఇంతవరకు జాదవ్ మూడు వికెట్లు తీశాడు.

ఠాకుర్ నిరీక్షణనేనా!: నెట్స్‌లో పదునైన బంతులు వేస్తున్న ముంబయి పేసర్ శార్దూల్ ఠాకుర్‌కు నిరీక్షణ తప్పేట్టు లేదు. భువనేశ్వర్, బుమ్రా కేవలం మూడు మ్యాచ్‌లే ఆడడంతో వారిని తప్పించి ఠాకుర్‌ను తీసుకునే అవకాశాలు లేవనే చెప్పాలి. ఐతే యువకులకు రొటేషన్ విధానంలో అవకాశమిస్తామని టీమ్ మేనేజ్‌మెంట్ అంటున్న నేపథ్యంలో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను కోహ్లి పరీక్షించి చూడవచ్చు. చచల్ లేదా అక్షర్‌లలో ఒకరు కుల్‌దీప్‌కు దారివ్వాల్సివుంటుంది.

మరిన్ని కష్టాల్లో లంక: ఓ వైపు భారత్‌కు సంతోషకరమైన సమస్యలుంటే.. ఆతిథ్య జట్టు మాత్రం జయసూర్య నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ రాజీనామా చేయడంతో కష్టాల్లో పీకల్లోతు కూరుకుపోయింది. అసలు లంక జట్టు యాజమాన్యం సమర్థమైన తుది పదకొండు మందిని బరిలోకి దించలేకపోతోంది. శ్రీలంక క్రికెట్ బోర్డు ఆయన రాజీనామాను ఆమోదించింది. సిరీస్ ముగిసేవరకు కమిటీ పదవుల్లో ఉంటుంది. ఐతే కమిటీ ఎంపికలపై ఇక తీక్షణ చూపులుంటాయి. జయసూర్య సారథ్యంలోని కమిటీ ఎంపికలో నిలకడ లోపించడమే సమస్యకు అసలు కారణం. గత ఏడాదిగా వారు 40 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది.

300 క్లబ్‌లో..

సచిన్ టెండూల్కర్	463
రాహుల్ ద్రవిడ్	344
అజహరుద్దీన్	334
సౌరభ్ గంగూలీ	311
యువరాజ్ సింగ్	304

పిచ్: ప్రేమదాస మైదానంలోని వికెట్ భారీ స్కోర్లు సాధ్యం కాకపోవచ్చు. గత రెండు మ్యాచ్‌లలో అత్యధికస్కోరు 288 పరుగులు. మరో 3 మ్యాచ్‌లలో 230 కంటే తక్కువ స్కోర్లు నమోదయ్యాయి.

వాతావరణం: ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. దీనివల్ల ఓవర్లు కోతకు గురి కావచ్చు.

నాలుగో వన్డేకు కూడా ఇదే విధానం అమలు కావచ్చు.

చండిమాల్, కపుగెదెర దూరం : కుడి బొటన వేలు గాయంతో దినేష్ చండిమాల్, వెన్ను గాయంతో తాత్కాలిక కెప్టెన్ కపుగెదెర తక్కిన సిరీస్‌కు దూరమయ్యారు. నాలుగో వన్డేలో లసిత్ మలింగ జట్టు పగ్గాలు చేపడతాడు. నిషేధానికి గురైన కెప్టెన్ ఉపుల్ తరంగ ఐదో వన్డేకల్లా (సెప్టెంబరు 3) జట్టులోకి వస్తాడు. 6న టీ20 మ్యాచ్ జరుగుతుంది. కపుగెదెర, చండిమాల్‌ల స్థానంలో ధనంజయ డిసిల్వ, దిల్షాన్ మునవీరలను ఎంపిక చేశారు. బెంచ్‌పై థిసారా పెరీర, వనిందు హసరంగ ఉండనే ఉన్నారు.

తుది జట్లు (అంచనా): భారత్: ధావన్, రోహిత్, విరాట్ (కెప్టెన్), రాహుల్, మనీష్, ధోని , పాండ్య, అక్షర్, శార్దూల్, కుల్‌దీప్, బుమ్రా.

శ్రీలంక: దిల్షాన్ మునవీర, డిక్వెల (కీపర్), కుశాల్, తిరిమానె, మాథ్యూస్, సిరివర్ధన, వనిందు హసరంగ, చమీర, దనంజయ, ఫెర్నాండో, మలింగ.



బంగ్లా సంచలనం

● ఆసీస్‌పై చరిత్రాత్మక విజయం ● ఒంటిచేత్తో గెలిపించిన షకిబుల్

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 109-2 స్కోరుతో ఆడుతోంది. విజయానికి మరో 156 పరుగులు చేయాలి. ఇంకా 8 వికెట్లు చేతిలో ఉన్నాయి. కానీ అంతర్జాతీయ క్రికెట్లో 14 గంటల్లోనే మరో సంచలనం. మొదటిది లీడ్స్‌లో వెస్టిండీస్‌దయితే.. రెండో సంచలనం.. టెస్టు క్రికెట్‌లో అందరూ ఇంకా పసికూనగానే భావించే బంగ్లాదేశ్‌ది. టెస్టు క్రికెట్‌లో మేరునగధీర ఆస్ట్రేలియాకే ఈ పసికూన షాకిచ్చింది. బుధవారం ఆసీస్‌పై చరిత్రాత్మక తొలి విజయాన్ని దక్కించుకుంది. బంగ్లాదేశ్‌తో సిరీస్ కోసం ఎన్నో కసరత్తులు చేసి వచ్చిన స్మిత్ సేనకు తొలి టెస్టులో భంగపాటు తప్పలేదు. ఆల్‌రౌండర్ షకిబుల్ హసన్ (10-153) బంగ్లా చిరస్మరణీయ విజయానికి కర్త, కర్మ, క్రియ అయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లోనూ ఐదేసి వికెట్ల ప్రదర్శనతో బంగ్లాకు అపూర్వ విజయాన్ని కట్టబెట్టాడు. వ్యక్తిగతంగా అరుదైన రికార్డునూ దక్కించుకున్నాడు. అతని విజృంభణలో తొలి టెస్టులో ఆసీస్‌పై బంగ్లా 20 పరుగుల తేడాతో గెలిచింది. 265 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ బుధవారం నాలుగో రోజు 244 పరుగులకు ఆలౌటైంది. షకిబుల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బంగ్లా 1-0 ఆధిక్యం సాధించింది.

మిర్పూర్: ఆసీస్ విజయానికి 265 పరుగులు కావాలి. మంగళవారం ఆట ఆఖరుకు రెండు వికెట్లు కోల్పోయినా 109 పరుగులు సాధించి విజయం వైపు పయనిస్తున్నట్లనిపించింది. కానీ బుధవారం ఉదయం అనేక నాటకీయ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఓపెనర్ డేవిడ్ వార్నర్ 75 పరుగులతో కెప్టెన్ స్మిత్ 25 పరుగులతో క్రీజులోకి వచ్చారు. వార్నర్ (112, 135 బంతుల్లో, 16 ఫోర్లు, 1 సిక్స్) టెస్టుల్లో 19వ సెంచరీ సాధించి జోరుమీదున్నాడు. స్మిత్ (37, 99 బంతుల్లో, 3 ఫోర్లు) క్రీజులో పాతుకుపోయి వార్నర్‌కు తోడ్పాటునందిస్తున్నాడు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 130 పరుగులు జత చేశారు. ఆసియాలో నాలుగో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కిదే అత్యుత్తమ భాగస్వామ్యం. బండి నిదానంగా గెలుపు వైపు అడుగులు వేస్తున్నట్లే కనిపించింది. 158-2తో గెలుపు దిశగా ఆసీస్ దూసుకుపోతున్నట్లే కనిపించింది. సరిగ్గా అదే దశలో ఆసీస్‌ను తొలి దెబ్బ తీశాడు. అదీ ఆసీస్ కోలుకోలేని దెబ్బ. వార్నర్‌ను ఎల్బీగా వెనక్కి పంపాడు. వార్నర్ ఔట్‌తో ఆసీస్ పతనానికి నాంది పడింది. పతనం ఎంత వేగంగా సాగిందంటే.. 86 పరుగులకే తక్కిన 7 వికెట్లు కోల్పోయింది. వాటిలో మూడు షకిబుల్‌వే. పిచ్ విపరీతంగా టర్న్ కావడం, బౌన్స్‌లో భిన్నంగా ఉండడంతో ఆసీస్ బ్యాట్స్‌మెన్‌కు బ్యాటింగ్ అసాధ్యమైంది. చివర్లో పాట్ కమిన్స్ (33 నాటౌట్) పోరాడినా ఆసీస్ విజయానికి అది చాలలేదు.

ఇది మూడో విజయం: ఏడాది కాలంలో మేటి జట్లపై బంగ్లాకిది మూడో విజయం. ఇంతకుముందు ఇంగ్లాండ్, శ్రీలంకలపై గెలిచింది. ఈ టెస్టు ఇటు తమిమ్ ఇక్బాల్‌కు, అటు షకిబుల్‌కు కూడా 50వది. తమిమ్ 71, 78 స్కోర్లు సాధించగా, షకిబుల్ తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు సాధించి, 5 వికెట్లు దక్కించుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి చిరస్మరణీయ విజయాన్ని లిఖించాడు.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 260, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 217, **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** 221, **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** వార్నర్ (ఎల్బీ) (బి) షకిబుల్ 112, రెన్‌షా (ఎల్బీ) (బి) హసన్ మిరాజ్ 5, ఖవాజా (సి) తైజుల్ (బి) షకిబుల్ 1, స్మిత్ (సి) రహీం (బి) షకిబుల్ 37, హ్యాండ్స్‌కాంబ్ (సి) సౌమ్య శేఖర్ (బి) తైజుల్ 15, మాక్స్‌వెల్ (బి) షకిబుల్ 14, వేడ్ (ఎల్బీ) (బి) షకిబుల్ 4, అగర్ (సి అండ్ బి) తైజుల్ 2, కమిన్స్ నాటౌట్ 33, లియోన్ (సి) సౌమ్య (బి) తైజుల్ 12, హాజల్‌వుడ్ (ఎల్బీ)(బి) తైజుల్ 0, ఎక్స్‌ట్రాలు 9, మొత్తం (70.5 ఓవర్లలో ఆలౌట్) 244, వికెట్ల పతనం: 1-27, 2-28, 3-158, 4-171, 5-187, 6-192, 7-195, 8-199, 9-228, 10-244, **బౌలింగ్:** మిరాజ్ 19-3-80-2, నాజిర్ 3-2-2-0, షకిబుల్ 28-7-85-5, తైజుల్ ఇస్లామ్ 19.5-2-60-3, రహమాన్ 1-0-8-0

ధోనీతో సెల్ఫీ కోసమని..

కొలంబో: ధోనీ బుధవారం ఇక్కడి మైదానంలో బ్యాటింగ్ ప్రాక్టీసు చేస్తుండగా ఓ లంక అభిమాని ఆ ప్రాంతానికి వచ్చాడు. దాంతో ధోని ప్రాక్టీసుకు అంతరాయం ఏర్పడింది. ధోనిని సెల్ఫీ కోసం కోరాడు. మైదానం సిబ్బంది అయిన ఆ అభిమానితో ధోని ఏమీ అనుకుండా ప్రశాంతంగా సెల్ఫీ దిగాడు. ఇక చాలు వెళ్లిపొమ్మని చెప్పాడు. కానీ భద్రతా సిబ్బంది కన్ను గప్పి వచ్చిన ఆ అభిమాని కరచాలనం ఇస్తున్న ఫోజులో మరో సెల్ఫీ కోరాడు. ఇంతలో భారత జట్టు సిబ్బంది అక్కడికి హుటాహుటిన వచ్చి అతణ్ని అక్కడి నుంచి పంపేశారు.

భద్రత కట్టుదిట్టం: గురువారం నాటి వన్డే కోసం కొలంబో మైదానంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మూడో వన్డేలో తమ జట్టు ఓటమి అంచుల్లో ఉండగా లంక అభిమానులు అల్లరికి దిగిన నేపథ్యంలో నాలుగో వన్డేకు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. అదనంగా 1000 మంది పోలీసు సిబ్బందిని తరలించారు.



పీవీ సింధుకు సీఎం చంద్రబాబు సత్కారం

విజయవాడ, ఆంధ్రప్రభ : ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన ప్రముఖ క్రీడాకారిణి పివి సింధూ, కోచ్ గోపీచంద్‌లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ ఫైనల్ పోటీలో కొద్దిపాటి తేడాతో ఓడిపోయినా, మంచి ప్రతిభ కనబరిచారని సింధూ క్రీడా ప్రతిభను కొనియాడారు. 'బెటర్ లక్ నెక్ట్స్' 'ఆల్ ది బెస్ట్' అని భుజంతట్టి ప్రోత్సహించారు.

హ్యాడ్లీ తర్వాత షకిబే



షకిబుల్ హసన్.. పదేళ్లుగా బంగ్లాదేశ్ క్రికెట్‌కు ముఖచిత్రంగా ఉన్నాడు. బంగ్లా సాధించిన అనేక విజయాల్లో అతని పాత్ర అమేయం... అద్వితీయం. ఒకరకంగా చెప్పాలంటే.. బంగ్లా చిరు జట్టుకు అతను వన్‌మ్యాన్ ఆర్మీ. అంతగా విజయాలు సాధిస్తున్నాడు కాబట్టే.. షకిబ్ ఐసీసీ ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రపీఠంపై కూర్చున్నాడు. 50 టెస్టుల్లో 186 వికెట్లు, 177 వన్డేల్లో 224 వికెట్లు. ఇంత నిలకడగా ఆడే మేటి ఆల్‌రౌండర్ మనకూ ఉంటేనా అని ప్రతి జట్టు కోరుకునే ఆటగాడు షకిబుల్. ఆసీస్‌పై విజయంతో షకిబుల్ ఖాతాలో మరెన్నో రికార్డులు వచ్చి చేరాయి. వాటిలో ప్రముఖమైంది.. ఒకే టెస్టులో అర్థసెంచరీ... పది వికెట్ల ప్రదర్శన ఒకటి కంటే ఎక్కువ సార్లు సాధించిన ఘనతను న్యూజిలాండ్ దిగ్గజం రిచర్డ్ హ్యాడ్లీ, షకిబుల్ మాత్రమే సొంతం చేసుకున్నారు. హ్యాడ్లీ మూడు సార్లు ఈ ఫీట్ చేశాడు.

నా భార్యకు కృతజ్ఞతలు

''ఆసీస్‌పై గెలుస్తామని నిన్న రాత్రి అనుకోలేదు. 'నీవు రేపు బంగ్లాను గెలిపిస్తావు' అని నా భార్య నాతో అంది. నాపై నమ్మకం ఉంచిన నా భార్యకు కృతజ్ఞతలు. జట్టు విజయంలో పాలు పంచుకున్నందుకు సంతోషంగా ఉంది. అభిమానులు మాకు మద్దతివ్వడానికి వస్తున్నారు. మనం గెలుస్తామన్న విశ్వాసంతోనే వారు మైదానంలోకి వస్తున్నారని సహచరులకు చెప్పాను. వారి నమ్మకాన్ని నిజం చేద్దామన్నాను'' - **షకిబుల్**

ఇవీ రికార్డులు

4: టెస్టులు ఆడే అన్ని దేశాలపైనా ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన నాలుగో బౌలర్ షకిబ్. గతంలో స్టెయిన్, మురళీ, హెరాత్ ఈ ఘనత సాధించారు.

5: 50వ టెస్టులో 5 వికెట్ల ప్రదర్శన చేసిన బౌలర్ షకిబ్. ఇతనికంటే ముందు బెయిలీ, హ్యాడ్లీ, మురళి, హర్భజన్ ఉన్నారు.

10: బంగ్లాదేశ్‌కు 101 టెస్టుల్లో 10వ విజయం. ఆ ప్రత్యర్థి జట్లలో ఆసీస్ ఐదవది.


హర్యానాపై ముంబా గెలుపు



ముంబయి: కెప్టెన్ అనూప్‌కుమార్ (8), రైడర్ శ్రీకాంత్ జాదవ్ కలిసి 14 పాయింట్లు గెలవడంతో యు ముంబా 38-32 తేడాతో హర్యానా స్టీలర్స్‌పై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఉదాసీనంగా ఆడిన హర్యానా మూల్యం చెల్లించుకుంది. పాయింట్లు సాధించడంలో డిఫెన్స్ కూడా తంటాలు పడింది. హర్యానా తరపున వికాస్ కండోల 9 పాయింట్లు సాధించాడు. ముంబా 10 మ్యాచ్‌లలో 24 పాయింట్లతో ఏ జోన్‌లో మూడో స్థానంలో నిలిచింది. హర్యానా 7 మ్యాచ్‌లలో 23 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో ఉంది.

ఓటమి అంచుల్లోంచి..

● ఫెదరర్ గెలుపు ● నాదల్ అలవోకగా ముందంజ ● యుఎస్ ఓపెన్



న్యూయార్క్: ప్రపంచ నెంబర్ మూడు రోజర్ ఫెదరర్.. ఓటమి అంచుల్లోకి వెళ్లివచ్చాడు. యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఫెదరర్.. అమెరికా టీనేజర్ టియాఫోతో తీవ్రంగా పోరాడి గెలిచి ఊపిరి తీసుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ ఐదు సెట్ల పోరులో ఫెదరర్ 4-6, 6-2, 6-1, 1-6, 6-4తో చమటోడ్చి గెలిచాడు. తొలి సెట్‌నే కోల్పోయిన ఫెదరర్ తర్వాత పుంజుకొని వరుసగా రెండు సెట్లు సొంతం చేసుకున్నాడు. కానీ నాలుగో సెట్లో ఫెదరర్ మరీ పేలవంగా ఆడాడు. దీంతో పోరు నిర్ణాయక ఐదో సెట్‌కు దారితీసింది. ఆ సెట్లో పుంజుకొని సెట్‌ను, మ్యాచ్‌ను ఫెడ్డీ గెలుచుకున్నాడు. వీరిద్దరి పోరు 2గంటల 35 నిమిషాల పాటు నువ్వానేనా అన్నట్లు సాగింది. ''బాగా పోరాడాం. చాలా ఉత్కంఠగా ఉంది. అందుకే నేను ఇక్కడికి వస్తాను. టియాఫోకి మంచి కెరీర్ ఉంటుంది'' అని ఫెదరర్ అన్నాడు. ''అతను గొప్ప ఆటగాడు. బాగా పోరాడాడు. మంచి భవిష్యత్తు ఉంది'' అని కితాబిచ్చాడు.

కాగా మరో తొలి రౌండ్ పోరులో సునాయాసంగా గెలిచి స్పెయిన్ బుల్, ప్రపంచ నెంబర్ వన్ రఫెల్ నాదల్... ఫెదరర్ వైపు మొదటి అడుగు వేశాడు. ఈ రౌండ్లో నాదల్ 7-6 (6), 6-2, 6-2 తేడాతో డుసాన్ లజొవిక్‌పై సునాయాసంగా గెలిచాడు. ''ఈ రోజు గెలిచాను. అదే నాకు ప్రాధాన్యం'' అని విలేకర్లతో నాదల్ అన్నాడు.

ఎలీనా స్వితోలినా ముందంజ: మహిళల సింగిల్స్ తొలి రౌండ్ పోరులో ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్వితోలినా చెమటోడ్చి గెలిచింది. తొలి గ్రాండ్ స్లామ్ కోసం తహతహలాడుతున్న ఈ నాలుగో సీడ్ 6-0, 6-7 (5-7), 6-3తో కష్టపడి 42వ ర్యాంకర్ కతెరినా సినియాకోవా (చెక్)పై గెలిచింది.



ఎలీనా

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.